అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం16-10-2024
సంపుటి : 10 | సంచిక : 237 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

నేడు జమ్ముకాశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం

సీపీఐ(ఎం) నేత ప్రకాశ్‌కరత్‌తో సహా వివిధ పార్టీల నేతలు హాజరు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ము కాశ్మీర్‌లో మొదటగా ఎన్నికైన ప్రభుత్వం నేడు కొలువుదీరనుంది. ఈ రాష్ట్ర పదో సీఎంగా, విభజిత జమ్ముకాశ్మీర్ మొదటి ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం ఉదయం 11:30 గంటలకు శ్రీనగర్‌లోని ఎస్‌కె ఇంటర్నేషనల్ ...11లో

దేశ రక్షణలో

రాజకీయాలొద్దు

వీఎల్ఎఫ్ ప్రాజెక్ట్ దేశానికి అత్యంత ఉపయోగకరం



- పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదు
- అబ్దుల్ కలాం జయంతి రోజున శంకుస్థాపన హర్షణీయం
- సీఎం రేవంత్ అండదండలు మరువలేనివి : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- దేశ రక్షణలో తెలంగాణ కీలకం
- ఈ నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనివే
- నేవీ విద్యాసంస్థల్లో స్థానిక విద్యార్థులకు అవకాశం కల్పించాలి
- కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- దామగుండంలో కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్(నేవీ రాడార్ కేంద్రం)కు శంకుస్థాపన

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

'దేశ భద్రత విషయంలో రాజకీయాలు వద్దు.. మేము రాజకీయం చేయడం లేదు. బలమైన, భద్రత కోసం వీఎల్ఎఫ్ స్టేషన్లు మన దేశానికి అత్యంత ముఖ్యమైనవి. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి రోజున నేవీ రాడార్ కేంద్రానికి శంకుస్థాపన చేయడం హర్షనీయం..' అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న వీఎల్ఎఫ్ (వెరీలో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్ (నేవీ రాడార్ కేంద్రం)కు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం నేవీ దళ ప్రధాన అధికారి దినేష్ త్రిపాఠి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. కమ్యూనికేషన్ రంగంలో పావురాలు, గుర్రాల నుంచి ఇక్కడికి వచ్చామన్నారు. తపాలా వ్యవస్థను అనేక ఏండ్లుగా ఉపయోగించుకున్నామని చెప్పారు. ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగమని, సమాచారం క్షణాల్లో చేరుతోందని అన్నారు. 30 ఏండ్ల నుంచి మన దేశం కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేస్తోందన్నారు. దేశం బలమైన మిలిటరీని నిర్మించడానికి కట్టుబడి ఉందన్నారు. రక్షణ రంగం పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుందని, ...11లో

నిర్బంధాల మధ్యే నేవీ రాడార్‌కు శంకుస్థాపన

దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న నేవీ రాడార్ శంకు స్థాపన నిర్బంధాల మధ్యే కొన సాగింది. కార్యక్రమాన్ని అడ్డుకుంటారన్న ఉద్దేశంతో సోమవారం అర్ధరాత్రి నుంచే పోలీసులు బీఆర్ఎస్, సీపీఐ(ఎం), ప్రజాసంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. దామగుండం పరిసర ప్రాంతాల్లో ...11లో

రాడార్ స్టేషన్ దేశభద్రతకు కీలకం

దీనిపై రాజకీయాలు తగవు
1500 చెట్లను రీలోకేట్ చేస్తారు..
లక్షల చెట్లను నరికేయరు
వందలాది మంది స్థానికులకు ఉద్యోగావకాశాలు 11లో..
బీఆర్ఎస్ సర్కారే అనుమతులిచ్చి ఇప్పుడు ఆందోళనలు అనటం దుర్మార్గం : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



ఎన్నికల్లో ఉచిత హామీలపై కేంద్రం, ఈసీలకు

సుప్రీం నోటీసులు

స్పందన తెలియజేయాలంటూ ఆదేశాలు

న్యూఢిల్లీ : ఎన్నికల ప్రచారాల్లో రాజకీయ పార్టీలు చేసే ఉచిత వాగ్దానాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై భారత సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రాన్ని, ఎన్నికల కమిషన్(ఈసీ)ను కోరింది. బెంగళూరుకు చెందిన శశాంక్ జె శ్రీధర దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ జె.బి పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపి పై చర్యలు తీసుకున్నది.

శశాంక్ పిటిషన్‌ను అడ్వొకేట్ శ్రీనివాసన్ కోర్టుకు సమర్పించారు. ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఉచిత హామీలు ఇవ్వకుండా నిరోధించేలా ఈసీ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. అనియంత్రిత ఉచిత హామీలు ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పడేలా చేస్తాయనీ, ఓట్లు పొందిన తర్వాత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చటానికి ఎలాంటి యంత్రాంగమూ లేదని తెలిపింది. ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న పలు కేసులతో కలిపి దీనిని విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. తక్షణ విచారణ జరపాలన్న సీనియర్ అడ్వొకేట్ విజయ్ హన్సారియా, పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగెంట్ అశ్వినీ ఉపాధ్యాయుల అభ్యర్థన తర్వాత కోర్టు పై విధంగా స్పందించింది.

ఉచిత వాగ్దానాలు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నాయనీ, రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించే ప్రజాకర్షక చర్యలపై పూర్తిగా నిషేధం విధించాలని ఉపాధ్యాయ్ తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. అలాగే, ఈ పద్ధతిని అరికట్టడానికి చర్యలను తీసుకోవాలని ఈసీని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చే అహేతుకమైన ఉచిత హామీలు ఓటర్లను ప్రభావితం చేస్తాయనీ, దీంతో ఎన్నికల ప్రక్రియ సమగ్రత దెబ్బ తింటుందని వివరించారు.

మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు

మోగిన నగారా

షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ



మహారాష్ట్రకు నవంబర్ 20న పోలింగ్
జార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో రెండు దశల్లో
రెండు లోక్‌సభ, 48 శాసనసభ స్థానాల్లో ఉప ఎన్నికలకూ షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రెండు రాష్ట్రాలకు ఎన్నికల నగారా మోగింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఈసీ ప్రకటించింది. ఇందుకోసం అక్టోబర్ 22న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు పేర్కొంది. 29వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణకు గడువు ఉండగా.. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 4 వరకు గడువు ఉంటుంది. ఇక నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించి.. 23న ఫలితాలు వెల్లడించనున్నట్టు ఈసీ వివరించింది. రాష్ట్రంలో మొత్తం 9.63 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. 1,00,186 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. కాగా, నవంబర్ 26తో మహారాష్ట్ర అసెంబ్లీ గడువు ముగియనుంది.మరోవైపు జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు కూడా ఈసీ షెడ్యూల్ విడుదల ...11లో

వయనాడ్ బరిలో ప్రియాంకా గాంధీ

11లో..



అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ఖర్గే ఎంపిక
ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడి



ప్రజలకు సేవ చేయరా?

ఐఏఎస్‌లకు క్యాట్ సూటి ప్రశ్న

- ఏపీకి వెళ్లాల్సిందే
- పిటిషన్ల తిరస్కరణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ క్యాట్‌లో పిటిషన్లు వేసిన ఐఏఎస్‌లకు చుక్కెదురైంది. ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిందేనని స్పష్టం చేస్తూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్) స్పష్టం చేసింది. ఈనెల తొమ్మిదిన కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను రద్దుచేయాలని కోరుతూ క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, కె.ఆమ్రపాలి, ఏ. వాణిప్రసాద్, డి.రొనాల్డ్‌రాస్, జి. సృజనకు అక్కడ ఊరట లభించలేదు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా క్యాట్ కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఏపీలో ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతున్నారు..అలాంటి చోటుకు వెళ్లి వారికి సేవచేయాలని మీకు లేదా ? ఐఏఎస్‌ల కేటాయింపులపై డీవోపీటీకి పూర్తి అధికారాలు ఉన్నాయి. స్థానికత ఉన్నప్పటికీ స్వాపింగ్ చేసుకునే అవకాశం మార్గదర్శకాల్లో ఉందా ?' అని క్యాట్ ఐఏఎస్‌లను ప్రశ్నించింది. ఏక సభ్య కమిటీ సిఫారసులను డీవోపీటీ పట్టించుకోవడం లేదని ఐఏఎస్ అధికారుల తరపు న్యాయవాది క్యాట్ దృష్టికి తెచ్చారు. సింగిల్‌మెన్ కమిటీ సిఫారసుల ఆధారంగా కేంద్రం ఉత్తర్వులు జారీచేసే ముందు కమిటీ నివేదికను ఇవ్వలేదన్నారు. ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, వాణిప్రసాద్, ఆమ్రపాలి, రొనాల్డ్‌రాస్ తదితరులు కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏపీకి వెళ్లాల్సి ఉంది. అలాగే ఏపీలో పనిచేస్తున్న సృజన తెలంగాణకు రావాల్సి ఉంది. ప్రస్తుతం తాము పనిచేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగించేలా ఉత్తర్వులు జారీచేయాలనీ, కేంద్రం జారీ చేసిన కేటాయింపు ఉత్తర్వులను రద్దుచేయాలని ఐఏఎస్‌లు తమ పిటిషన్‌లో కోరారు. కేటాయింపుల సమయంలో కేంద్రం తమ అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దుచేయడంతోపాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లోనే కొనసాగేలా మధ్యంతర ...11లో

అదానీ సిమెంట్‌తో అపాయం

ప్రజారోగ్యం, పర్యావరణానికి ప్రమాదం

- ఎన్ఐటీ విశ్రాంత ప్రొఫెసర్ రామచంద్రయ్య
- ప్రతిఘటించకపోతే భవిష్యత్ లేదు :'పట్నం' రాష్ట్ర కార్యదర్శి డిజి
- రామన్నపేటలో అఖిలపక్షం, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సదస్సు



నవతెలంగాణ- రామన్నపేట

ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీసే సిమెంటు పరిశ్రమ ఏర్పడితే దాని కాలుష్యం ఫలితంగా జీవకోటి మనుగడకు ముప్పు తప్పదని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్రాంత ఆచార్యులు ఎ.రామచంద్రయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో నిర్మించతలపెట్టిన అదానీ గ్రూపు అంబుజా సిమెంటు పరిశ్రమను వ్యతిరేకిస్తూ మంగళవారం స్థానిక రహదారి బంగ్లాలో అఖిలపక్ష పార్టీలు, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. 600 మంది వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ.. సిమెంటు పరిశ్రమ ద్వారా ఎగిసిపడే దుమ్ము, దూళితో వాయు, శబ్ద, జల కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ప్రజా జీవనవ్యవస్థను స్తంభింపజేసే సిమెంటు పరిశ్రమకు వ్యతిరేకంగా ముందుగానే రాజకీయాలకతీతంగా పోరాడాలన్నారు. సిమెంట్‌లో కలిపే రసాయనాల మూలంగా ప్రజలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పరిశ్రమ ఏర్పడితే అభివృద్ధి జరుగుతుందనే ప్రచారం అశాస్త్రీయమన్నారు. గ్రామాల అభివృద్ధి తిరోగమనంలో ఉంటుందన్నారు. పచ్చని పొలాల్లో మంటలు పెట్టి భూముల ధరలు తగ్గించే కుట్రకు బలి కావద్దన్నారు. సిమెంటు పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థ రసాయనాలైన జిప్సం, స్లాగ్, క్లింకేర్, బొగ్గు, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ వంటి ప్రతిరోజూ గాలిలో కలవడంతో ప్రాణాంతక ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. చర్మ రోగాలు, గర్భస్రావాలు, చిన్నపిల్లల్లో ఎదుగుదల లోపించడం, కంటి చూపు ...11లో



జీవో 81,85 ప్రకారం

ఉద్యోగాలివ్వాలి

ప్రజా భవన్‌లో వీఆర్ఏల మాస్ రిప్రజెంటేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్.

వీఆర్ఏ వారసులకు జీవో 81, 85ల ప్రకారం వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్ఏ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ (వీఆర్ఏ జేఏసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ ఇన్‌చార్జి దివ్య దేవరాజన్,ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి సామూహిక వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వెయ్యి మందికి పైగా వీఆర్ఏలు, వారి వారసులు హాజరయ్యారు. వినతి పత్రాలు స్వీకరించిన అధికారులు స్పందిస్తూ సీఎం, రెవెన్యూ శాఖ మంత్రితో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ...10లో

పేదలపై పెనుభారం

ఎనిమిది ఔషధాల ధరలు పెంపు
యాభై శాతం మేర పెరుగుదల
'ప్రజా ప్రయోజనాల రీత్యా' అంటూ ప్రభుత్వం ముక్తాయింపు 3లో..

మహాయుతి డీలా

పుంజుకుంటున్న ఎంవీఏ
మహారాష్ట్రలో మారుతున్న రాజకీయాలు 3లో..



సీఎం రేవంత్‌తో కొండా భేటీ

వరుస వివాదాలపై చర్చ..
జాగ్రత్తగా ఉండమని మందలింపు ?
11లో..



అద్దె భవనాల్లో గురుకులాలు

1023 పాఠశాలల్లో 361కే సొంత భవనాలు

బాత్రూంలు, స్నానాలకోసం గంటలపాటు క్యూ
క్లాస్ రూముల్లోనే పడక
గాలి, వెలుతురు అంతంతే
ప్రహరీ, ప్లే గ్రౌండ్ మచ్చుకైనా లేవు
ఇదీ మన రెసిడెన్షియల్ పాఠశాలల దుస్థితి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో ప్రస్తుతమున్న గురుకులాలు 1023. వీటిలో కేవలం 361 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. మిగతా 662 గురుకులాలు అద్దె భవనాల్లోనే కునారిల్లుతున్నాయి. రాష్ట్రంలో 70శాతానికిపైగా సంక్షేమ గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయన్న మాట. అవన్నీ విద్యార్థుల వసతిగృహాల స్వభావం లేని భవనాలు కావటంతో సమస్యలకు నిలయాలుగా మారాయి. విద్యార్థులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఊడిపోయిన బాత్రూం తలుపులు, పగిలిన కిటికీలు, తిరగని ఫ్యాన్లు, పాడైన నల్లా ట్యాపులు, సెప్టిక్ ట్యాంకు సమస్యలు.. ఇలా అనేక సమస్యలు దర్శనమిస్తున్నాయి. పరిష్కారానికి పూనుకోవాల్సిన సర్కార్ మీనమేషాలు లెక్కిస్తున్నది. మాటలు ఘనం. చేతలు శూన్యమన్నట్టుగా గురుకులాల నిర్వహణ ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సమస్యలకు నిలయాలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సొంత భవనాల నిర్మాణానికి కృషి చేయకుండా అద్దె భవనాల్లో రెసిడెన్షియల్ గురుకులాల ఏర్పాటుకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది. దీంతో అవి సమస్యలకు నిలయాలుగా మారాయి. మూతపడ్డ ఇంజినీరింగ్ కళాశాలలు, కోళ్లఫారాలు, మండపాలే రెసిడెన్షియల్ విద్యాలయాలుగా మారాయి. ప్రతి ఏడాది పాఠశాలలను పెంచటం, అప్‌గ్రేడ్ చేయటం తప్పితే..వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించటంపై గత సర్కారు దృష్టి పెట్టలేదు. విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా బాత్రూమ్‌లు ఏ ఒక్క పాఠశాలలో లేవు. ప్రభుత్వ నియమాల ప్రకారం ఏడుగురికి ఒక బాత్రూం ఉండాలి. కానీ.. 20మంది విద్యార్థులకు ఒకటి చొప్పున ఉన్నాయంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కొన్నింటికి ప్రహరీగోడలు లేవు. మరి కొన్నింటికి కిటికీలు ఊడిపోయాయి. ఇంకొన్ని భవనాల్లో చదువు, పడక ఒక్క చోటనే..! గాలి, వెలుతురు సరిగా లేని గదుల్లో విద్యార్థుల అవస్థలు నరకాన్ని తలపిస్తున్నాయి.

అద్దెలకే ప్రాధాన్యత

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ గురుకుల సొసైటీల పరిధిలోని సుమారు 662 గురుకులాలు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. నిర్వహణ కోసం ఒక్కో గురుకులానికి నెలకు రూ. 20వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తున్నా..అవి ...10లో



గురుకులాలకు

తాళాలు

అద్దె బకాయిలు చెల్లించాలని యజమానుల హెచ్చరిక
గేట్ల ముందు విద్యార్థులు, తల్లిదండ్రుల నిరీక్షణ
కొన్ని చోట్ల తాళాలు తీసిన యజమానులు
క్రిమినల్ కేసులు పెట్టాలని అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు 10లో..



అడవిలో వదిలేశారు

- చచ్చామా.. బతికామా అని ఎవరూ చూడట్లే..
- కనీస సౌకర్యాలు కరువు
- నిధుల్లేక మధ్యలో ఆగిన నీటి ట్యాంకుల నిర్మాణం
- చస్తే పెట్టనీకీ జాగా లేదు
- మల్లన్నసాగర్ నిర్వాసితుల దుస్థితి



నవ తెలంగాణ-గజ్వేల్

ప్రాజెక్టు పేరుతో ఉన్న గ్రామాలను ఖాళీ చేయించి అడవిలో వదిలేశారు.. అక్కడే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించిచ్చారు.. కానీ కనీస సౌకర్యాలు మరిచారు.. ఎలా బతుకుతున్నారో కూడా ఎవరూ ఆ వైపు చూసిన పాపాన పోవడం లేదు.. బస్సు సౌకర్యం లేదు.. నీటి ట్యాంకర్ల నిర్మాణం మధ్యలోనే ఆగింది. ప్యాకేజీ, ప్లాట్లు అందరికీ అందలేదు.. ఉపాధి లేక యువత దుర్వ్యసనాలకు బానిసలవుతున్నారు.. రైతులు కూలీల అవతారమెత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం కాలం చేసే వ్యక్తులకు అంత్యక్రియలకూ శ్మశాన వాటిక లేదు.. ఇదీ గజ్వేల్ మున్సిపాలిటీలో ఉన్న మల్లన్నసాగర్ నిర్వాసితుల కాలనీవాసుల దుస్థితి.

సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో భూములు, ఇండ్లను కోల్పోయిన అనేక మందికి ఇంకా ప్యాకేజీ, పరిహారం అందక ఎదురుచూపులు తప్పడం లేదు. మూడేండ్ల కిందట గజ్వేల్‌కు కట్టుబట్టలతో వచ్చిన భూనిర్వాసితులకు రావాల్సిన అనేక పరిహారాలు, ప్లాట్లు ఇప్పటికీ దక్కకపోవడంతో కాగితాలు పట్టుకుని తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఒంటరి మహిళలు, 18 ఏండ్లు పైబడిన యువతీ, యువకులకు సంబంధించిన పరిహారాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటన్నింటిపై అధికారులు పలుమార్లు సమీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో వారు సైతం ఏమీ చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి లేదా ఇతర మంత్రులు ఈ విషయమై ఇప్పటివరకు సమీక్ష చేయకపోవడం గమనార్హం.

పట్టణానికి దూరంగా..

మల్లన్న సాగర్ నిర్వాసితులను గజ్వేల్ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరానికి తరలించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివాసం ఉంచారు. అక్కడికి బస్సు సౌకర్యం లేదు. ద్విచక్ర వాహనాలు ఉన్నవారు గజ్వేల్‌లో పనులు చేసుకుని తిరిగి వెళుతున్నారు. వాహనాలు లేనివారు ఆటోల కోసం గంటల తరబడి నిరీక్షించాలి. మల్లన్న సాగర్ పరిధిలో ఎక్కడా ప్రయాణ ప్రాంగణాలు నిర్మించలేదు. ఇంకా వాటర్ ట్యాంకులు పూర్తి కాలేదు. నిధులు లేక చాలా చోట్ల పనులు నిలిచిపోయాయి. ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నప్పటికీ పైప్ లైన్ ద్వారా కొంత తాగునీటి సమస్య ఉందని ఆయా గ్రామస్తులు తెలిపారు.

కూలీలుగా మారిన నిర్వాసితులు

నిర్వాసితులు కూలీ పనులకు వెళ్లాల్సి వస్తున్నది. యువత చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. ప్యాకేజీ, పరిహారం, ప్లాట్లు రాని వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విసిగివేసారి పోతున్నారు. వీరి సమస్యలపై బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించే నాథుడే లేకపోవడంతో భూనిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన రేవంత్ రెడ్డి, బీజేపీ అగ్ర నేతలు మల్లన్నసాగర్ నిర్వాసితులకు అన్ని వసతులూ కల్పిస్తామని హామీలు ఇచ్చారు. కానీ ఇంతవరకు సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు.

మల్లన్న సాగర్ విస్తీర్ణం

మల్లన్న సాగర్ జలాశయంలో 8 గ్రామపంచాయతీలు, ఆరు మదిరే గ్రామాలు, 17వేల ఎకరాల భూసేకరణతో ప్రాజెక్టును 24 కిలోమీటర్ల చుట్టూ గుండ్రంగా నిర్మించారు. 60 మీటర్ల ఎత్తులో ఉంది. మల్లన్న సాగర్ పరిధిలో వేములగట్టు, ఏటిగడ్డ కృష్టాపూర్, పల్లె పహాడ్, లక్ష్మాపూర్, బంజేరుపల్లి, ఎర్రవల్లి, సింగారం గ్రామపంచాయతీలు ఉన్నాయి. మరో 6 మదిరే గ్రామాలు అనుసంధానంగా ఉన్నాయి.

ఊరిని వదిలి వచ్చాం
పులి అంజయ్య, ఏటిగడ్డ కృష్టాపురం

కాలం మూడి చనిపోతే మృతదేహాన్ని ఆమడ దూరం తీసుకుపోయి కాల్చేస్తున్నాం. అక్కడ కూడా స్థలం లేకపోతే మరో చోటుకి వెళ్తున్నాం. సర్కారు పట్టించుకోవాలి. ఇక్కడ బతుకుదెరువు లేదు. ఓట్ల ముందు నాయకులు వచ్చి పోయారు. అన్ని సమస్యలూ తీరుస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు. మళ్లీ కనిపిస్తలేరు.

అన్ని వసతులూ కల్పించాలి
ముచ్చర్ల రాజయ్య, ఎర్రవల్లి

కాలనీ నిర్మించినప్పటికీ, సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎవరైనా చనిపోతే ఆమడ దూరం తీసుకుపోయి అంత్యక్రియలు చేస్తున్నాం. అక్కడ కూడా సౌకర్యాలు లేవు. శ్మశాన వాటిక నిర్మించాలి. మొన్న ఎన్నికల్లో ఓట్లు వేశాం. అన్నీ చేస్తామని వచ్చి చెప్పి వెళ్లారు. ఇప్పటికీ ముఖాలు కనిపిస్త లేవు.

రిజిస్ట్రేషన్ల శాఖలో భారీగా బదిలీలు

- 12 మంది గ్రేడ్-1, ఏడుగురు గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్ల బదిలీ
- ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం 19 మంది సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేసింది. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్-1కు చెందిన వనజ కుమారిని దూద్‌బౌలి నుంచి కాప్రాకు, బి.రాజశేఖరరెడ్డిని శేరిలింగంపల్లి నుంచి రంగారెడ్డి (ఎంపీఏ)కి, గండిపేట సబ్‌రిజిస్ట్రార్ కె.మహేందర్‌ను వికారాబాద్‌కు, జి.జగన్‌మోహన్‌రావును సరూంనగర్ నుంచి గోల్కొండకు (చిట్స్), కె.మధుసూధన్‌రెడ్డిని పరిగి నుంచి రంగారెడ్డికి (ఆర్వో), ఆర్. సతీష్‌కుమార్ కాప్రానుంచి దూద్‌బౌలికి బదిలీ అయ్యారు. కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ జె.సురేందర్‌ను పటాన్‌చెరుకు (ఆర్వో), ఉప్పల్ సబ్‌రిజిస్ట్రార్ ఆర్. సతీష్‌ను మేడ్చల్‌కు (ఎంపీఏ), బి.సురేష్‌ను కూకట్‌పల్లి నుంచి హైదరాబాద్‌కు (ఎంపీఏ), ఎం.రవికాంత్‌ను పటాన్‌చెరు (ఆర్వో) నుంచి కొడంగల్‌కు, బి.శ్రీనివాస్‌ను పటాన్‌చెరు నుంచి పరిగికి, ఘన్‌పూర్ సబ్‌రిజిస్ట్రార్ ఎమ్‌డీ. అమ్జద్‌అలీని జనగామ సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించింది. గ్రేడ్-2కు చెందిన ఎం.బాలకిషన్‌ను రామగుండం నుంచి గండిపేటకు, ఎం.డి.ఆసీఫుద్దీన్‌ను మెట్‌పల్లి నుంచి శేరిలింగంపల్లికి, ఎం.సరితను మెదక్ నుంచి సరూర్‌నగర్‌కు, ఎం.భాస్కర్‌ను సత్తుపల్లి నుంచి మేడ్చల్‌కు, ఎ.గిరిధర్‌ను నర్సంపేట నుంచి కూకట్‌పల్లికి, వి.అశోక్‌ను మోత్‌కూర్ నుంచి కుత్బుల్లాపూర్‌కు, ఎం.డి. అఫ్జలుద్దీన్‌ను నాగర్‌కర్నూల్ నుంచి పటాన్‌చెరుకు బదిలీ చేసింది. పరి పాలనలో భాగంగానే సాధారణ బదిలీలు చేసినట్టు ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది.

నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నర్సింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 19న సాయంత్రం 5 గంటల వరకు పొడిగించారు. ఈ మేరకు మంగళవారం వైద్యారోగ్య సేవల నియామక మండలి సభ్య కార్యదర్శి ఎస్.గోపికాంత్ రెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. అదే విధంగా దరఖాస్తుల్లో సమాచారాన్ని ఎడిట్ చేసుకునేందుకు అక్టోబర్ 21న ఉదయం 10.30 గంటల నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించారు.

డిసెంబర్ 5న చెన్నయ్ నుంచి సౌత్ స్టార్ రైలు ప్రారంభం

- టూర్ టైమ్స్ ఏపీ, తెలంగాణ రీజినల్ డైరెక్టర్ రమేష్ అయ్యంగార్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విగ్నేష్
- సౌత్ స్టార్ రైల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

"కర్నాటక ఆలయాలను సందర్శించే సువర్ణ అవకాశాన్ని టూర్ టైమ్స్ కల్పిస్తున్నది. ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ రైలు పథకం కింద తొలిసారిగా ప్రయివేటు సెక్టార్‌కు చెందిన సౌత్ స్టార్ రైలు డిసెంబర్ 5న చెన్నయ్‌లో ప్రారంభం అవుతుంది.." అని టూర్ టైమ్స్ ఏపీ, తెలంగాణ రీజినల్ డైరెక్టర్ రమేష్ అయ్యంగార్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విగ్నేష్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సౌత్ స్టార్ రైల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ రైలులో 9రోజుల వ్యవధిలో కర్నాటకలోని అత్యంత ప్రముఖ దేవాలయా లు నవ బృందావనం, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, శృంగేరి, హొరనాడు, ధర్మస్థలం, కుక్కి సుబ్రమణ్య, మైసూర్, శ్రీరంగపట్నం, మేల్కోటేలను సందర్శించొచ్చని తెలిపారు. ప్రతి కోచ్‌కూ సీసీటీవీ కెమెరాలు, టూర్ మేనేజర్, సెక్యూరిటీ గార్డ్స్ వంటి అనేక రకాల సౌకర్యాలు ఉన్నాయని, భోజన వసతి కల్పిస్తున్నట్టు చెప్పారు. ఏపీ, తెలంగాణలో ఈ ప్రత్యేక రైలు ఎక్కేందుకు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, నల్లగొండ, మిర్యాలగూడ, సికింద్రాబాద్‌లో అవకాశం ఉందని తెలిపారు. ప్రతి కోచ్‌కూ సెక్యూరిటీ గార్డులు ఉంటారని, సీనియర్ సిటిజన్లకు చక్కటి అవకాశమని, వీరికి సబ్సిడీ సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ ప్రయాణం కోసం లీవ్ ట్రావెల్ కన్సెషన్(ఎల్టీసీ)ని ఉపయోగించవచ్చన్నారు. రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ చేసుకోవచ్చునని చెప్పారు. స్లీపర్ క్లాస్ రూ.27,000, ప్యాకేజీ థర్డ్ ఏసీకి రూ.33,000, థర్డ్ ఏసీ ప్రీమియం రూ.37,000, సెకండ్ ఏసీ రూ.40,000తో ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న యాత్రికులు www.traintour.in లేదా 9355021516 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా శ్రీపాల్ రెడ్డి, మహేందర్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర శాసనమండలికి జరగబోయే రెండు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థులను పీఆర్టీయూటీఎస్ ఖరారు చేసింది. వరంగల్- ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గానికి పింగిలి శ్రీపాల్ రెడ్డి, కరీంనగర్ - మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ నియోజకవర్గానికి వంగ మహేందర్ రెడ్డిని తమ అధికారిక అభ్యర్థులుగా ప్రకటించారు. పింగిలి శ్రీపాల్ రెడ్డి వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట హవేలీ పాఠశాలలో పని చేస్తూ ప్రస్తుతం పీఆర్టీయూటీఎస్ సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. సిద్దిపేట జిల్లాకు చెందిన వంగ మహేందర్ రెడ్డి పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా పని చేస్తూ ఎమ్మెల్సీ బరిలో నిలిచేందుకుగాను ఏడాదిన్నర క్రితమే ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేశారు. సంఘ నియమావళి ప్రకారం 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో వీరిద్దరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బి.మోహన్ రెడ్డి, పూల రవీందర్ , రాష్ట్ర సంఘ మాజీ బాధ్యులు పి.వెంకట్ రెడ్డి, గుర్రం చెన్నకేశవరెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు, గుండు లక్ష్మణ్, ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 406 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 406 దరఖాస్తులు అందాయి. గృహనిర్మాణ శాఖకు 174, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 38, విద్యుత్ శాఖకు 38, మైనార్టీ వెల్ఫేర్ శాఖకు 34, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 30, ఇతర శాఖలకు 92 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మెన్ డాక్టర్ చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు సమాచార, పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

గోనె సంచిలో బాలిక మృతదేహం

- మిస్సింగ్ కేసు విషాదాంతం

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. మిస్సింగ్ అయిన బాలిక.. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ బాసరగడి గ్రామంలో గోనె సంచిలో మృతదేహంగా లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాలికను ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభాకర్ కుమార్తెగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభాకర్ ఏడు నెలల నుంచి తన కుటుంబంతో హైదరాబాద్ సూరారంలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 12న తన కుమార్తె జోష్న(7) కనిపించడం లేదని సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం బాసరగడి గ్రామంలో గోనె సంచిలో బాలిక మృతదేహం లభ్యమైంది. చిన్నారి మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. బాలికను ఎవరు హత్య చేశారు.. ఎందుకు చేశారనే కోణంలో సూరారం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఊరు ఉమ్మడి 'పోడు'ను అమ్మేశారు

- ఓ పార్టీ నాయకుల నిర్వాకం
- కొణిజర్ల పోలీసుస్టేషన్‌లో ఎల్లన్ననగర్ వాసుల ఫిర్యాదు
- అమ్మిన భూమిలో గ్రామస్తులంతా కలిసి పత్తి సేకరణ



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

గ్రామ బాగోగుల కోసం ఊరంతా కలిసి ఉమ్మడిగా పోడు కొట్టుకున్న భూమిని.. ఓ పార్టీకి చెందిన నాయకులు అమ్మడం వివాదానికి దారితీసింది. దీనిపై ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి పంచాయతీ ఎల్లన్ననగర్ వాసులు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. కొనుగోలుదారులు ఆ భూమిలో పత్తి పంట సాగు చేశారు. ఆ పంటను గ్రామస్తులంతా మూకుమ్మడిగా సేకరించారు. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..

నాడు పోడు కొట్టించారు.. నేడు భూమి అమ్ముకున్నారు..

ఏ పార్టీకి చెందిన నాయకులైతే ఎల్లన్ననగర్ వాసుల చేత 2015 మార్చి 20వ తేదీన పోడు కొట్టించారో.. నేడు అదే నాయకులు గ్రామస్తులకు తెలియకుండా భూమిని అమ్ముకున్నారు. మొత్తం 150 కుటుంబాలు, 560 మంది జనాభా ఉన్న ఎల్లన్ననగర్ గ్రామ అవసరాలు, అభివృద్ధి కోసం పోడు కొట్టిన భూమిలో పది ఎకరాలు కేటాయించారు. ఆ భూమిలో పంటలు సేద్యం చేసి.. వాటి ద్వారా వచ్చిన డబ్బులను గ్రామాభివృద్ధికి వినియోగించాలనే నియమం పెట్టారు. పొరుగున ఉన్న రామనర్సయ్య నగర్‌లోనూ ఇదే నియమం ఉంది. దాదాపు 36 ఏండ్లుగా ఆ గ్రామస్తులు ఊరు ఉమ్మడి భూమి ద్వారా వచ్చిన సంపాదనతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. అదే విధానం ఎల్లన్ననగర్‌లో కూడా అమలు కావాలి. కానీ అది జరగట్లేదు. దీనిపై గ్రామస్తులు కొంతకాలంగా సంబంధిత పార్టీ నాయకులను నిలదీస్తున్నారు. కానీ వారు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ఆ భూమిని అమ్ముకున్నట్టు తెలియడంతో కొనుగోలుదారులు సేద్యం చేసిన పత్తి పంటను గ్రామస్తులంతా కలిసి సేకరించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎకరం రూ.3.60 లక్షల చొప్పున విక్రయం

ఎల్లన్ననగర్ సమిష్టి పోడు భూమిని ఓ పార్టీ జిల్లా కార్యదర్శి జీవీఆర్ (గోకినేపల్లి వెంకటేశ్వరరావు), డివిజన్ కార్యదర్శి అర్జున్‌రావు మండలంలోని తీగలబంజర వాసులకు విక్రయించారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎకరం రూ.3.60లక్షల చొప్పున 8.20 ఎకరాల భూమిని తీగలబంజరకు చెందిన నూనావత్ శ్రీనుకు అమ్మినట్టు తెలిపారు. ఈ భూమి క్రయవిక్రయాలకు సంబంధించి గ్రామస్తులకు ఎలాంటి సమాచారమూ లేదని ఫిర్యాదులో స్పష్టం చేశారు. గ్రామ సమిష్టి భూమిని అమ్మే హక్కు ఎవరికీ లేదు కాబట్టి.. దానిలో వేసిన పత్తినితాము సేకరించామని 85 మంది సంతకాలతో కూడిన ఫిర్యాదు పత్రాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమర్పించటం చర్చనీయాంశంగా మారింది.

నిరంతర అధ్యయనశీలి కలాం

- ప్రతి అంశంపై అధ్యయనం తర్వాతే ఆచరణలోకి : ఎస్.ఆర్. శంకరన్ ఐఏఎస్ అకాడమీ అడ్వైజర్ అండ్ చీఫ్ గార్డినర్ వై.సత్యనారాయణ
- అబ్దుల్ కలాం 93వ జయంతి కార్యక్రమం



నవతెలంగాణ-ముషీరాబాద్

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గొప్ప శాస్త్రవేత్త అని, నిరంతరం అధ్యయనం చేసే వారని కమర్షియల్ టాక్సెస్ మాజీ అడిషనల్ కమిషనర్, ఎస్.ఆర్.శంకరన్ ఐఏఎస్ అకాడమీ అడ్వైజర్ అండ్ చీఫ్ గార్డినర్ వై.సత్యనారాయణ అన్నారు. కలాం ప్రతి అంశంపైనా అధ్యయనం చేసిన తర్వాతే ఆచరణలో పెట్టేవారని చెప్పారు. హైదరాబాద్ చిక్కడపల్లిలోని ఎస్ఆర్.శంకరన్ ఐఏఎస్ అకాడమీలో ప్రిన్సిపాల్ కె.సురేందర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. కలాం జీవితాన్ని చదివితే కచ్చితంగా లక్ష్యసాధన సాధ్యమవుతుందని అన్నారు. ఆయన లాంటి వ్యక్తులు సమాజంలో ఉన్నత స్థానాల్లో రాణిస్తారని, అందుకు ఆయన జీవితం ఉదాహరణగా చెప్పారు. కలలు కనండి.. వాటి సాకారానికి కృషి చేయండని ఆయన చెప్పిన మాట చిన్న విషయం కాదన్నారు. చాలామంది దానిని నిద్రపోయి కలగనడం అనుకుంటున్నారని.. కానీ మనం సమాజానికి ఏం చేయగలం, మన జీవితం ఉన్నతంగా ఒక లక్ష్యం వైపు వెళ్లాలంటే ఏం చేయగలం అనే ఆలోచనలు చేయడమే వారు చెప్పిన కొటేషన్ అర్థం అని వివరించారు. మనిషి జననానికి అర్థం ఉందో లేదో తెలియదు కానీ మరణానికి మాత్రం కచ్చితంగా అర్థాన్ని చూపించాలని చెప్పిన గొప్ప వ్యక్తి కలాం అని కొనియాడారు. తాను నేర్చుకున్న విషయాలను నిత్యం ముఖ్యంగా యువతకు నేర్పించాలనే పట్టుదల వారిలో కనబడేదని, చివరి వరకు బోధిస్తూనే ఉన్నారని చెప్పారు. ప్రతి విద్యార్థి కూడా కలాం జీవితాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. కె.సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో రెండు రకాల ధోరణులు ముందుకు వెళ్తున్నా యని, ఒకటి ఆధ్యాత్మికమైతే.. మరొకటి సైన్స్ అని తెలిపారు.

కలాం నిరంతరం సైన్స్ వైపే నిలబడ్డారని, సైన్స్ మాత్రమే సమాజాన్ని మరింత అభివృద్ధి వైపు తీసుకెళ్తుందని అన్నారు. అకాడమీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.సతీష్ కుమార్ మాట్లాడుతూ.. మొదటి విజయం సాధించిన తరువాత రెండు లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించొద్దని కలాం చెప్పిన మాటను మనం నిరంతరం గమనంలో ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ కోట మురళీకృష్ణ, కార్యాలయ సిబ్బంది సంధ్యారాణి, రంజిత్ కుమార్, సుమన్ థలోడ్, బి.రాజేందర్, అల్లు వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ బైపాస్ రోడ్డుకు రూ.516 కోట్లు మంజూరు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

జాతీయ రహదారి నెంబరు 565లో నల్లగొండ పట్టణం గుండా సాగే నకిరేకల్-నాగార్జునసాగర్ మార్గంలో ట్రాఫిక్‌రద్దీని తగ్గించేందుకు రూ.516 కోట్లతో 14 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల బైపాస్‌రోడ్డును నిర్మించనున్నారు. ఈమేరకు నిధులు మంజూరు చేస్తున్నట్టు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల అనుసంధానానికి 565 జాతీయ రహదారి అత్యంత ప్రధానమైంది. తెలంగాణలో నకిరేకల్ కూడలి నుంచి మొదలయ్యే ఈ జాతీయ రహదారి నల్లగొండ, ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల, ఎర్రగొండపాలెం, కనిగిరి మీదుగా సాగుతుంది. ప్రస్తుతం నల్లగొండ నుంచి సాగే సెక్షన్‌లో భారీగా వాహనాల రద్దీ ఉంటున్నది. తాజాగా మంజూరు చేసిన బైపాస్ రోడ్డు నిర్మాణం మూలంగా నల్లగొండ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతోపాటు నకిరేకల్-నాగార్జునసాగర్ మధ్య అనుసంధానం మెరుగవడంతోపాటు సురక్షితమైన ప్రయాణానికి దోహదం చేస్తుంది.

కేంద్రం నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

మహాయుతి డీలా

పుంజుకుంటున్న ఎంవీఏ

- మహారాష్ట్రలో మారుతున్న రాజకీయాలు



ముంబయి : మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ హడావిడి మొదలైంది. హర్యానాలో హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్న బీజేపీ మరాఠా కోటలో కూడా పాగా వేయాలని ప్రయత్నిస్తోంది. అయితే కమలదళంలో కానీ, అధికార కూటమిలో భాగస్వామ్య పక్షాలైన ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ పార్టీలలో కానీ ఏ కోశానా ఉత్సాహం కన్పించడం లేదు. రిజర్వేషన్ కోసం మరాఠాలు, ఓబీసీలు సాగించిన ఆందోళన మొదలు కొని సోయాబీన్, చెరకు రైతులలో అసంతృప్తి, ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో తగిలిన ఎదురు దెబ్బలు, అధికార కూటమిలో కుమ్ములాటల వరకూ...మహాయుతి ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీనికితోడు ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య నేపథ్యంలో రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతి భద్రతల పరిస్థితిపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. మరోవైపు ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) ఎన్నికలకు సిద్ధమవుతోంది. హర్యానాలో ఎదురైన ఓటమితో కాంగ్రెస్ కొంత వరకూ డీలా పడింది. అయినా ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో సాధించిన ఫలితాలు కాంగ్రెస్‌తో పాటు మిత్రపక్షాలైన శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీలలో ఆశలు రేపుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పునరావృతం అయితే రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది తామేనని ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

2019 శాసనసభ ఎన్నికల తర్వాత మహారాష్ట్రలో అనేక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. శివసేన, ఎన్సీపీ పార్టీలు నిట్టనిలువునా చీలిపోయాయి. చివరికి బీజేపీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన కలిసి మహాయుతి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. షిండే ముఖ్యమంత్రి అయ్యారు. 2023 జులైలో అజిత్ పవార్ నేతృత్వంలో కొంతమంది ఎన్సీపీ నేతలు వేరు కుంపటి పెట్టి మహాయుతి ప్రభుత్వంలో చేరారు. ఇందుకు ప్రతిఫలంగా అజిత్ పవార్‌ను ఉప ముఖ్యమంత్రి పదవి వరించింది. అయితే



అతి విశ్వాసం వద్దు : మహారాష్ట్ర నేతలకు రాహుల్ హెచ్చరిక

అతి విశ్వాసం తగదని, రాబోయే శాసనసభ ఎన్నికలలో కలసికట్టుగా కృషి చేసి విజయం సాధించాలని మహారాష్ట్ర పార్టీ నేతలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సూచించారు. మహారాష్ట్రకు చెందిన సీనియర్ నేతలతో పార్టీ కేంద్ర నాయకత్వం సోమవారం సమావేశమైంది. హర్యానా ఎన్నికలలో తగిలిన ఎదురు దెబ్బల నేపథ్యంలో ప్రతి అడుగూ జాగ్రత్తగా వేస్తూ ముందుకు సాగాలని వారిని కోరింది. మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభ ఎన్నికలు ఇండియా కూటమికి కీలకంగా మారాయి. హర్యానా, జమ్మూకాశ్మీర్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేక పోయింది. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీని మెజారిటీకి దూరం చేయగలిగిన కాంగ్రెస్... హర్యానా, జమ్మూ కాశ్మీర్ ఎన్నికలలో అతి విశ్వాసాన్ని కనబరచింది. కానీ ఫలితాలు ఆ పార్టీని నిరాశలో ముంచేశాయి. ఇప్పుడు మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో విజయాన్ని సాధించాలని కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలు పట్టుదలగా ఉన్నాయి. మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్ పవార్) మధ్య సీట్ల సర్దుబాటు కుదుర్చుకోవడం కీలకంగా మారింది.

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలు అధికార కూటమికి షాక్ ఇచ్చాయి. ఫిరాయింపు రాజకీయాలను ఓటర్లు తిరస్కరించారు. న్యాయస్థానాలు తిరుగుబాటుదారులకే పార్టీ పేరు, గుర్తు ఇచ్చినప్పటికీ ప్రజలు మాత్రం ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్ నాయకత్వాలకే జై కొట్టారు. బీజేపీ తాను పోటీ చేసిన 28 స్థానాలలో కేవలం తొమ్మిదింటిని మాత్రమే గెలుచుకుంది. 2019 ఎన్నికలలో ఆ పార్టీకి 23 స్థానాలు లభించాయి. శివసేన బలం కూడా 15 నుండి 7కు, ఎన్సీపీ బలం 4 నుంచి ఒకటికి పడిపోయింది. 2019లో బీజేపీకి 27.8 శాతం ఓట్లు రాగా తాజా ఎన్నికలలో 26.2 శాతం వచ్చాయి. శివసేన ఓటింగ్ 23.5 శాతం నుండి 13 శాతానికి, ఎన్సీపీ ఓటింగ్ 15.5 శాతం నుండి 3.6 శాతానికి తగ్గింది. ఆయా పార్టీలలో ఏర్పడిన చీలికలే దీనికి కారణం. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన 16.5 శాతం ఓట్లతో 9 స్థానాలను, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ 10.3 శాతం ఓట్లతో 8 స్థానాలను గెలుచుకున్నాయి.

మహారాష్ట్రలో ఏర్పడిన వ్యవసాయ సంక్షోభం కారణంగా అన్నదాతలు అధికార కూటమిపై ఆగ్రహంతో ఉన్నారు. దీనికితోడు రిజర్వేషన్ల కోసం మరాఠాలు జరిపిన ఆందోళన మహాయుతి ప్రభుత్వాన్ని కలవరపెట్టింది. రిజర్వేషన్లపై దళితులు కూడా అధికార కూటమికి దూరమైపోయారు. మరోవైపు ఎంవీఏకు 30 లోక్‌సభ స్థానాలు లభించాయి. కాంగ్రెస్ తాను పోటీ చేసిన 17 స్థానాలలో 13 సీట్లను గెలుచుకుని అతి పెద్ద పార్టీగా అవతరిం చింది. శివసేన (యూబీటీ) 21 స్థానాలకు పోటీ చేసి 9 సీట్లను, ఎన్సీపీ (పవార్) 10 సీట్లకు పోటీ చేసి ఎనిమిది స్థానాలను గెలుచుకున్నాయి. ఓట్ల శాతం విషయానికి వచ్చే సరికి రెండు కూటముల మధ్య హోరాహోరీ పోరే నడిచింది. ఎంవీఏకు 43.71 శాతం, మహాయుతికి 43.55 శాతం ఓట్లు లభించాయి.

ఎన్నికల వేళ అజిత్‌కు ఎదురు దెబ్బ

పవార్ గూటికి చేరనున్న ఎమ్మెల్యే



మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన తరుణంలో అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి ఎదురు దెబ్బ తగిలింది. సతారా జిల్లా పార్టీ అధ్యక్షుడు సంజీవ్ రాజె నాయక్-నింబాల్కర్ ఎన్సీపీ (అజిత్)కి రాజీనామా చేసి, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ గూటికి చేరబోతున్నారు. ఫాల్టన్ సిట్టింగ్ ఎమ్మెల్యే దీపక్ చవాన్ కూడా పవార్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. సంజీవ్ రాజె సోదరుడు, ఎమ్మెల్సీ రామ్ రాజె నాయక్ నింబాల్కర్ మాత్రం పార్టీ లోనే ఉంటానని, అయితే ఎన్నికల ప్రచారానికి వెళ్లబోనని స్పష్టం చేశారు. తాము గతంలో భౌతికంగా మాత్రమే పార్టీని వీడామని, కానీ మానసికంగా శరద్ పవార్‌తోనే ఉన్నామని సంజీవ్ రాజె తెలిపారు. నాయక్- నింబాల్కర్ రాజకుటుంబానికి సతారా, దాని పొరుగు జిల్లాలో మంచి పేరుంది. ఈ కుటుంబం చేరికతో శరద్ పవార్ పార్టీకి బలం చేకూరినట్లయింది. మహాయుతితో తనకు చేదు అనుభవాలు ఎదురయ్యాయని సంజీవ్ రాజె చెప్పారు. కాగా మహాయుతితో తాను ఎన్నడూ సౌకర్యవంతంగా లేనని సిట్టింగ్ ఎమ్మెల్యే దీపక్ చవాన్ చెప్పారు.

లోక్‌సభ ఎన్నికలకు ముందు సోలాపూర్ ప్రాంతానికి చెందిన మోహితే-పాటిల్ కుటుంబాన్ని శరద్ పవార్ తన గూటికి చేర్చారు. కొద్ది రోజుల క్రితం కొల్హాపూర్‌కు చెందిన సమర్‌జీత్ సింగ్ ఘాట్గే, ఇందాపూర్‌కు చెందిన హర్షవర్ధన్ పాటిల్ కూడా శరద్ పార్టీలో చేరారు. వీరందరూ ఆయన ప్రాంతాలలో ప్రభావం చూపగలిగిన నేతలే.



లెఫ్టినెంట్ గవర్నర్‌పై

పిటిషన్ తిరస్కృతి

హైకోర్టునే ఆశ్రయించాలని సూచన

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్ శాసనసభకు ఐదుగురు సభ్యులను నామినేట్ చేసేందుకు లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉన్న అధికారాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అయితే ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌ను అనుమతించింది. జమ్మూకాశ్మీర్ శాసనసభ లో 119 స్థానాలు ఉన్నాయి. వీటిలో 90 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 24 స్థానాలను పాక్ ఆక్రమిత కాశ్మీర్‌కు ఉద్దేశించారు. 2019 సంవత్సరం నాటి జమ్మూకాశ్మీర్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 15కు చేసిన సవరణల ప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఐదుగురు సభ్యులను నామినేట్ చేసే అధికారం ఉంది.

లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉన్న అధికారాన్ని సవాలు చేస్తూ రవీందర్ కుమార్ శర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. శాసనసభ్యులను నామినేట్ చేస్తే ప్రజా తీర్పును తక్కువ చేసినట్టు అవుతుందని ఆయన వాదించారు. 'నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమికి 48 మంది సభ్యులు ఉన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఐదుగురిని నామినేట్ చేస్తే ప్రతిపక్షం బలం 47కి చేరుతుంది. అంటే పాలక పక్షానికి ప్రతిపక్షం కంటే ఒక్క సీటు మాత్రమే ఎక్కువ ఉంటుంది. నామినేటెడ్ సభ్యుల సంఖ్యను సవరణ ద్వారా ఐదు నుండి పదికి పెంచితే ఏం జరుగుతుంది?' అని ఆయన ప్రశ్నించారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ ఇంకా తన అధికారాన్ని ఉపయోగించుకోలేదని తెలిపారు. దీనిపై ముందుగా జమ్మూకాశ్మీర్-లడఖ్ హైకోర్టును ఆశ్రయించాలని సూచించారు.

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ

కమిటీ చైర్మెన్ తీరుపై జోక్యం చేసుకోండి : ప్రతిపక్ష ఎంపీలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



వక్ఫ్ (సవరణ) బిల్లును ప్యానెల్ చైర్మెన్ జగదాంబికా పాల్ పరిశీలించినా సంయుక్త కమిటీ సమావేశంలో 'పార్లమెంటరీ ప్రవర్తనా నియమావళిని తీవ్రంగా ఉల్లంఘించడంపై ప్రతిపక్ష ఎంపీలు మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. వక్ఫ్ అవకతవకల ఆరోపణలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కె. రెహమాన్ ఖాన్‌లతో సహా పలువురు ప్రతిపక్ష నేతల పేర్లను పేర్కొన్న కర్నాటక రాష్ట్ర మైనారిటీల కమిషన్ మాజీ చైర్మెన్ అన్వర్ మణిప్పాడి తీరుతో పలువురు ప్రతిపక్ష ఎంపీలు కమిటీ సమావేశాన్ని సోమవారం బహిష్కరించారు. సమావేశాలు జరుగుతున్న తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. "కమిటీ కార్యకలాపాలను చైర్మెన్ జగదాంబికా పాల్ పక్షపాత ధోరణితో నిర్వహించారు" అని ప్రతిపక్ష సభ్యులు గౌరవ్ గొగోయ్, సయ్యద్ నసీర్ హుస్సేన్, ఇమ్రాన్ మసూద్ (కాంగ్రెస్), ఎ. రాజా,ఎంఎం అబ్దుల్లా (డీఎంకే), అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం), కల్యాణ్ బెనర్జీ (టీఎంసీ) లేఖలో పేర్కొన్నారు. వక్ఫ్ (సవరణ) బిల్లుపై జాయింట్ కమిటీ సోమవారం మణిప్పాడిని 2012 కర్నాటక వక్ఫ్ స్కామ్ నివేదిక సందర్భంలో ముసాయిదా చట్టంపై తన అభిప్రాయాలను వినడానికి అనుమతించింది. అయితే "ఆయన కమిటీ ముందు ప్రవేశపెట్టిన నోట్‌లో వక్ఫ్ (సవరణ) బిల్లు 2024పై ఎటువంటి పరిశీలనలు లేవు. బదులుగా, ఆ నోటు రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేతో సహా కర్నాటక కాంగ్రెస్ నాయకుల పై రాజకీయ ప్రేరేపిత ఆరోపణలతో నిండి ఉంది" అని లేఖలో పేర్కొన్నారు. తమ నిరసనలను తెలియజేయడానికి కమిటీ సభ్యులకు తగిన సమయం ఇవ్వడానికి పాల్ నిరాకరించారని ప్రతిపక్ష సభ్యులు తెలిపారు. "ఈ విషయంలో మీ తక్షణ జోక్యాన్ని మేము అభ్యర్థిస్తున్నాం. ద్వైపాక్షికంగా, పార్లమెంటరీ నిబంధనలను సమర్థించాల్సిన బాధ్యతను కమిటీ చైర్మెన్‌కు మీరు గుర్తు చేస్తారని ఆశిస్తున్నాం" అని ప్రతిపక్ష సభ్యులు అన్నారు.



బీజేపీకి సరితా ఫోగట్ గుడ్‌బై

ఆప్‌లో చేరిక

న్యూఢిల్లీ : రాజధానిలో బీజేపీకి ఎదురు దెబ్బ తగిలింది. రెండు వారాల క్రితమే బీజేపీలో చేరిన మాల్వియా నగర్ వార్డ్ కౌన్సిలర్ సరితా ఫోగట్ పార్టీకి గుడ్‌బై చెప్పి తిరిగి ఆప్‌లో చేరారు. స్టాండింగ్ కమిటీ సభ్యుడిని ఎన్నుకునేందుకు సెప్టెంబర్ చివరి వారంలో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశమైంది. దీనికి ఒక రోజు ముందు సరితా ఫోగట్, మరో ఇద్దరు కౌన్సిలర్లు ఆమ్‌ఆద్మీ పార్టీకి రాజీనామా చేసి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో కార్పొరేషన్‌లో ఆప్ మెజారిటీ కోల్పోయింది. కాగా సరితా ఫోగట్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా పార్టీలోకి ఆహ్వానించారు. అరవింద్ కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టేందుకు సరిత కృషి చేస్తారని చెప్పారు.

విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారు

- అద్దెలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులకు చెల్లింపుల్లేవు
- రోడ్డెక్కిన విద్యార్థుల సమస్యలు సీఎంకు పట్టడంలేదు: కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురుకుల భవనాలకు అద్దె, కాలేజీల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వని సర్కారు మూసీ కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీలను నిరవధికంగా మూసేయడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖకు మంత్రి లేరనీ, వారి సమస్యలను వినే ఓపిక సీఎం రేవంత్ రెడ్డికి లేదని ఎద్దేవా చేశారు. వెంటనే ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అన్యాయం చేస్తామంటే బీఆర్ఎస్ సహించేది లేదని హెచ్చరించారు.

పేద, మధ్యతరగతి విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. గురుకులాలను, ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రయివేటు కాలేజీలకు బకాయిలు చెల్లించకుండా అవి మూసేసే పరిస్థితిని రేవంత్ సర్కార్ తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలేజీ యాజమాన్యాలు ముందే హెచ్చరించినా ప్రభుత్వం తోలుమందంగా వ్యవహరించిందని కేటీఆర్ మండిపడ్డారు. పేరుకుపోయిన బకాయిల కారణంగా చదువులు పూర్తి చేసిన విద్యార్థులు కాలేజీ యాజమాన్యాల నుంచి సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు రోడ్లపై ధర్నాలు చేస్తున్న నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణ కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం వద్ద పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువు కొనసాగించేందుకు అయ్యే డబ్బు లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో అంతకు ముందు ప్రభుత్వం బకాయిలు పెట్టిన రూ. 2 వేల కోట్ల ఫీజు బకాయిలను బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించిందని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సర్కారుకు పాలనానుభవం లేదనీ, పేద ప్రజల బాధలు తెలియవని విమర్శించారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించకుంటే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే విధంగా విద్యార్థులతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

ప్రత్యామ్నాయం చూపాకే కూల్చాలి..

- పేదలను సంతృప్తి పరిచాకే ఆక్రమణలు తొలగించాలి..
- ముందే కూల్చివేస్తే వాళ్లు ఎక్కడుంటారు..?
- మొన్నటి వరదలకు అనుగుణంగా ఆర్‌సీసీ వాల్ డిజైన్‌లో మార్పులు
- నిపుణుల కమిటీతో అధ్యయనం
- చర్చనీయాంశంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఆక్రమణల కూల్చివేతలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఖమ్మంలోని సారథీనగర్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రత్యామ్నాయం చూపాకే ఆక్రమణలు తొలగించాలి...పేదలను సంతృప్తి పరిచేలా కూల్చివేతలు ఉండాలని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి ఏమన్నారో ఆయన మాటల్లోనే...

వరదల్లో సహాయపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు... మొన్న సెప్టెంబర్ 1వ తేదీన ఖమ్మంలో వచ్చిన వరదల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా మీరంతా (కార్పొరేటర్లు, అధికారులు) కృషి చేశారు. ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం తీసుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. చెరువుల నుంచి వచ్చే వవరద పట్టణానికి వచ్చి...బ్యాక్‌వాటర్ పోటెత్తడంతో నగరంలోని చాలా ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. పది, పదిహేను డివిజన్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. అటువంటి పరిస్థితి మళ్లీ రాకుండా ఉండాలి.

మొన్నటి వరదల తీవ్రతకు అనుగుణంగా ఆర్‌సీసీ వాల్ డిజైన్‌లో మార్పులు..

మొన్నటి వరదల తీవ్రతకు అనుగుణంగా ఆర్‌సీసీ వాల్ నిర్మాణ డిజైన్‌లో మార్పులు, చేర్పులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి చెప్పాను. ఖమ్మం నగరం నుంచి వచ్చే వరద మున్నేరులోకి ఎలా చేరాలి...మున్నేరుకు పైనుంచి వచ్చే వరద నగరానికి, చుట్టుపక్కల ఉన్న కాలనీలకు రాకుండా ఎలా ఏర్పాట్లు చేయాలో ఓ నిపుణుల కమిటీని పంపించి అధ్యయనం చేయించాలని కోరాను. ముఖ్యమంత్రి వెంటనే పరిశీలించి నిపుణుల కమిటీని పంపించేందుకు అంగీకరించారు.

మొదలు పెట్టాక పనులు ఆగొద్దు...

ఏ పనైనా మొదలు పెట్టాక ఆగొద్దు. మొన్న కొంతమంది చెప్పారు...అక్కడో చెక్ డ్యాం (ప్రకాశ్‌నగర్ వద్ద) 8, 10 అడుగులు కట్టడం వల్ల వరద పోటెత్తిందని..మా ఇళ్లు మునిగినవి అంటారు. అట్ల తప్పు చేయకుండా శాశ్వత పరిష్కారం చూపేలా నిపుణుల కమిటీని ప్లాన్ చేయమని చెప్పాం. డ్రెయిన్ల నిర్మాణం విషయంలోనూ అలాంటి జాగ్రత్తలే తీసుకోవాలి. మురుగు, వరదనీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని డ్రెయిన్‌ల డిజైన్ రూపొందించాలి. ఎక్కడ నదిలో డ్రెయిన్‌ను కలపాలి..అనే స్పష్టత ఉండాలి. ఒక పని మొదలు పెడితే అది పూర్తి కావాలి. సగం చేసి వదిలేశామంటే పని చేసినట్టే ఉంటుంది...కానీ ఉపయోగం ఉండదు.

పేదలను సంతృప్తి పరచాలి...

నీటి వనరుల సమీపంలో ఆక్రమణలో ఉన్న పేదలకు ముందుగా ఇళ్లు, స్థలాలు ఇచ్చి వారిని సంతృప్తి పరచాలి. ఆ తర్వాతనే కూల్చివేతలు ప్రారంభించాలి. కూలోనాలో చేసుకునే బతికేవాళ్లను ఇబ్బంది పెడితే వారు ఎలా బతుకుతారు. వాళ్లతో మాట్లాడి..ఒప్పించిన తర్వాతే పనులు ప్రారంభించాలి. మొదలు పెట్టిన తర్వాత వాళ్లు పోకపోతే డబ్బులు వృథా అవుతాయి...ఆ పనివల్ల ప్రయోజనం కూడా రాదు. మళ్లీ వర్షాకాలం వచ్చేలోపుల ఈ పనులన్నీ పూర్తి చేయాలి. ప్రజలను ఒప్పించి..మెప్పించి పనులు మొదలు పెట్టాలి.

అసంపూర్తి గోళ్లపాడు చానల్ పనులతో ఇబ్బందులు గోళ్లపాడు చానల్ పనులు అసంపూర్తిగా ఉండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్లు వ్యర్థం అవుతాయి తప్ప పనులు పూర్తికావు...ప్రజలు సుఖపడరు. కాబట్టి ఇంజినీరింగ్ అధికారులు పనులు మంజూరు చేసినప్పుడే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలను కష్టాల నుంచి తప్పించేందుకే మన పనులు తప్ప ఎవర్నో ఇబ్బంది పెట్టడానికి...పగ సాధించడానికి కాదు. ...అంటూ మంత్రి తుమ్మలు చేసిన వ్యాఖ్యలు ఆలోచింపజేస్తున్నాయి. అంతకుమించి చర్చనీయాంశంగా మారాయి.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి, కార్పొరేటర్ కమర్తపు మురళీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు



మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో

ఏఐసీసీ పరిశీలకులుగా రాష్ట్ర మంత్రులు

కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ పోరులో ఏఐసీసీ పరిశీలకులుగా ముగ్గురు తెలంగాణ నేతలను ఆ పార్టీ నియమించింది. అందులో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క ఉన్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు పార్టీ సీనియర్ నేతలకు మహారాష్ట్ర, జార్ఖండ్ ఏఐసీసీ పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను అధిష్టానం నియమించింది. ఆయనతో పాటు పార్టీ సీనియర్ నేతలు తారిఖ్ అన్వర్, అధీర్ రంజన్ చౌదరీలకు బాధ్యతలు అప్పగించింది. అలాగే మహారాష్ట్రలో మొత్తం ఐదు డివిజన్లు ఉండగా... మరట్వాడకు సచిన్ పైలెట్‌తో కలిపి మంత్రి ఉత్తమ్ కుమార్‌కు, నార్త్ మహారాష్ట్ర డివిజన్ బాధ్యతలను డా సయ్యద్ నసీర్ హుస్సేన్‌తో కలిపి మంత్రి సీతక్కకు అప్పగించింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు.

నవతెలంగాణ

మీరు వాయిదాలు వేయొచ్చుకానీ, కాలం మీ కోసం వాయిదాలు వేసి కూర్చోదు - బెంజమిన్ ఫ్రాంక్లిన్

బుధవారం 16 అక్టోబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

మళ్లీ సింఘూ!

సింఘూలో మళ్లీ లొల్లి...! ఈసారి మంచులోంచి మంటల్లేచాయి. గతంలో రైతులు, ఇప్పుడు తమ పర్యావరణాన్ని, తద్వారా కాప్-28లో మన దేశం ఇచ్చిన హామీలు నెరవేరి, దేశం పరువు పోకూడదంటూ ప్రధాన పర్యావరణవేత్త వాంగ్ చుక్ బృందాన్ని సింఘూలో నిలిపేశారు. ఒకసారి రాజ్యాన్ని సవాలుచేసిన తర్వాత వారు కార్మికులైతేనేం? రైతులైతేనేం? పర్యావరణ ప్రేమికులైతేనేం? బుల్‌డోజర్ న్యాయం ముందు అందరూ సమానులే! ఈ 'న్యాయదేవత' కళ్లు, చెవులకు గంతలుండవు. అన్నీ తెరుచుకునే న్యాయం చేస్తూంటుంది.

వారు లడఖ్ పర్యావరణం కోసం చేసినా, శాంతియుతంగా 'మార్చ్' చేసినా, లడఖ్ రాజధాని 'లే' నుండి వెయ్యి కి.మీ.లు నడిచొచ్చినా, లడఖ్ మంచు కొండల్లో నుండి నిప్పులు కక్కే థార్ ఎడారి దాటొచ్చినా పాపం! ఆ లడఖీయులకు భారతదేశం మహాత్ముని ఆందోళనా పద్ధతులకు ఎప్పుడో స్వస్తి పలికేసిందని తెలియదు కాబోలు. అక్కడ కరవాలాల్లేవు. యోగి రాజ్యంలో తిప్పినట్లు తవంచాలు పట్టుకుని ఊరేగేవారు లేరు. ప్రధాన పర్యావరణవేత్త రామన్ మెగసెసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్ దగ్గర నుండి వారి పాదయాత్రలోని వారంతా నిరాయుధులు.

ఏ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఇంతకాలంగా ఎర్రజెండాలు పోరాడుతున్నాయో ఆ పెట్టుబడిదారీ విధానమే పర్యావరణ విధ్వంసం చేస్తోందన్న నూతన చైతన్యం కార్మికవర్గంలో మొగ్గతొడిగింది. "గ్రీన్స్" పార్టీలు అనేక ఐరోపా దేశాల్లో అధికార కూటముల్లో ఉన్నాయి. క్లైమేట్ ఛేంజ్ సదస్సులు, 'కాప్' సదస్సులు జరిగిపోతూనే ఉన్నాయి. కానీ పెట్టుబడిదారుల విశృంఖల దోపిడీ ఆగట్లేదు. అందుకే లడఖ్‌లో ప్రారంభమైన పోరాటం విజయం సాధించాలని, సాధిస్తుందని ఆశిద్దాం.



వారి డిమాండే అణుబాంబు. రాజ్యానికి అదే ప్రధాన సవాలు. లడఖ్‌కు రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూలు వర్తింపజేయాలని, తమకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలనేది వారి డిమాండు. తమ భూములను, ఆ భూగర్భంలోని అపురూప ధాతువులైన ఆర్సెనిక్, బొరాక్స్ వంటి వాటిని, బంగారం, గంధకం, క్వార్ట్జ్ వంటి ఖనిజాలను వారి పాలనలోనైతే అవసరమైన మేరకే తవ్వుతామని, "అ-ఆ"లు రంగంలోకి దిగితే తమ ప్రాంత పర్యావరణమే సర్వనాశనం అవుతుందన్న అభిప్రాయంలో వారున్నారు.

లడఖ్ విద్యా వ్యవస్థలో అనేక నూతన సంప్రదాయాలకు ప్రారంభకుడిగా పేరున్న సోనమ్ వాంగ్‌చుక్ "స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూవ్‌మెంట్ ఆఫ్ లడఖ్ (ఎస్ఈసీఎంఎల్) స్థాపకుడు. కృత్రిమ 'గ్లేసియర్స్' ద్వారా ఆయన సృష్టించిన 'మంచు స్తూపాలు' పంటలకనువైన కాలంలో నీరు అందించే సాంకేతిక పరిజ్ఞానం రూపొందించాయి. 58 ఏండ్ల ఈ వాంగ్‌చుక్ స్వయంగా ఇంజినీర్. ఆయన మాటకు ప్రజల్లో విలువుంది. పర్యావరణ పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న పోరాటానికి మద్దతు లభిస్తోంది. దాన్ని ఉపయోగించుకునే 2019లో 370 ఆర్టికల్ రద్దుకు ఆయన మద్దతు నాడు బీజేపీ కూడగట్టింది. "తాము ప్రస్తుతం పెనంమీద నుండి పొయ్యిలో పడ్డామ"ని ఇటీవల ఆయన ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో చెప్పారు. "అనుభవంలోకొస్తేనే తత్వం బోధపడ్తుంద"ని గిరీశం చెప్పింది ఎంత కరెక్టో నేడు వాంగ్‌చుక్‌కి మించిన ఉదాహరణ మరొకటి ఉండదు. "మహాత్ముడు పుట్టిన దేశంలో ఆయన్ను అనుసరించడం ఇంత కష్టమెందుకవుతుందో అర్థంకాదు. ఏదో ఒక దారి అయితే కచ్చితంగా ఉంటుంది" అని వాంగ్‌చుక్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు చెప్పిన మాటలు గమనార్హం. వీరి ధర్నా శిబిరంలో కలిసిన ఒక ఆంగ్ల మ్యాగజైన్ విలేకరి "ఆరవ షెడ్యూల్లో చేరిస్తే మిమ్మల్ని మీరు అభివృద్ధి చేసుకోలేరట కదా" అనే మాట పూర్తికాకముందే నాడు బ్రిటిష్ వారు భారతదేశానికి స్వాతంత్ర్యం ఇస్తే మిమ్మల్ని మీరు అభివృద్ధి చేసుకోలేరన్నట్టు ఉంది మీ ప్రశ్న అంటూ మొహం వాచేలా సమాధానం చెప్పాడు వాంగ్‌చుక్.

ఇది రైతుల పోరాటమంత విస్తృతమైంది కాకపోవచ్చు. ప్రధానో, గృహమంత్రో, రాష్ట్రపతో తమతో చర్చించాలనే డిమాండు చిన్నదే కావచ్చు. రేపు వారోమెట్టుదిగి చర్చలు జరపనూవచ్చు. ఈ ఉద్యమం చల్లారిపోనూవచ్చు. లేదా వాంగ్‌చుక్ చెప్పినట్టు స్విట్జర్లాండ్ నుండి లడఖ్‌కు చెందిన 90 ఏండ్ల పండు ముసలి వచ్చి పాల్గొనవచ్చు. ఢిల్లీలో చదువుకునే లడఖ్ విద్యార్థులు వచ్చి కలిసి ఈ పోరాటం నూతన జవసత్వాలు పుంజుకోనూవచ్చు.

ఏ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఇంతకాలంగా ఎర్రజెండాలు పోరాడుతున్నాయో ఆ పెట్టుబడిదారీ విధానమే పర్యావరణ విధ్వంసం చేస్తోందన్న నూతన చైతన్యం కార్మికవర్గంలో మొగ్గతొడిగింది. "గ్రీన్స్" పార్టీలు అనేక ఐరోపా దేశాల్లో అధికార కూటముల్లో ఉన్నాయి. క్లైమేట్ ఛేంజ్ సదస్సులు, 'కాప్' సదస్సులు జరిగిపోతూనే ఉన్నాయి. కానీ పెట్టుబడిదారుల విశృంఖల దోపిడీ ఆగట్లేదు. అందుకే లడఖ్‌లో ప్రారంభమైన పోరాటం విజయం సాధించాలని, సాధిస్తుందని ఆశిద్దాం.

తైవాన్ అంశంలో గీత దాటొద్దు...అమెరికాకు చైనా హెచ్చరిక!




ఎం కోటేశ్వరరావు
8331013288

స్వాతంత్ర్యం పేరుతో అమెరికా, ఇతర దేశాల అండచూసుకొని రెచ్చిపోతున్న తిరుగుబాటు రాష్ట్రమైన తైవాన్ పాలకులను హెచ్చరిస్తూ సోమవారం నాడు చైనా భారీ ఎత్తున సైనిక విన్యాసాలు చేపట్టింది. తొలిసారిగా తన తొలి విమానవాహక యుద్ధనౌక, పలు విమానాలు, మిలిటరీ నౌకలు,డ్రోన్లు, ఆయుధాలతో తమ సత్తా ఏమిటో పశ్చిమ దేశాలకు వెల్లడించింది. తైవాన్ స్వాతంత్ర్యం, వేర్పాటు కోరుతున్న శక్తులకు, వాటికి మద్దతిస్తున్న అమెరికాకు కూడా ఇది గట్టి హెచ్చరిక. జాయింట్ స్వోర్డ్ 2024బి పేరుతో జరిపిన విన్యాసాల్లో అవసరమైతే తైవాన్ దిగ్బంధం, దాడులు ఏలా చేయగలమో చూపింది. గతంలో కూడా విన్యాసాలు జరిపినప్పటికీ దీనికి ప్రాధాన్యత ఉన్నట్లు తెలుస్తోంది. చైనా పిఎల్ఏ తూర్పు కమాండ్ ప్రతినిధి కెప్టెన్ లీ షీ మాట్లాడుతూ ఒకేసారి త్రివిధ దళాల సమన్వయంతో భూ, గగనతల, సముద్రదాడులు, రేవులు, ఇతర ప్రాంతాల దిగ్బంధనం ఎలా చేయగలమో పరీక్షించి చూపినట్లు, ఇది తీవ్రమైన హెచ్చరిక అని చెప్పారు. తైవాన్ నాయకత్వం పదే పదే తమ రక్షణ గగనతలం అని చెప్పుకుంటుందని, దాన్ని ఎలా చీల్చి చెండాడగలమో చూపటమే లక్ష్యంగా పలు వైపుల నుంచి దాడులను సమన్వయం ఎలా చేసేదీ చైనా త్రివిధ దళాలు చూపాయి. అందుకే ఉమ్మడి ఖడ్గం అని పేరు పెట్టారు. మెడమీద వేలాడే ఖడ్గం లేదా సుత్తి మాదిరి రూపొందించారు. చైనా-తైవాన్ మధ్య ఉన్న జలసంధిలో రెండు ప్రాంతాలు, తూర్పున రెండు, ఉత్తర, దక్షిణాన ఒక్కొక్క జోన్‌గా ఈ విన్యాసాలు జరిగాయి. గతం కంటే వీటిని విస్తరిం చారు. ఉత్తర, దక్షిణ ప్రాంతాలో ఉన్న రేవుల ద్వారా తైవాన్ సహజవాయువు దిగుమతి చేసుకుంటు న్నది. ఆ రేవులను దిగ్బంధనం కావించి ఆర్థిక లావాదేవీలను మిలిటరీ ఎలా దెబ్బతీయగలదో ఈ సందర్భంగా ప్రదర్శిం చారు.

తైవాన్ ప్రభుత్వ ప్రతినిధి మాట్లాడుతూ తాము కూడా తమ దళాలతో గమనించామని, ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు తాము 153 విమానాల గమనాన్ని పరిశీలించామని, 90సార్లు తమ గగన తలంలోకి ప్రవేశించాయని, కొన్ని ఒకటి కంటే ఎక్కువసార్లు వచ్చినట్లు చెప్పారు. ఏడు నౌకలు, మరో నాలుగు ఇతర నౌకలు తైవాన్ దీవి చుట్టూ చక్కర్లు కొట్టాయని ఆరోపించారు. ఈ ఏడాది మే నెలలో పిఎల్ఏ ఒకసారి విన్యాసాలు నిర్వహించింది.అక్టోబరు పదవ తేదీన తైవాన్ ప్రాంత ప్రభుత్వ అధ్యక్షుడు లాయ్ మాట్లాడుతూ చైనా పీపుల్స్ రిపబ్లిక్ తమకు ప్రాతినిధ్యవహించదని, దానికా హక్కు లేదంటూ తాము స్వతంత్రంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. విన్యాసాలు పౌరులకు వ్యతిరేకంగా కాదని, వేర్పాటువాద శక్తులను హెచ్చరిం చేందుకేనని, వారికి చీమ చొరబడేంత అవకాశం కూడా ఇచ్చేది లేదని, శాంతియుతంగా విలీనానికే ప్రాధాన్యత ఇస్తామని చైనా చెప్పింది. ఒకే చైనా విధానానికి అనుగుణంగా తైవాన్ దీవి చుట్టూ పహరాకు నౌకాదళాన్ని నిరంతర వినియోగిస్తూనే ఉంటామని కూడా స్పష్టం చేసింది

తైవాన్ ప్రాంతంలో చైనా అంతర్భాగమే అంటూనే శాంతియుతంగా విలీనం చేసే సమయం ఆసన్నం కాలేదంటూ అమెరికా నాటకాలాడుతోంది. బలవంతం చేస్తే తాము చూస్తూ ఊరుకోబోమని పదేపదే ప్రకటిస్తోంది. చైనా అంటే తైవాన్‌లో ఉన్న ప్రభుత్వమే అని ఐరాస 1971వరకు గుర్తించింది. అంతకు ముందు దశకంలో సోవియట్ యూనియన్-చైనా కమ్యూనిస్టు పార్టీల మధ్య తలెత్తిన వివాదాలను అవకాశంగా తీసుకొని చైనాను తమవైపు తిప్పుకోవచ్చు అనే రాజకీయ ఎత్తుగడతో అసలైన చైనాకు కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న ప్రధాన ప్రాంతాన్నే గుర్తించేందుకు అమెరికా పావులు కదిపింది. దాంతో భద్రతా మండలిలో 71వ దశకంలో శాశ్వత సభ్యదేశంగా కమ్యూనిస్టు చైనాను గుర్తించింది. అయితే ఆ సమయంలో జరిగిన చర్చలు, నిర్ణయాల్లో తైవాన్



విలీనం శాంతియుతంగా జరగాలని పేర్కొంది. దాన్ని సాకుగా చూపుతూ అలాంటి సమయం ఇంకా రాలేదని గత ఐదు దశాబ్దాలుగా అమెరికా భారీ ఎత్తున ఆయుధాలను అందచేస్తూ తిరుగుబాటును రెచ్చగొట్టేందుకు చూస్తున్నది. బలవంతంగా విలీనం చేసుకుంటామంటే తైవాన్‌లో ఉన్న చిప్స్ పరిశ్రమలను పూర్తిగా ధ్వంసం చేస్తామని బెదిరించింది.

తప్పనిసరైతే తప్ప రెండుకోట్ల 30లక్షల జనాభా ఉన్న తైవాన్‌ను బలవంతంగా విలీనం చేసుకోబోమని చైనా చెబుతున్నది. బ్రిటన్, పోర్చుగీసు కౌలు గడువు తీరిన తరువాత ప్రపంచ ఆర్థిక కేంద్రాలలో ఒకటైన హాంకాంగ్, ఆసియా లాస్‌వేగాస్‌గా పేరుమోసిన జూద కేంద్రం మకావు దీవులు చైనా ఆధీనంలోకి వచ్చాయి.వాటిని వెంటనే చైనా సమాజంలో కలిపితే వచ్చే సమస్యలను, అక్కడ ఉన్న విదేశీ పెట్టుబడులను గమనంలో ఉంచుకొని యాభై ఏండ్లపాటు 2047వరకు అక్కడ ఉన్న వ్యవస్థలను కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దాన్నే ఒకేదేశం-రెండు వ్యవస్థలుగా పిలుస్తున్నారు. ప్రత్యేక పాలనా యంత్రాంగాలను అక్కడ ఏర్పాటు చేశారు. వాటికి ఎన్నికలను కూడా జరుపుతున్నారు. తైవాన్ పట్ల కూడా అదే విధానాన్ని అనుసరిస్తామని చెప్పినప్పటికీ అమెరికా ఇచ్చిన ఆయుధాలు, అవసరమైతే జోక్యం చేసుకుంటామన్న మాటలను నమ్మి అక్కడి పాలకులు పదే పదే ససేమిరా అంటున్నారు. చైనా తాజా మిలిటరీ విన్యాసాల పూర్వరంగమదే.

ఐక్యరాజ్యసమితి 1949లో రూపొందించిన దేశాల హక్కులు, విధులకు సంబంధించిన ముసాయిదాలో ప్రతి దేశం అంతర్గత, విదేశీ వ్యవహారాలను ఎలా నిర్వహించాలో స్పష్టంగా పేర్కొన్నది. బయటి నుంచి ఎలాంటి జోక్యం, ఒత్తిడి లేదా మార్గదర్శనానికి తావు లేకుండా సాయుధ దళాల నియామకంతో సహా అనేక అంశాలు దానిలో పొందుపరిచింది. ఐరాస తీర్మానం ప్రకారం తైవాన్ ప్రాంతం చైనాలో అంతర్భాగమే, అది తిరుగుబాటు రాష్ట్రంగా ఉన్నప్పటికీ దాని మీద పూర్తి అధికారం చైనాదే. అందువలన అంతర్గతంగా వేర్పాటు వాదాన్ని అదుపు చేయటంతో పాటు తైవాన్ చుట్టుపక్కల ప్రాంతాల మీద కూడా అంతర్జాతీయ నిబంధనలు అనుమతించిన మేరకు ఆధిపత్యం చైనాకే ఉంది.

పాక్ ఆక్రమిత కాశ్మీరు ఎలా మన అంతర్గత అంశమో తైవాన్ కూడా చైనా స్వంత విషయమే. దానిలో జోక్యం చేసుకోవటం అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధం. మన పాలకులు ఎప్పుడైనా ఆక్రమిత కాశ్మీరును విముక్తం గావిస్తామని ప్రకటిస్తున్న సంగతి విదితమే. అయితే గత ఏడున్నర దశాబ్దాలుగా అలాంటి చర్యకు పూనుకోలేదు. ఎందుకంటే కారణాలనేకం, తైవాన్ విషయంలో కూడా చైనా అదే మాదిరి బలప్రయోగానికి పూనుకోవటం లేదు. అది వారు తెల్చుకోవాల్సిందే. ఆక్రమిత కాశ్మీరు అంశంలో పాకిస్తాన్ జోక్యం చేసుకుంటున్నట్లుగానే తైవాన్ విషయంలో అమెరికా అంతకంటే ఎక్కువగా వేలు పెడుతోంది.పాక్ ఆక్రమిత కాశ్మీరుకు మిలిటరీ, ఆయుధాలు లేవు, అదే తైవాన్‌కు యుద్ధ విమానాలు, క్షిపణులు, నౌకాదళం పూర్తి స్థాయి మిలిటరీ ఉంది. ప్రతి యేటా అమెరికా సమకూరుస్తోంది. తాజా సమా చారం ప్రకారం మిలిటరీ శక్తి ఉన్న 145 దేశాలలో తైవాన్ 24వదిగా ఉంది. సర్వీసులో మొత్తం 2.15లక్షల మంది సైనికులు, 50వేల మంది పారా మిలిటరీ, మిలిటరీలో 35వేల మంది వైమానిక దళ సిబ్బంది,40వేల మందితో నౌకాదళం ఉంది, 286 యుద్ధ విమానాలుండగా వాటిలో ఏ క్షణంలోనైనా దాడి చేసేందుకు 229 సిద్ధంగా ఉంటాయి, ఇవిగాక కొన్ని హెలికాప్టర్లు ఉన్నాయి. నాలుగు జలాంతర్గాములతో సహా 93 రకాల మిలిటరీ నౌకలు ఉన్నాయి. ఇలాంటి శక్తితో తలపడితే ప్రాణనష్టం ఎక్కడ జరిగినా మరణించేది చైనా పౌరులే. అందుకే ప్రతిరోజూ రెచ్చగొడుతున్నా చైనా నాయకత్వం ఎంతో సంయమనంతో ఉంటోంది.

అమెరికా ప్రతినిధి మాథ్యూ మిల్లర్ తాజా పరిణామాలపై మాట్లాడుతూ..తైవాన్ జలసంధి, ఆ ప్రాంతంలో శాంతి, సౌభాగ్యాలకు ముప్పు రాకుండా చైనా సంయమనం పాటించాలని బోధ చేశారు. తైవాన్ పాలకుడు లాయ్ చేస్తున్న రెచ్చగొట్టే ప్రకటనలు, చర్యలు అక్కడి ప్రజలకు నష్టదాయకమని చైనా పేర్కొన్నది. రాజకీయ స్వప్రయోజనాల కోసం తైవాన్ జలసంధిలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టటమే తైవాన్ జాతీయ దినోత్సవం పేరుతో చేసిన లాయ్ ఉపన్యాసమని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి మావో నింగ్ చెప్పారు. మే నెలలో లాయ్ బాధ్యతలు చేపట్టారు, అతనొక ప్రమాదకర వేర్పాటు వాది అని అప్పుడు చైనా వర్ణించింది. అమెరికా కూడా తక్కువ తినలేదు. అమెరికా పార్లమెంటు స్పీకర్ నాన్సీ పెలోసి చైనా హెచ్చరికలను ఖాతరు చేయకుండా 2022లో తైవాన్ పర్యటన జరిపి తమ మద్దతు వారికే అన్న సందేశమిచ్చారు. చైనా నాయకత్వ తీరుతెన్నులను చూసినపుడు అనివార్య పరిస్థితుల్లోనే నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటుంది తప్ప అనవసరంగా వ్యవహరించదు. రానున్న ఐదేండ్లల్లో చైనా ఎలాంటి దాడులు చేయదని తాము నమ్ముతున్నట్లు సెప్టెంబరు నెలలో చేసిన ఒక సర్వేలో 61శాతం మంది తైవాన్ చైనీయులు చెప్పినట్లు వెల్లడైంది. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల తమ ఆర్థిక సమస్యల నుంచి జనాన్ని పక్కదారి పట్టించేందుకు, ఆయుధ కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొట్టటం తద్వారా ఆయుధ అమ్మకాలను పెంచుకోవటం చూస్తున్నదే. అందుకే ఏదో ఒక మూల అలాంటి పరిస్థితిని సృష్టిస్తున్నది. దాన్లో భాగంగానే దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో తైవాన్, దీవులు, అంతర్జాతీయ సముద్రమార్గంలో స్వేచ్ఛగా రవాణా తదితరాల పేరుతో చిచ్చుపెట్టేందుకు పూనుకున్నది. తాను అండగా ఉంటానంటూ దక్షిణ చైనా సముద్ర ప్రాంత దేశాలను నమ్మించేందుకు,చైనాను బెదిరించేందుకు అమెరికా కూడా పదిరోజుల పాటు సాగేమిలిటరీ విన్యాసాలను ప్రారంభించింది. చైనా విన్యాసాలు బాధ్యతా రహితం, ఆ ప్రాంతాన్ని అస్థిరపరిచేవిగా, భారీ ఎత్తున జరిగినట్లు అమెరికా రక్షణశాఖ పెంటగన్ ఆరోపించింది.తైవాన్‌కు 800 కిలోమీటర్ల దూరంలో దక్షిణ చైనా సముద్రంలో ఫిలిప్పీన్స్‌తో కలసి పదిరోజుల పాటు అమెరికా నౌకాదళ విన్యాసాలను నిర్వహిస్తోంది.

తైవాన్ భద్రత విషయంలో తీవ్రంగా ఆలోచించాలంటూ అమెరికా రక్షణశాఖ మాజీ అధికారి ఎల్‌బ్రిడ్జ్ కోల్బీ రాసిన విశ్లేషణను మే 11వ తేదీన తైపే టైమ్స్ పత్రిక ప్రచురించింది. చైనా దురాక్రమణను అడ్డుకోవాలంటే మరింత ఎక్కువగా రక్షణ ఖర్చు పెంచాలని తైవాన్‌కు సూచించారు.తమకు తైవాన్ అవసరం ఎంతో ఉన్నప్పటికీ దాని కోసం త్యాగాలు చేయాలని తమ నేతలు అమెరికన్లను అడిగే స్థితి లేదన్నారు. తమ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే పశ్చిమ పసిఫిక్ ప్రాంతంలోని టోకియో, సియోల్ వంటి జనసమ్మర్దం గల ప్రాంతాలకు సమీపంలోని అమెరికా సైనిక స్థావరాల మీద అణ్వాయుధాలను ప్రయోగించి ధ్వంసం చేస్తామని చైనా బెదిరించిందని ఆరోపించారు. అటువంటి పరిస్థితిలో తాము నేరుగా చైనా యుద్ధ విమానాలను ఎదుర్కోనేందుకు సిద్ధం కాదని, రష్యాపై పోరుకు ఉక్రెయిన్‌కు ఇస్తున్న మాదిరి గానే పరోక్షంగా సాయం అందచేస్తామని తైవాన్ ఒంటరిగా పోరాడాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పాక్ ఆక్రమిత కాశ్మీరు ఎలా మన అంతర్గత అంశమో తైవాన్ కూడా చైనా స్వంత విషయమే. దానిలో జోక్యం చేసుకోవటం అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధం. మన పాలకులు ఎప్పుడైనా ఆక్రమిత కాశ్మీరును విముక్తం గావిస్తామని ప్రకటిస్తున్న సంగతి విదితమే. అయితే గత ఏడున్నర దశాబ్దాలుగా అలాంటి చర్యకు పూనుకోలేదు. ఎందుకంటే కారణాలనేకం, తైవాన్ విషయంలో కూడా చైనా అదే మాదిరి బలప్రయోగానికి పూనుకోవటం లేదు. అది వారు తేల్చుకోవాల్సిందే. ఆక్రమిత కాశ్మీరు అంశంలో పాకిస్తాన్ జోక్యం చేసుకుంటున్నట్లుగానే తైవాన్ విషయంలో అమెరికా అంతకంటే ఎక్కువగా వేలు పెడుతోంది.

ఐక్యరాజ్యసమితి 1949లో రూపొందించిన దేశాల హక్కులు, విధులకు సంబంధించిన ముసాయిదా లో ప్రతి దేశం అంతర్గత, విదేశీ వ్యవహారాలను ఎలా నిర్వహించాలో స్పష్టంగా పేర్కొన్నది. బయటి నుంచి ఎలాంటి జోక్యం, ఒత్తిడి లేదా మార్గదర్శనానికి తావు లేకుండా సాయుధ దళాల నియామకంతో సహా అనేక అంశాలు దానిలో పొందు పరిచింది. ఐరాస తీర్మానం ప్రకారం తైవాన్ ప్రాంతం చైనాలో అంతర్భాగమే, అది తిరుగు బాటు రాష్ట్రంగా ఉన్నప్పటికీ దాని మీద పూర్తి అధికారం చైనాదే. అందువలన అంతర్గతంగా వేర్పాటు వాదాన్ని అదుపు చేయటంతో పాటు తైవాన్ చుట్టుపక్కల ప్రాంతాల మీద కూడా అంతర్జాతీయ నిబంధనలు అనుమతించిన మేరకు ఆధిపత్యం చైనాకే ఉంది.


మరో విషబీజం



సలీమా
9490099083

మతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టడం, విద్వేషాలను సృష్టించడం బీజేపీకి పుట్టుకతో అబ్బిన విద్య తన అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు మొదటినుండి మత రాజకీయాలే లక్ష్యంగా పెట్టుకుంది. చాపకింద నీరులా తన హిందుత్వ ఎజెండాను అమలు చేస్తూనే ఉంది. దీనికి తాజా ఉదాహరణే వక్ఫ్ చట్ట సవరణ. తన పబ్బం గడుపు కునేందుకు దీన్ని మరో విషబీజంగా ప్రజల మెదళ్లలో నాటేందుకు సిద్ధమవుతోంది. వక్ఫ్‌బోర్డు ద్వారా ముస్లింలు పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టుకున్నారంటూ బూటకపు ప్రచారం చేస్తున్నది. వాస్తవాలు మాత్రం దీనికి భిన్నంగా ఉన్నాయి. వక్ఫ్ చట్టం 1995లో చేసినది. దీని ప్రకారం వక్ఫ్ ఆస్తిని నిర్ణయించే హక్కు వక్ఫ్ ట్రిబ్యునల్‌కు ఉంటుంది. ఈ ట్రిబ్యునల్ రాజ్యాంగం ప్రకారం ఎన్నికవుతుంది. కనుక దీనికి స్వతంత్ర్య ప్రతిపత్తి ఉంటుంది. చట్ట సవరణతో వక్ఫ్‌బోర్డు అధికారాలన్నీ కలెక్టర్లకు, ఆర్‌డీఓలకు అప్పజెప్పబోతున్నారు. ఇక నుండి వక్ఫ్ ఆస్తినా కాదా అనేది వీళ్లే నిర్ణయిస్తారు. కలెక్టర్లపై రాజకీయ నాయకుల ఒత్తిడి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. దీనివల్ల వక్ఫ్ భూములను ప్రభుత్వ భూములుగానో, ప్రయివేటు భూములుగానే మార్చే ప్రమాదముంది. అలాగే ఇప్పటి వరకు వక్ఫ్‌కు హిందువైనా, ముస్లిమైనా భూమి దానం చేయాలనుకుంటే చేయవచ్చు. కానీ ఈచట్ట సవరణతో దానం చేయాలనుకునేవారు గత ఐదేండ్ల నుండి తాము ఇస్లాంను ఆచరిస్తున్నామని కచ్చితంగా రుజువు చేసుకోవాలి. ఇది అత్యంత ప్రమాదకరమైన సవరణ.

ఇప్పటి వరకు వక్ఫ్‌బోర్డ్‌లో ముస్లింలు మాత్రమే ఉండేవారు. ఇప్పుడు ముస్లిమేతరులను కూడా ఈ కమిటీలో పెట్టాలనే నిర్ణయం జరుగుతోంది. నిజానికి వక్ఫ్ ఓ ధార్మిక సంస్థ. అలాంటి సంస్థలో ఇతర మతస్తులను పెట్టడం ఎంతవరకు సమంజసం! నిజంగా మత సామరస్యం కోసమే ఈ నిర్ణయం తీసుకుంటే మంచిదే. అలాంటప్పుడు దేవాదా యశాఖ కమిటీ ల్లోనూ ఇతర మతస్తులకు చోటు కల్పించాలి కదా! అలా చేస్తారా అనేది ప్రశ్న. మహిళలకు కూడా ఈ కమిటీలో చోటు కల్పిస్తామని చెప్పారు. ఇదొక్కటే ఈ చట్ట సవరణలో చెప్పుకోదగ్గ సవరణ. కాషాయదళం చేస్తున్న మరో అబద్ధపు ప్రచారం దేశంలో రైల్వే, మిలటరీ తర్వాత పెద్ద ఎత్తున భూమి ఉంది వక్ఫ్ బోర్డుకే అని. వాళ్ల చెప్పిన ప్రకారమే 8,70,000 స్థిరాస్తులు వక్ఫ్ కింద ఉన్నాయి. అందులో సుమారు 70 నుండి 80 శాతం భూమి ఖబ్రాస్తాన్‌ల్లు(శ్మశానవాటికలు), మసీదుల కిందనే ఉంది. వీటన్నింటినీ ఆస్తులుగా చూపిస్తున్నారు. అయితే ఇవేవీ ఆదాయాన్ని తెచ్చిపెట్టేవి కావు. అలాగే దేశవ్యాప్తంగా వక్ఫ్ బోర్డ్‌కు ఏడాదికి సుమారు రూ.163 కోట్లు ఆదాయం వస్తుందని లెక్కలు చూపిస్తున్నారు. అలా అనుకుంటే ఒక్క తిరుమల తిరుపతి దేవస్థానంలోనే భక్తుల తల నీలాల ద్వారా రూ.150 కోట్ల ఆదాయం వస్తుంది. ఇక మిగిలిన దేవాలయాల నుండి ఎంత వస్తుండాలి? ఏ విధంగా చూసినా వక్ఫ్‌బోర్డుకు విపరీతమైన ఆదాయం వస్తున్నట్టు ఎక్కడా కనిపించడం లేదు. లోతుగా పరిశీలిస్తే ఇదంతా హిందువులను రెచ్చగొట్టేందుకు బీజేపీ చేస్తున్న కుట్రగా తెలుస్తున్నది.



వక్ఫ్‌బోర్డుకు అపరిమిత అధికారాలు ఉన్నాయని బీజేపీ మరో వాదన. దీన్ని అడ్డుపెట్టుకొని ఏ భూమినైనా వక్ఫ్ కిందకు మార్చుకుంటున్నారనే తప్పుడు ప్రచారం చేస్తుంది. వాస్తవానికి వక్ఫ్‌బోర్డుకు ఎలాంటి హక్కులూ లేవు. వక్ఫ్ ట్రిబ్యునల్‌కు మాత్రమే అధికారం ఉంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వమే దీన్ని నియమిస్తుంది. వక్ఫ్ భూమిని వియోగించు కోవాలంటే కచ్చితంగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌పై ఆధారపడాల్సిందే. అంతే తప్ప వక్ఫ్‌బోర్డుకు రాజ్యాం గానికి మించి అతీతమైన హక్కులేమీ లేవు. కేవలం ముస్లింలను టార్గెట్ చేసేందుకు, వక్ఫ్ భూము లను స్వాహా చేసేం దుకే కాషాయ దళం ఈ ప్రచారం చేస్తోంది.

ఇప్పటికే వక్ఫ్ భూములు పెద్దఎత్తున కబ్జాలకు గురై నిరుపేద ముస్లింలకు ఏ మాత్రం ప్రయోజనం జరగడం లేదు. వాస్తవానికి సచార్ కమిటీ సిఫార్సుల ప్రకారం వక్ఫ్ భూములను సరిగా వినియోగిస్తే ముస్లింలు ఈపాటికే ఎంతో అభివృద్ధి చెంది ఉండేవారు. కానీ అలాంటి ప్రయత్నం ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ చేయలేదు. ఇక బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి మైనార్టీలనే టార్గెట్ చేసింది. అవకాశం చిక్కినప్పుడల్లా హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నది. ప్రజల మధ్య ఈర్ష్యా, ద్వేషాలను సృష్టిస్తున్నది. అందులో భాగంగానే ఇప్పుడు వక్ఫ్ చట్ట సవరణ తీసుకురాబోతున్నది! ఈ సవరణ రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు నెత్తీనోరు కొట్టుకుం టున్నా బీజేపీ చెవికి ఎక్కడం లేదు. అందుకే కేరళ ప్రభుత్వం అసెంబ్లీలో వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించింది. మిగిలిన రాష్ట్రాలు కూడా ఈ చొరవ చూపాల్సి అవవరసం ఉన్నది. మరీ ముఖ్యంగా బీజేపీ మత రాజకీయాలను తిప్పికొట్టేందుకు దేశపౌరులంతా ఏకమవ్వాలి. వారు నాటుతున్న విష బీజాలను కూకటివేళ్లతో సహా పెకిలించాలి.

వాస్తవానికి వక్ఫ్‌బోర్డుకు ఎలాంటి హక్కులూ లేవు. వక్ఫ్ ట్రిబ్యునల్‌కు మాత్రమే అధికారం ఉంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వమే దీన్ని నియమిస్తుంది. వక్ఫ్ భూమిని వియోగించుకోవాలంటే కచ్చితంగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌పై ఆధారపడాల్సిందే. అంతే తప్ప వక్ఫ్‌బోర్డుకు రాజ్యాంగానికి మించి అతీతమైన హక్కులేమీ లేవు. కేవలం ముస్లింలను టార్గెట్ చేసేందుకు, వక్ఫ్ భూములను స్వాహా చేసేందుకే కాషాయ దళం ఈ ప్రచారం చేస్తోంది.

'పోషకాహార హక్కు' కావాలి..!

ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల చైనాను అధిగమించామని గొప్పలకు పోతున్న భారత్ ప్రజలందరికీ పోషకాహారం అందిస్తోందా? జనాభాకు తగిన వనరులున్నప్పటికీ వాటిని సరిగా వినియోగిస్తోందా? దేశంలో ఆకలిచావులు ఎందుకు పెరుగుతున్నాయి? అంతటి జనాభా ఉన్న చైనాలో అందరికీ సరిపడే పోషకాహారం అందించినప్పుడు మనదేశానికి ఎందుకీ సమస్య ఎదురవుతున్నది? ప్రజలు ఆలోచించాల్సిన సందర్భమిది. 1945లో ఐక్యరాజ్య సమితిలోని 'ఆహార, ఆరోగ్య సంస్థ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్)' వ్యవ స్థాపక దినాన్ని పురస్కరించుకుని 1979లో ఐరాస తీర్మానం ప్రకారం 1981 నుండి 150కి పైగా దేశాలలో ప్రతి యేటా 16 అక్టోబర్‌న విశ్వ వ్యాప్తంగా 'ప్రపంచ ఆరోగ్య దినం (వరల్డ్ ఫుడ్ డే)' పాటిస్తున్నది. ఆహార భద్రతకు సంబంధించిన 'వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్, ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్' వేదికలు కూడా ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తాయి. అయిన ప్పటికీ పోషకాహార లోపంతో బాధపడేవారి సంఖ్య, మరణాల రేటు రోజురోజుకూ పెరుగుతుందే కానీ తగ్గడం లేదు.

ప్రపంచవ్యాప్తంగా 99 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన 821 మిలియన్ల ప్రజలు పోషకాహార లోపంతో బాధపడటం, అది పాలకుల వైఫల్యాన్ని ఎత్తిచూపుతున్నది. ప్రపంచ మహిళల్లో అరవై శాతం ఆకలి/రక్తహీనత సమస్యలతో, ఇరవై మిలియన్ల శిశు మరణాలు తక్కువ బరువువల్ల జరుగుతున్నాయని సర్వేల ద్వారా తేలింది. పోషకాహార లోపంతో ఐదేండ్లలోపు పిల్లలు యాభై శాతం చనిపోతున్నారనేది చాలా



విచారకరం. పేదరికం, కరువులు, ఆకలిచావులు, అవిద్య, అధిక జనాభా, అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలు ఆహార భద్రతకు విఘా తాలుగా చాలా దేశాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఆహార లభ్యతకు ఆధారం వ్యవసాయమే. ఆహారంతో ఆరోగ్యం, విద్య ముడిపడిఉంటాయి. ఈసారి ప్రపంచ ఆహార దినం-2024 థీమ్‌గా "ఆహార హక్కు, ఉన్నత జీవితానికి ఉన్నత భవిష్యత్తు (రైట్ టు ఫుడ్ : ఫర్ ఏ బెట్టర్ లైఫ్ అండ్ ఏ బెట్టర్ ఫ్యూచర్)"ని తీసుకొని ప్రపంచవ్యాప్తంగా పలు కార్యక్రమాలు, సెమినార్లు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. ఆహారధాన్యాల ఉత్పత్తి, పంపిణీ, భద్రతలను శాస్త్రీయంగా చేయాల్సి ఉంటుందనే అంశాలపై చర్చిస్తారు. కానీ, పోషకాహార నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తూతూమంత్రంగానే జరుగుతున్నాయనేది వాస్తవం.

నేడు అందరికీ పోషకాహారం కనీస హక్కు అందని ద్రాక్షగా మారింది. ఆహార కొరత, ఆకలిచావులు జాతికే అవమానకరం. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న, పేద దేశాల్లో ఆహార భద్రత సమస్య ఎండమావిలా వెంటాడుతోంది. కరోనా వైరస్ కల్లోల కాలంలో పోషకాహారమే ఏకైక అవసరమని, సమతుల ఆహారంతోనే రోగనిరోధకశక్తి పెరుగుతుందని విన్నాం. ఆహార కొరత నుండి బయటపడడానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు, ఆహార ధాన్యాలను సమర్థవంతంగా సకాలంలో ప్రజలకు పంపిణీ చేయడం లాంటి చర్యలు దోహదపడతాయి. ఆహార పదార్థాలలో బియ్యం, పప్పులు, పండ్లు, మాంసాహారం, చేపలు, గుడ్లు, కూరగాయలు, దుంపలు, తృణధాన్యాలు, చిక్కుల్లు, కాఫీ, టీ వంటివి వస్తాయి. ప్రపంచీకరణ, పట్టణీకరణ, ఆధునిక ఆహారపు అలవాట్లు, పెరిగిన ఆదాయాలు వంటి అంశాలు కూడా ఆహార భద్రతను ప్రభావితం చేస్తున్నాయని ఐరాస 'ఆహార, వ్యవసాయ సంస్థ' విడుదల చేసిన నివేదిక పేర్కొంది.

దీన్ని అధిగమించడం ఎలా? అనే సందేహం సహజమే. అయితే, మనదేశంలో మాత్రం ఆహార ఉత్పత్తి తగ్గడం, డిమాండ్ పెరగడంతో ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం, అస్పష్ట జాతీయ విధానాలు, అవినీతి, పేదరికం, నిరక్షరాస్యత వంటి సమస్యల్ని అధిగమించే చర్యల పట్ల పాలకుల చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది. అధిక జనాభా తగిన వనరుల్ని సరిగా ఉపయోగించకపోవడంతో ఈ సమస్య మరింత ఉత్పన్నమవుతున్నది. కరువు కాటకాలు, అనారోగ్యం, పర్యావరణ కాలుష్యం, సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు, పంపిణీలో లోపాలు, మార్కెట్లు అందుబాటు లో లేకపోవడం, రవాణా, సాంఘిక సమస్యలు లాంటి సమస్యలు ఆహార కొరతకు కారణాలుగా నిలుస్తున్నాయి. గ్రామీణ వ్యవసాయానుబంధ మౌలిక వసతుల కల్పనకు తగినంత కృషి లేకపోవడంతో ఆహార భద్రత నేడు ప్రశ్నార్థకంగా మారింది. మద్దతు ధర, ఆధునిక వ్యవసాయ పద్ధతులకు చేయూత, చిన్న సన్నకారు రైతుల కు వ్యవసాయ పెట్టుబడి సకాలంలో అందించడం, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా నిర్వహించడం, రవాణా వ్యవస్థను కల్పించడం లాంటి చర్యలు ఆహార కొరతను తగ్గిస్తాయి.

ఆకలిగా ఉన్నపుడు కడుపు నింపడానికి ఆహారం తీసుకోవడం మాత్రమే ఆరోగ్యానికి పరిష్కారం కాదని, మనం తీసుకునే ఆహారం సమతుల పోషకాలతో నిండి ఉండాలనేది అతి ముఖ్యమని అర్థం చేసుకోవాలి. ఇవన్నీ ఆకలింపు చేసుకొని ఆకలిచావులు లేని సంపన్న భారతదేశాన్ని నిర్మించే లక్ష్యంతో పాలకులు ముందుకు సాగాలి. ప్రజల్ని అందులో భాగస్వామ్యుల్ని చేయాలి.

- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి,
9949700037



రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

రాజకీయాలకు అతీతంగా గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భీమవరం గ్రామంలో మండల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక వాగ్దానాలను ప్రకటించిందని, ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు పరచలేక చతికల పడిందని విమర్శించారు. గత ప్రభుత్వ పాలనలో 10 సంవత్సరాల నుండి ఇళ్ల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా పేద ప్రజలకు నిష్పక్షపాతంగా ఇళ్ళు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో రాజకీయ జోక్యం వల్ల అర్హులైన ప్రజలు నష్టపోయే ప్రమాదం ఉందని కమిటీలు పారదర్శకంగా గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల కమిటీలలో అన్ని రాజకీయ పార్టీల నుంచి తీసుకోవాలని అన్నారు. రైతు రుణమాఫీకి అనేక షరతులు విధించి రైతులకు రుణమాఫీ అందించలేదని, రైతులకు పెట్టుబడి సాయం కింద వర్షాకాలం పంటలకు ఇవ్వవలసిన రైతు భరోసా ఇవ్వలేకపోయిందని ఆరోపించారు. పార్టీ నాయకులు గ్రామాలలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికలు తయారు చేసుకుని పోరాటాలు ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన నికరంగా నిలబడేది కమ్యూనిస్టులేనని ప్రజలకు తెలిసే విధంగా గ్రామ నాయకులు కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండి రమేష్, చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, గొల్లపూడి కోటేశ్వరరావు, నల్లమోతు హనుమంతురావు, అంగోతు వెంకటేశ్వర్లు, సగుర్తి సంజీవరావు, పెసరమల్లి ఇమెలమ్మ, జార్జి టెన్నిసన్, షేక్ నాగుల మీరా, రామిశెట్టి సురేష్, షేక్ లాల, మేడగాని తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులను ఆదుకోవాలి

- నేడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

వరద బాధితులకు నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎర్రా శ్రీనివాస్‌రావు తెలిపారు. 30వ డివిజన్లో పెద్దమ్మ తల్లి గుడి ఏరియాలో వరదలకు నష్టపోయిన కుటుంబాల దగ్గరకి వెళ్లి ధర్నాకి రావాలని ఇంటింటికి వెళ్లి సీపీఐ(ఎం), సీపీఐ బృందం సభ్యులు మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎర్ర శ్రీనివాసరావు, సిపిఐ ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి నూనె శశిధర్‌లు మాట్లాడుతూ వర్షాలకు ఖమ్మం మున్నేరు ఉప్పొంగి బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, మోతీనగర్, పెద్దమ్మ తల్లి గుడి ఏరియా, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్ ఏరియాలలో చాలా కుటుంబాలు నష్టపోయినాయన్నారు. ప్రభుత్వం ప్రకటించినటువంటి తక్షణ ఆర్థిక సహాయం 16,500 కేవలం కొంతమందికే అందాయన్నారు. చాలా కుటుం బాలకు ఇంకా ఆ సాయం అందలేదన్నారు. కావున తక్షణ ఆర్థిక సహాయం వెంటనే బాధితుల బ్యాంకు ఎకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇండ్లకు చుట్టూ ప్రహరీ గోడలు, కిటికీలు, గడపలన్నీ కూడా కొట్టుకు పోయినాయని, ప్రతి కుటుంబానికి సుమారు మూడు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందన్నారు. వెంటనే ఆస్తి నష్టానికి ప్రభుత్వం మూడు లక్షల రూపా యలను ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ హిమామ్, రంగు హనుమంతచారి, సిపిఎం 30 డివిజన్ శాఖ కార్యదర్శి ఎర్ర నగేష్ పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించండి

- ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వినతి

నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వ జూనియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రమబద్ధీకరణ కాని, కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేంద్రరెడ్డికి తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్- 475 రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వి.శ్రీనివాస్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. హైదరాబాదులో నరేందర్‌రెడ్డిని కలిసి, జీవో నెంబర్ 16 ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను అండ్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసేటప్పుడు కొంతమంది అధికారులు సమాచార లోపం వల్ల, ఇతర కారణాల వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 452 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుమారు 700 మంది డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ క్రమబద్ధీకరణ జరగలేదని, వీరందరూ కూడా గత 20 సంవత్సరాలు పైగా ప్రభుత్వ కళాశాలలో బోధన చేయటం జరిగిందని, అధికారుల సమాచార సమన్వయలోపం ఎన్నికల కోడ్ ఇతర కారణాల వల్ల ఈ క్రమబద్ధీకరణ ఆగిపోవటం జరిగిందని, వీరితో పాటు పనిచేస్తున్న వాళ్ళందరూ రెగ్యులరైజ్ కావడం జరిగిందని, క్రమబద్ధీకరణ కాని కాంట్రాక్టు లెక్చరర్ల కుటుంబాలు చాలా మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని, వీరి విషయాన్ని పరిశీలించి క్రమబద్ధీకరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. నరేంద్రరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి చేయవలసిన సూచనలు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ - 475 మహిళా కార్యదర్శి రజియా సుల్తానా, రాష్ట్ర నాయకులు చిట్టి మల్ల భాస్కర్, పూర్వ అధ్యక్షుడు రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- ఎస్ఐ కడగండ్ల మధుబాబు

నవతెలంగాణ - బోనకల్



అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కడగండ్ల మధుబాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్ర ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున బోనకల్ మీదుగా తెలంగాణ రాష్ట్రంలోకి ఇసుక అక్రమ రవాణా భారీగా జరుగుతున్నట్లు అయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనూ ఎటువంటి అనుమతులూ లేకుండా, నిబంధనలను అతిక్రమించి ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని తమకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రతిరోజు ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచనున్నట్లు ఆయన తెలిపారు.

నూకల నరేష్ రెడ్డికి మంత్రుల నివాళి

నవతెలంగాణ- ఖమ్మం

మరిపెడ బంగ్లా మండలం పురుషోత్తయగూడెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకల నరేష్‌రెడ్డి దశ దిన కర్మ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు. నరేష్ రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామచంద్ర నాయక్, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, నాయకులు మువ్వా విజయబాబు, సాధు రమేష్ రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు శేఖర్ గౌడ్, నల్లమల వెంకటేశ్వర రావు, మిక్కిలినేని నరేందర్, యలగొండ స్వామి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం నగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

- నిపుణుల కమిటీ సూచనల ప్రకారం రిటైనింగ్ వాల్ డిజైన్
- పేదలకు పునరావాసం కల్పించిన తర్వాతే ఆక్రమణల తొలగింపు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ -ఖమ్మం



రాష్ట్రంలోని ఇతర నగరాలకు, పట్టణాలకు మన ఖమ్మం నగరం ఆదర్శంగా ఉండే విధంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఖమ్మంలోని 46వ డివిజన్ సారథి నగర్‌లో పర్యటించి టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు ఒక కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన స్మార్ట్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో అకస్మాత్తుగా భారీ వరదలు వచ్చినప్పటికీ ప్రాణ నష్టం అధికంగా జరగకుండా ప్రజలలో ఉంటూ సేవలు అందించిన ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మున్నేరు వరద, చెరువుల నుంచి వచ్చే వరద పట్టణాన్ని ముంచే పరిస్థితి మరోసారి రాకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి, వరద ఎటు నుంచి వచ్చి ఎలా వెళ్లాలో డిజైన్ చేసేందుకు నిపుణుల కమిటీని నియమించాలని ముఖ్యమంత్రిని కోరడం జరిగిందని, భవిష్యత్తులో ఎటువంటి తప్పులు జరగకుండా పకడ్బందీగా వరద నివారణ చర్యలు ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. ప్రస్తుతం నిర్మించే మురుగునీటి కాలువల డిజైన్ సైతం పక్కాగా ఉండాలని, మురికి కాలువ నిర్మాణం చివరి వరకు వెళ్లే విధంగా చూడాలని, వీటి నిర్మాణం వల్ల భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు రావద్దని మంత్రి ఇంజనీర్లకు సూచించారు. నాలాలు, నీటి ప్రవాహాలలో ఉన్న ఆక్రమణలను తొలగించే సమయంలో మానవతా దృక్పథంతో ఉండాలని తెలిపారు. ఆక్రమణలలో ఉన్న పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు మరో చోట అందించి, వారిని తరలించిన తర్వాత ఆక్రమణలను తొలగించాలని మంత్రి తెలిపారు. ఆక్రమణలు తొలగించిన తర్వాతనే నిర్మాణ పనులు ప్రారంభించాలని, ఆయా డివిజన్లలో కార్పొరేటర్లు పేద ప్రజలతో చర్చించి వారికి మెరుగైన పునరావాసం కల్పించి, వచ్చే వర్షాకాలం నాటికి కాలువ నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి, కార్పొరేటర్ కమర్తపు మురళీ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నీలి విప్లవం ద్వారా మత్స్యకారుల ఆదాయం పెంపు

నీలి విప్లవం ద్వారా మత్స్యకారుల ఆదాయం పెరుగుతుందని, ఆ దిశగా ప్రభుత్వం నీటి వనరులలో ఉచితంగా చేప పిల్లలు విడుదల చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం ఖమ్మంఅర్బన్ మండలం బల్లేపల్లిలో పర్యటించి రాయనిచెరువులో 26 వేల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మత్స్యకారులు సంతోషంగా ఉండాలనే ఉద్దేశ్యంతో వారికి జీవనోపాధి కల్పించడం కోసం ప్రభుత్వం నీటి వనరులలో ఉచితంగా చేప పిల్లలను విడుదల చేసే కార్యక్రమం చేపట్టిందని అన్నారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి 212 మత్స్యకార సహకార సంఘాలు,16 వేల మంది సభ్యులు ఉన్నారని, వీరందరికీ ఉపయోగపడే విధంగా 300 పైగా చెరువులలో సుమారు 60 లక్షల చేప పిల్లలు ఉచితంగా సరఫరా చేస్తున్నామని అన్నారు. మన జిల్లా మొత్తం దాదాపు 150 కోట్ల చేపల వ్యాపారం గత కొన్ని సంవత్సరాలుగా జరిగినట్లు అధికారులు చెబుతున్నారని, ఇది చాలా సంతోషకరమని అన్నారు. గతంలో మనం ఆంధ్ర, వెస్ట్ బెంగాల్ నుంచి చేపలు తెచ్చుకునే వారమని, ఇప్పుడు మన చేపల కోసం ఇతర ప్రాంతాల ప్రజలు వస్తున్నారని తెలిపారు. మన దగ్గర నీలి విప్లవం రావాలని, ఇతర రాష్ట్రాలకు మన చేపలను ఎగుమతి చేయాలని, చేపల మార్కెటింగ్ కు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. చేపలు వాసన రాకుండా, పాడవకుండా వాహనాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. జిల్లాలో ఉన్న చెరువులను వచ్చే వేసవి కాలం కొలిచి ఆక్రమణలు జరగకుండా ట్రెంచ్ కొట్టించాలని, నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ వి.రవికుమార్, ఇన్చార్జి జిల్లా మత్స్యశాఖ అధికారి శివ ప్రసాద్, ప్రజాప్రతినిధులు, మత్స్య సంఘం ప్రతినిధులు, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేయాలి

గ్రామాల్లోని రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మంత్రి రఘునాథపాలెం మండలంలోని గ్రామాలలో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు హెల్త్ సెంటర్ మంజూరు చేశామని, మంచి స్థలం ఎంపిక చేసుకుని నిర్మాణ పనులు ప్రారంభించాలని తెలిపారు. రాంక్యా తండాలో ఇండ్లు లేని పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని, ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులందరికీ అందజేస్తామని తెలిపారు. రాబోయే నెలలో మిగిలిన రైతులకు కూడా రుణమాఫీ పూర్తి చేస్తామని తెలిపారు. ప్రతి రైతుకు 2 లక్షల రూపాయల రుణమాఫీ తప్పనిసరిగా చేస్తామని అన్నారు. రఘునాథ పాలెం మండలంలో రైతులంతా ఆయిల్ పామ్ సాగు చేయాలని, కూరగాయలు, మిర్చి పంట వేసుకునే రైతులంతా వారి పొలాలలో ఆయిల్ పామ్ మొక్కలు వేస్తే 50 వేల రూపాయల సబ్సిడీ క్రింద అందిస్తామని, ఆయిల్ పామ్ మొక్కలు, డ్రిప్ అంశంలో ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని అన్నారు. అంతర్ పంటల కింద కూరగాయలు, ఇతర పంటల సాగు వల్ల 3 సంవత్సరాల వరకు ఆదాయం వస్తుందని అన్నారు. సంవత్సర కాలంలో రాంక్యా తండాకు సాగర్ నీరు అందించే బాధ్యత తీసుకుంటానని, గతంలో పుట్ట కోట ప్రాజెక్టు నుంచి పైప్ లైన్ వేసి మంచినీళ్లు అందించామని, రఘునాథపాలెం మండలంలో 25 కోట్లు నూతన రోడ్లు, డ్రైన్లకు మంజూరు చేశామని, మండలంలో అడిగిన అన్ని డొంక రోడ్లకు 50 కోట్లు తీసుకుని వస్తానని తెలిపారు. అనంతరం మంత్రి రాంక్యా తండాలో కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచం భద్రత కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ అశోక్, పంచాయతీ రాజ్ డిఈ యు.మహేష్ బాబు, ఏఈ జే.చిరంజీవి, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ అధ్యక్షతన జరిగిన "యంగ్ కమ్యూనిస్ట్ వర్క్‌షాపు" లో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేటి యువత సమాజంలో జరుగుతున్న ప్రతీ విషయాన్ని అధ్యయనం చేస్తూ, అవగాహన చేసుకోవాలని ఆయన కోరారు. తమ తమ వ్యక్తిగత జీవితాలలో ఉన్నత స్థానాలకు చేరుకుంటూనే సమాజంలో జరిగే విషయాల పట్ల నిరంతరం స్పందించాలని తెలిపారు. అవసరమైన సందర్భంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత చురుకుగా పాల్గొనాలని అన్నారు. రాజకీయ రంగంలో జరుగుతున్న అవినీతిని వ్యతిరేకించాలని కోరారు. సమాజాన్ని, యువతను పక్కదారి పట్టించే మద్యం, గంజాయి, డ్రగ్స్ తదితర వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. సమాజాన్ని నష్టపర్చే ఈ విషయాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్, అభివృద్ధి యువత చేతిలోనే ఉంటుందని తెలిపారు. భారతదేశంలో 15 నుంచి 35 సం.ల మధ్య వయస్సుకల్గిన యువత 40 కోట్ల మంది వున్నారని, ఇది దేశానికి విలువైన సంపద అని అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇంత పెద్ద సంఖ్యలో యువత లేదని తెలిపారు. వీరు సరైన మార్గంలో నడిచినప్పుడే దేశం సరైన బాటలో నడుస్తుందని, అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. కులం, మతం తదితర భావోద్వేగాల ఆధారంగా ప్రజలను విభజిస్తూ రాజకీయాలను నడిపించే వారిపట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. అటువంటి రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలని తెలిపారు. అప్పుడు మాత్రమే నిజమైన దేశభక్తులుగా యువత ఉండగలుగుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. అలా జరగనప్పుడు యువత చెడుమార్గాలు పట్టే అవకాశం ఉంటుందని, అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం కూడా ఉంటుందని అన్నారు. ఇది దేశానికి నష్టదాయకమని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దాల ప్రభాకర్, షేక్ బషీరుద్దీన్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు పొనుకుల సుధాకర్, తుడుం ప్రవీణ్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా దుకాణాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి : సీపీ

నవతెలంగాణ- ఖమ్మం

జిల్లాలో బాణసంచా దుకాణాలు పెట్టుకోదలచిన వ్యాపారులు ఈనెల 25 తేది సాయంత్రంలోపు పోలీస్ కమిషనర్ కార్యాలయానికి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకొని, అనుమతి పొందాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలలో వ్యాపారులు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ, నగర పాలక శాఖ, అగ్నిమాపక శాఖలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే అనుమతితో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు, టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఏఈ-5 ఫామ్, సెల్ఫ్ అఫిడవిట్, చలానా రిసీప్ట్,. ఆధార్ కార్డ్, ఫోటో జతపరచి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని, అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బాణసంచా విక్రయదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.



మార్పు స్వచ్ఛంద సంస్థ చేయూత

నవతెలంగాణ-వైరాటౌన్

మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు ఇందిరానగర్ కాలనీ నివాసి కుక్కల బాబుకు మంగళవారం బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లు అందజేశారు. కూరగాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్న కుక్కల బాబు గత రెండు సంవత్సరాలుగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. బాబు భార్య కూడ అనారోగ్యంతో చనిపోవడం వలన కుటుంబ పోషణకు ఆర్థికంగా ఇబ్బంది పడుతూ దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్న విషయం తెలుసుకున్న మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత కుక్కల బాబు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని 25 కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా గుడిమెట్ల రజిత మాట్లాడుతూ జి.వి.రామన్ పుట్టినరోజున ప్రారంభించిన మార్పు స్వచ్ఛంద సంస్థ రెండు వసంతాలు పూర్తి చేసుకుందని, గత రెండు సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. చిన్న సహాయం కూడా ఆపదలో ఉన్నవారికి చాలా ఉపయోగపడుతుందని, మానవత్వంతో దాతలు ముందుకు వచ్చి కుక్కల బాబుకు సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ సభ్యులు జి.వి.రోషన్, ఆదూరి ప్రేమ్‌కుమార్, పొన్నం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వరికి కలుపు మందు కొట్టిన దుండగులు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం గేటుకారేపల్లిలో సామినేని బస్వయ్యకు చెందిన వరి పంటకు గుర్తుతెలియని దుండగులు కలుపుమందు కొట్టటంతో అది పూర్తిగా ఎండిపోయింది. మంగవారం పొలం వద్దకు వెళ్ళిన రైతు బస్వయ్యకు పొలం ఎండిపోయి ఉంది. రైతంటే గిట్టని వారు పొలానికి కలుపుమందు కొట్టి ఉంటారని భావిస్తున్నారు. పొలం ఈనీన దశలో ఎకరం పొలం పూర్తిగా ఎండిపోయి రూ.40వేల నష్టం వాట్టిల్లింది. దీనికి సంబంధించి బాధితుడు కారేపల్లి పోలీసులకు అనుమానితుల మీద ఫిర్యాదు చేశారు.

మాఫీకాని రెండు లక్షల రుణం

- కొర్రీలు పెట్టి తప్పించుకొనే ప్రయత్నం
- ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలెందుకు..?
- గ్రామసభల ద్వారా ఎంపిక జరగాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-సత్తుపల్లి



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ. 2లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని, సగం మందికి కూడా రుణమాఫీ జరగలేదని, రేషన్ కార్డులుండాలంటూ మొత్తం డబ్బు కట్టాలంటూ ఇలా వివిధ రకాల కొర్రీలు పెట్టి తప్పించుకొనే ప్రయత్నంలో ప్రభుత్వం ఉందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం అన్నారు. సత్తుపల్లిలోని రావి వీరవెంకటయ్య భవన్‌లో మంగళవారం జరిగిన ఆ పార్టీ సత్తుపల్లి పట్టణ కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో వీరభద్రం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రుణమాఫీపై మంత్రుల పూటకొక ప్రకటనలు గందరగోళంగా ఉందన్నారు. రైతు భరోసాను అటకెక్కించారన్నారు. గత ప్రభుత్వం సీజన్‌ను బట్టి రైతులకు రైతుబంధును అందించేదన్నారు. ఎకరానికి రూ. 15వేలు రైతు భరోసా అంటూ ఎన్నికల సమయంలో ఎంతో గొప్పగా చెప్పుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ వాళ్ల ప్రభుత్వం ఏర్పడి యేడాదికి దగ్గరలో ఉన్నా ఆ ఊసే లేకుండా పోయిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయానికొస్తే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తామనడం సహేతుకంగా లేదన్నారు. ఇందిరమ్మ కమిటీ సిఫార్సులతో లబ్దిదారులను ఎంపిక చేసే క్రమంలో అర్హులైన పేదలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని వీరభద్రం స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను ఆయా గ్రామసభల ద్వారానే జరగాలని డిమాండ్ చేశారు. ఎలాంటి నిభందనలు లేకుండా తక్షణమే రూ. 2లక్షల రుణమాఫీని అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక గ్రామ సభల ద్వారానే చేపట్టాలని, రైతు భరోసాను ఆచరణలోకి తీసుకురావాలని వీరభద్రం డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, మోరంపూడి పాండురంగారావు, నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, మోరంపూడి వెంకటరావు, చావ రమేశ్, రాము, వలీ, చెరుకు కుమారి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలన్నీ వెంటనే అమలు చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి తోట నాగేశ్వరావు

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మండలం గన్నవరం, కొండకొడిమ సిపిఐ(ఎంఎ) గ్రామ శాఖల మహాసభలు కారుమంచి దావీదు, దొంతెబోయిన గంటమ్మ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా తోట నాగేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అధికారంలోకి రాక ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం అవుతుందని అన్నారు. వెంటనే హామీలను అమలు చేయకపోతే ప్రజా పోరాటం తప్పదని, కేడర్ సిద్ధంగా ఉండాలని కోరారు. అనంతరం గన్నవరం శాఖ కార్యదర్శిగా శీలం వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శిగా కారుమంచి సుధాకర్, కొండకొడిమ శాఖ కార్యదర్శిగా దొంతేబోయిన గంటమ్మ ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా మండలం కార్యదర్శివర్గ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, బాజోజు రమణ, తూము సుధాకర్, మండల కమిటీ సభ్యులు జెర్రిపోతుల పుష్పరాజ్యం, కారుమంచి జైయరావు, శాఖ కార్యదర్శి సీలం వెంకటరెడ్డి, నాయకులు కారుమంచి మల్లయ్య, పౌలు, శీను, ప్రభాకర్, వజ్రమ్మ, మరియమ్మ, లక్ష్మీబాయి, నాగమణి, బుంగ వెంకటేశ్వర్లు, నరసరావు, ముక్కంటి జయరావు, జే.ప్రవీణ్, అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

- నగరానికి నాలుగు దిక్కులా ఖబరస్థాన్ల ఏర్పాటుకు చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

నవతెలంగాణ-ఖమ్మం

విద్యతో మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందని, మన పిల్లలకు తప్పనిసరిగా మంచి విద్య అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం ఖమ్మంలోని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి ఖమ్మం ఉర్దూ షాదీఖానాలో ఖమ్మం నియోజక వర్గంలో ఉన్న 63 మస్జిద్‌లకు, మస్జిద్ ఒక్కటికి లక్ష చొప్పున రిపేర్ కోసం మంజూరు చేసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ వరదలు, పార్లమెంట్ ఎన్నికల కారణంగా మసీదుల నిర్వహణ నిధులు ఆలస్యం జరిగిందని, పెద్దలు చెప్పినట్లుగా ఇక నుంచి ప్రతి సంవత్సరం రంజాన్ పండుగ ముందుగానే మసీదుల నిర్వహణ నిధులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సమయంలో ఇప్పుడున్న షాదీఖానా స్థలంలో ఫైర్ స్టేషన్ ఉండేదని, ముస్లీం సోదరులు షాదీఖానా అడిగితే ఇక్కడ ఏర్పాటు చేశామని అన్నారు. షాదీఖానా నిర్వహణ బాగా లేదని, షాదీఖానా నిర్వహణ కోసం మరో 50 లక్షలు మంజూరు చేస్తామని, కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి పకడ్బందీగా షాదీఖానాను తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నగరం అన్ని వైపులా ఖబరస్థాన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఖమ్మం నగరంలో ఉన్న హిందువులు, ముస్లిం, క్రిస్టియన్ మొదలగు అన్ని వర్గాల వారు అన్నదమ్ముళ్ల కలిసి ఉండే చరిత్ర ఉందని, దానిని కొనసాగించాలని అన్నారు .ఖమ్మం కార్పొరేషన్ కు నలుదిక్కులా ఖబరస్థాన్ లు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారని, ఆ సూచనల ప్రకారం 4 ఖబరస్థాన్ ల ఏర్పాటుకు స్థలం గుర్తించామని, నెల రోజుల వ్యవధిలో స్థలాలను అప్పగించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వర రావు, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, ఇంచార్జ్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, కార్పొరేటర్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మస్జిద్ కమిటీ సభ్యులు, ముస్లింలు, పాల్గొన్నారు.



వెంపటి రంగారావును పరామర్శించిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత గుప్త

నవతెలంగాణ-వైరా

కొద్ది రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో హైద్రాబాద్ నిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతున్న వెంపటి రంగారావుని మంగళవారం ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి కల్వ సుజాత గుప్త పరామర్శించి, అతని ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లతో మాట్లాడారు. ప్రతిరోజు రంగారావు కూతురితో ఫోన్లో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటు ధైర్యం చెబుతూ, కుటుంబం పట్ల కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నామని సుజాత తెలిపారు. ఆమె వెంట ప్రవీణ్, తదితరులు ఉన్నారు. వెంపటి రంగారావు చిన్న వ్యాపారం చేసుకుంటూ తన ఏకైక కుమార్తెను చదివించి లండన్ పంపించారు. కుమార్తె సహకారంతో ఇటీవల సేవా కార్యక్రమాల్లో చేస్తూ, కాంగ్రెస్ పార్టీ రాజకీయాలలో చురుగ్గా పాల్గొంటూ కుమార్తె దగ్గరకు (లండన్) వెళ్ళే ప్రయాణంలో ఓఆర్‌ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు.



వరి పంటలను పరిశీలించిన ఏవో

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని దుబ్బతండా, ఎర్రగడ్డతండ, కొత్తూరు, గైగోళ్లపల్లి గ్రామాలలో బ్యాక్టీరియా, తెగులు ఆశించిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత కొద్ది రోజులుగా మారుతున్న వాతావరణ మార్పుల దృష్ట్యా, వర్షాలు కురవడం, పగటిపూట ఉబ్బ వాతావరణం ఉండడంతో వరిలో బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు ఆశిస్తున్నట్లు గమనించామన్నారు. ఈ తెగులు ఆశించినప్పుడు ఆకులపైన పసుపు రంగు మచ్చలు ఏర్పడి, అంచుల వెంబడి అలల మాదిరిగా ఎండిపోవడం జరుగుతుందని,,ఈ తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పైపాటుగా నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించారు. ఈ తెగులు పూర్తిగా నివారించడానికి ఎలాంటి మందులు లేవని రైతులు గమనించాలని, ఈ తెగులు లక్షణాలు తొలిదశలో గమనించినట్లైతే కొంతవరకు వ్యాప్తిని నివారించడానికి ప్లాంటమైసిన్ లేదా పోషమైసిన్ 0.2 గ్రా లేదా అగ్రీమైసిన్ 0.4 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో పాలేరు క్లస్టర్ ఏఈఓ మానస, రైతులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలపై వినతి

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరం 27వ డివిజన్ శ్రీనివాస్ నగర్‌లో ప్రజలు ఇటీవలె కురిసిన వర్షాలకు రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు పాడైపోయాయని వాటి మరమ్మతులకు కావాల్సిన ఫండ్స్ రిలీజ్ చేయాలని అలాగే సకాలంలో మున్సిపాలిటీ పంపులు రావట్లేదని అవి కూడా సమయానికి వదిలేలా చూడాలని, పందులు, కుక్కలు, దోమలు, మురికి నీరు వంటి పలు సమస్యలతో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ అగస్త్యకు 27వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డ నగేష్ డివిజన్ ప్రజలతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అసలే సీజన్ వ్యాధులు సంభవిస్తున్న తరుణంలో పందులు, కుక్కలు, దోమలు, మురికి నీరు నిలవడం వల్ల మరిన్ని వ్యాధులు సంభవించి అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని, కావున తక్షణమే వాటిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దండమూడి గిరిజ, మోదేపల్లి రాజలక్ష్మి, చేకుట్ల కుమారి, జెట్టి శిరీష, ఎంకే సత్యవతి, మేడవరపు చరిత, కొప్పుల అనూష, గంధం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్ కె.సునీత ఎల్జిబెత్

నవతెలంగాణ-ముదిగొండ



గంధసిరి, పెద్దమండవ మున్నేరు నుండి ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.సునీత ఎలిజిబెత్ హెచ్చరించారు. మండల పరిధిలో పెద్దమండవ, గంధసిరి మున్నేరులను ఎస్ఐ నరేష్‌తో కలిసి ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మున్నేరుకు ఇసుక ట్రాక్టర్లు పోకుండా జెసీబీతో అడ్డంగా కందకాలను తొవ్వించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్నేరు ప్రాంతం నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఇసుక ట్రాక్టర్లతో పాటు,యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణాదారులను ఉక్కుపాదంతో అణచివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ఎస్కే వహీదాబేగం, ప్రసన్న కుమార్, ట్రైన్ ఎస్సై రోహిత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నమస్కారం, బాగున్నారా, నేను మీ జిల్లా కలెక్టర్‌ని..

ఫుట్ వేర్ షాప్, ఆటో స్టాండ్ వద్ద ఆగి వివరాలు, సమస్యలు అడిగి తెలుసుకున్న ముజమ్మిల్ ఖాన్

- ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తాం
- సమస్యలు ఉంటే నేరుగా తనను కలవండి

నవతెలంగాణ-ఖమ్మం



నమస్కారం, బాగున్నారా, నేను మీ జిల్లా కలెక్టర్‌ని, ఎలా నడుస్తున్నది వ్యాపారం, ఇక్కడి నుండి ఎక్కడి వరకు ఆటో నడుపుతారంటూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆటో డ్రైవర్‌లు, ఫుట్ వేర్ యజమాని వద్దకు వెళ్లి వారితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఖమ్మం బస్ స్టాండ్ కు ఆనుకొని షాదీఖానా వెళ్ళే రోడ్డులో ఉన్న ఫుట్ వేర్ షాప్ లను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా వెళ్లి వ్యాపారం ఎలా నడుస్తున్నది, రోజువారీ సంపాదన, కుటుంబ పోషణ, పిల్లల చదువు నేపథ్యం మొదలగు వివరాలను షాప్ యజమాని సయ్యద్ బిలాల్ పాషాతో మాట్లాడి తెలుసుకున్నారు. వ్యాపార నిమిత్తం చెప్పుల స్టాక్ ఎక్కడి నుండి తెస్తారు, దానికి పెట్టుబడి ఎలా వస్తుందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారాలు చేసే వారి కోసం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా, అలాగే ముద్ర పథకం ద్వారా తక్కువ వడ్డీతో పెట్టుబడి కోసం రుణాలు పొందవచ్చని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తర్వాత బస్టాండ్ సిగ్నల్ ప్రాంతం మూల మీద ఆగి ఉన్న ఆటో స్టాండ్ వద్దకు వెళ్లి ఆటో డ్రైవర్ లతో మాట్లాడారు. ఆటో డ్రైవర్‌లు రోజుకు ఎంత సంపాదిస్తున్నారు, కుటుంబ పోషణకు సరిపోతున్నాయా, ఆటో సొంతందా, కిరాయికి తెచ్చుకున్నారా వంటి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్‌గా మీరే మా వద్దకే వచ్చి మాకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడగడం చాలా సంతోషంగా ఉందని ఆటో డ్రైవర్ లు తెలిపి, ఖమ్మం నగరంలో 3 వేల వరకు ఆటోలు ఉంటాయని, ఆటో కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆటో అడ్డాలు పెంచాలని, వసతులు కల్పించాలని ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ ప్రసాద్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఖమ్మం జిల్లాలో పని చేసే మున్సిపల్ కార్మికులు, పంచాయతీ వర్కర్లకు ఇటీవల ఇన్సూరెన్స్ కల్పించామని, ఆటో డ్రైవర్‌లు ప్రతి సంవత్సరం ఆర్‌టీఓ దగ్గర రెన్యువల్ చేసే సమయంలో కొంత మొత్తం చెల్లించడానికి ముందుకు వస్తే, ఆటో డ్రైవర్లకు కూడా ఇన్సూరెన్స్ కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని, దీనిపై త్వరలో జిల్లా స్థాయి ఆటోల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులతో చర్చిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆటో అడ్డాల దగ్గర తాగునీటి సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ అన్నారు. ఆటో డ్రైవర్ల పిల్లల చదువుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ లు మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో చదువు తున్నారని తెలుపగా, గురుకులాలలో, ప్రభుత్వ బడులలో పిల్లలు ఎలా చదువుతున్నారు, టీచర్లు జవాబుదారీ తనంతో ఉన్నారా, పేరెంట్ టీచర్స్ మీటింగ్ లకు హాజరవుతున్నారా వంటి వివరాలు కలెక్టర్ ఆరా తీశారు.

జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్యం ఎలా అందుతుంది, ఆటో డ్రైవర్లు వెళ్లినప్పుడు అవసరమైన మందులు ఇచ్చారా వంటి వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్ లకు ఏదైనా ఇబ్బందులు ఉంటే తనను కలెక్టరేట్ కు వచ్చి కలవాలని, సమస్యల పరిష్కారానికి వీలైనంతవరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.



2వ రోజు డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరి వల్ల ఫీజ్ రియంబర్స్మెంట్ బకాయిలు పేరుకు పోయాయని, ఈ విధానం వల్ల పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఇప్పటికే కార్పొరేట్ దాటికి సాంప్రదాయ విద్య దెబ్బ తిన్నదని ప్రయివేట్ యాజమాన్యాల సంఘం బాధ్యులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తానని చెప్పడం వల్ల విద్యార్థులు ఫీజులు చెల్లించడం లేదని యాజమాన్యాలు విద్యార్థులు ఫీజులు చెల్లించడం లేదని, ప్రభుత్వం ఏమి మంజూరు చేయడం లేదని, దీని వల్ల యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యాజమాన్యాలు కళాశాలల నిర్వహణకు జీతాలు చెల్లించడానికి అప్పులు చేస్తున్నారని, వాటికీ వడ్డీలు కూడా చెల్లించలేని దుస్థితికి దిగజారిపోయాయని, విద్యార్థులకు సరైన విద్య అందించాలంటే ప్రభుత్వం వెంటనే ఫీజు రీయంబర్స్మెంట్ ని చెల్లించి యాజమాన్యాలను విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మద్ది ప్రభాకర్ రెడ్డి, ఆర్‌జెసి కళాశాల కరస్పాండెంట్ గుండాల కృష్ణ, డి.ఆర్.ఎస్. కళాశాల కరస్పాండెంట్ వి మోహన్ రెడ్డి, ప్రియదర్శిని కళాశాల కరస్పాండెంట్ కాటేపల్లి నవీన్ బాబు, గాయత్రి కళాశాల కరస్పాండెంట్ కుతుంబాక సునీల్ కుమార్, కవిత మెమోరియల్ కళాశాల కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- రుణమాఫీ ప్రతి రైతుకూ అందజేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-కూసుమంచి



కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తానని చెప్పి, నేటికి 10 నెలలు అయినా కూడా ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందని, వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు 6 గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో పార్టీ మండల కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని చెప్పి, నేటికి ఒకటి, రెండు, గ్యారంటీలను అమలు చేసి మిగిలినా హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అలాగే ప్రతి రైతుకూ రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు రెండు లక్షల రూపాయల వరకు బ్యాంకుల్లో రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుబంధు కూడా రైతు ఖాతాలో జమ చేసి, రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కింద సహాయం చేసి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మరో ముఖ్య అతిథి పాలేరు డివిజన్ ఇన్‌చార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ... సీపీఐ(ఎం) మండలంలోని ప్రతి గ్రామంలో బలమైన నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని, పార్టీ మండలంలో తిరుగులేని శక్తిగా ఎదగాలని, ఇందుకు ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా పనిచేసే పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. మల్లెల సన్మత్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు శీలం గురుమూర్తి, తోటకూరి రాజు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని రావినూతల ఉన్నత పాఠశాల ఎదురుగా మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రావినూతలకు చెందిన చేబ్రోలు జనార్ధన్ గ్రామం నుంచి నడుచుకుంటూ బోనకల్లు వైపు వెళుతున్నాడు. అయితే అదే సమయంలో కల్లూరు మండలం చిన్న కోరుకొండి గ్రామానికి చెందిన కంచపోగు శ్రీకాంత్ తన మోటార్ సైకిల్ పై వైరా వైపు నుంచి బోనకల్లు వస్తున్నాడు. రావినూతల ఉన్నత పాఠశాల ఎదురుగా వైరా– జగ్గయ్యపేట ప్రధాన రహదారి పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న చేబ్రోలు జనార్ధన్ ను కంచిపోగు శ్రీకాంత్ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చేబ్రోలు జనార్ధన్ కు కాలు ఇరిగింది. బ్లూకోల్ట్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే ప్రమాదం జరిగిన వెంటనే కంచపోగు శ్రీకాంత్ మోటార్ సైకిల్ నుంచి రెండు మద్యం సీసాలు, ఒక వాటర్ బాటిల్ కింద పడింది. శ్రీకాంత్ మద్యం మత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. జనార్ధన్‌ను బంధువులు స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

మెరుగైన ప్రభుత్వ వైద్యం ప్రజలకు అందాలి

- సుఖ ప్రసవాలు జరిగేలా కృషి జరగాలి
- త్వరలో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తాం
- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ

నవతెలంగాణ-సత్తుపల్లి



మెరుగైన ప్రభుత్వం వైద్యం ప్రజలకు అందాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీజ అన్నారు. మంగళవారం సత్తుపల్లిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రక్తపరీక్ష కేంద్రం, అవుట్ పేషంట్ నమోదు విభాగం, డయాలసిస్ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. పురుషులు, మహిళల వార్డులను పరిశీలించిన ఆమె వైద్యం పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, ఫార్మాసిస్ట్‌తో ఆమె మాట్లాడుతూ మందుల సరఫరా విషయంలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు విభాగాలు సందర్శించిన సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాతాశిశు సంరక్షణ (సీమాంక్) సెంటరు సందర్శించారు. పురుడు పోసుకున్న బాలింతల వార్డును పరిశీలించారు. గర్భిణులు, ప్రసవాల రికార్డులను తనిఖీ చేశారు. సుఖ ప్రసవాలు జరిగేలా వైద్యుల కృషి ఉండాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రిని పరిశీలించారు. నిర్మాణం పూర్తికాగానే మౌలిక వసతులు, ఎక్విప్‌మెంట్స్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించడం జరుగుతుందన్నారు. అనంతరం మండలంలోని గంగారం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో తలారీ సీతారామ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, డాక్టర్లు సురేశ్ నారాయణ, ప్రణయ్, జయలక్ష్మి, రాజేశ్, సాంబశివరావు, నారాయణమ్మ ప్రేమలత, గీష్మిత, స్టాఫ్ నర్సులు, జీఎన్ఏఎస్‌లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



పశువులకు తప్పనిసరిగా గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి

- మండల పశువైద్య అధికారి డాక్టర్ నీలాకాంత్..

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలో ఉన్న నల్ల, తెల్ల జాతి పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను చేయించుకోవాలని దీంతో పశుసంపాదన కాపాడుకోవచ్చని మండల పశు వైద్యాధికారి డాక్టర్ నీలాకాంత్ తెలిపారు. మంగళవారం మండలంలోని జక్కపల్లి గ్రామంలో మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నెల రోజులపాటు మండలంలో రాష్ట్ర ప్రభుత్వంగా పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేసి వాటిని కాపాడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. మంగళవారం సెప్టెంబర్ 14 వరకు నెల రోజుల పాటు మండలంలోని ప్రతి గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం టీకాలను పశువులకు వేయటం జరుగుతుందని చెప్పారు. ఆయా గ్రామాలలో పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్న ముందు రోజే సమాచారాన్ని ముందస్తుగానే అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి
- ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ

నవతెలంగాణ-వైరా



క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. మంగళవారం వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో షిరిడి సాయిబాబా మందిరంలో గుంటూరులో జరుగుతున్న సౌత్ నేషనల్ అథ్లెటిక్స్ రన్నింగ్ పోటీలకు సెలెక్ట్ అయిన మడిపల్లి మనీషాకు ఐదో వార్డ్ కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ దంపతులు మిత్రులు సహకారంతో కలిసి క్రీడా దుస్తులు, బూట్లకు ఐదు వేల రూపాయలను అందించారు. అదేవిధంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు చొరవతో లయన్స్ క్లబ్ సభ్యులు 20వేల రూపాయలను మనిషాకు అందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ అథ్లెటిక్స్ కోటాలో గురుకులంలో చదువుకుంటూ అథ్లెటిక్స్‌లో శిక్షణ పొంది సౌత్ నేషనల్ రన్నింగ్ పోటీలకు సెలెక్ట్ అయిన మడిపల్లి మనీషాను అభినందించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం తధ్యం అన్నారు. గతంలో కూడా క్లబ్ నుండి అనేక మందికి క్రీడా పోటీలకు సహాయ సహకారాలు అందించామని తెలిపారు. చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహించామని తెలిపారు. మనీషా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి దఢ సంకల్పంతో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైరా లయన్స్ క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు, క్లబ్ సెక్రటరీ అబ్బూరి రమేష్, కోశాధికారి మరికంటి రాంగోపాల్, ఐదో వార్డ్ కౌన్సిలర్ మాదినేని సునీత, జిల్లా క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ లగడపాటి ప్రభాకర్ రావు, జీఎస్టీ కోఆర్డినేటర్ ఉండ్రూ శ్యాంబాబు, జోన్ చైర్మెన్ పెనుగొండ ఉపేందర్ రావు, క్లబ్ సభ్యులు చింతోజు నాగేశ్వరరావు, మాదినేని దుర్గాప్రసాద్, చెరుకూరి శ్రీనివాసరావు, కొమిరిశెట్టి శ్రీధర్, రాయపూడి నారాయణరావు, రంగా సత్యనారాయణ, వాసవి, గద్దె నీరజ, మడిపల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మిషన్ భగీరథ పైపులైన్ లీకులకు మరమ్మతులు చేయాలి

- డీఈ శ్రీనివాస్

నవతెలంగాణ-ముదిగొండ

గ్రామాలలో మిషన్ భగీరథ పైపులైన్ లీకులకు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్ అన్నారు. ముదిగొండ రైతువేదికలో మిషన్ భగీరథ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముదిగొండతోపాటు, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పనిచేసే గ్రామ సహాయకులు పైప్ లీకులు, గేట్ లీకులు, మోటార్ రిపేర్లు, చేతి పంపులు రిపేర్లలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పైప్ లైన్ల లీకులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సహాయకులకు ఆయన పలు సూచనలు సలహాలు ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా గ్రామ సహాయకులు తమ మెలుకువలను, ప్రతిభను, మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె. సునీతఎలిజిబెత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయరాజు, ఎంపీడీఓ ఎస్.శ్రీధర్ స్వామి, ఎంపీఓ వాల్మీకి కిషోర్, శిక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు 10.2 ఎకరాల భూమి మంజూరు

- ఎమ్మెల్యే పాయం



నవతెలంగాణ-మణుగూరు

ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ కళాశాలకు 10.2 ఎకరాల భూమిని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కేటాయించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నందు జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్, స్టాఫ్ సభ్యులు పాయంని మర్యాదపూర్వకంగా కలిసి పూల గుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. 2023లో గవర్నమెంట్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల మూడు కోర్సులతో అనగా డిప్లమో, మైనింగ్ డిప్లమో, మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లమా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సులతో 60 మంది ఇంటెక్ ఒక బ్రాంచ్‌కి చొప్పున ప్రారంభమైనది. దానికి గాను తాత్కాలికముగా జూనియర్ కాలేజీ మణుగూరు భవనం నందు ప్రారంభించబడినది. ఎమ్మెల్యే కృషితో ఈ కళాశాలకు భూమి మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బి.నాగ ముని నాయక్, మెకానికల్, ఎలక్ట్రికల్, మైనింగ్, హెచ్వోడీలు, స్టాఫ్, టీఎస్ పీఏఎల్‌ఏ ప్రెసిడెంట్ జి.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి పశువైద్య శిబిరాలు

- డాక్టర్ స్వప్న



నవతెలంగాణ-అశ్వారావుపేట

పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16 తేదీ నుండి వచ్చేనెల 4వ తేదీ సోమవారం వరకు మండలంలోని గ్రామాలు వారీగా తెలుపు, నలుపు పశువులకు 'గాలి కుంటు' నివారణ టీకాల పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు పశు సంవర్థక శాఖ మండల అధికారిణి డాక్టర్ స్వప్న తెలిపారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడుతూ మండలంలోని మొత్తం 17,178 తెలుపు, నలుపు పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో 9,140 ఆవులు ఎద్లు, దూడలు, 7,768 గేదెలు, దున్నపోతులు, దూడలు ఉన్నాయని, ఈ పశువుల యజమానులు ఈ పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఐ 100 ఏండ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-మణుగూరు



సీపీఐ 100 సంవత్సరాల ఉత్సవాలను ఘనంగా వాడ వాడల నిర్వహించాలని దీనికి నియోజకవర్గ వ్యాప్తంగా మండల కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, కార్యదర్శులు పనిచేయాలని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా పిలుపు ఇచ్చారు. మంగళవారం వేణు రెస్టారెంట్ ఫంక్షన్ హాల్లో సరెడ్డి పుల్లారెడ్డి అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో ఉన్నటువంటి బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా తమ హక్కుల కోసం పోరాటం కొనసాగించే ఉద్యమకారులు, ప్రొఫెసర్లు, మేధావులపై కక్షపూరితంగా కేసులు బనాయిస్తూ జైళ్ళ పాలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య చారి మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకన్న, రేసు ఎల్లయ్య, మున్నా లక్ష్మీకుమారి, సింగరేణి కాలేజ్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, ఆర్.లక్ష్మీనారాయణ, జంగంమోహన్ రావు, డి.సుధాకర్, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

- కొత్తగూడెం సొసైటీ చైర్మెన్ మండె వీరహనుమంతరావు



నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి

ప్రతి రైతు తప్పనిసరిగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కొత్తగూడెం సొసైటీ చైర్మెన్ మండె వీరహనుమంతరావు కోరారు. మంగళవారం నాబార్డు వారి సహకారంతో ఆర్థిక అక్షర్యాత అనే కార్యక్రమంను కొత్తగూడెం సహకార సంఘం పరిధిలోగల లక్ష్మీదేవిపల్లి మండలంలోని మైలారం, హేమచంద్రపురం మొదలగు గ్రామ పంచాయతీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రైతులకు అవసరమగు అన్ని రకాల రుణాలను బ్యాంకులు అతి తక్కువ వడ్డీకే అందిన్నాయని తెలిపారు. బంగారం రుణాలను కూడా డిసిసి బ్యాంకుల ద్వారా ఇవ్వటం జరుగుతుందని, రైతులకు డిసిసి బ్యాంకులలో డబ్బులు డిపాజిట్ కూడా చేసుకొవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఖమ్మం బ్రాంచి కొత్తగూడెం మేనేజర్ ఇ.శాంతి రాగమయి, సొసైటీ ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్నాథరావు, సొసైటీ డైరెక్టర్ కర్నాటకపు రాంచందర్ రావు, ఎఫ్‌ఓ అశోక్, సంఘ సెక్రటరి పండ్ల సారయ్య, రైతులు కంటెం శేఖర్, మాజీ సర్పంచ్ బండ వెంకటేశ్వర రావు, కొండి శెట్టి నాని, గోపాల్ రెడ్డి, నాగేశ్వర రావు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారినిగా డా.కె.విజయ

నవతెలంగాణ-ఇల్లందు



మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారినిగా డా.కె.విజయ మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ డైరెక్టర్, వీఅండ్ ఏ హెచ్ (వెటర్నరీ అండ్ యానిమల్ హస్బండరీ)గా ఉన్నారు. ఈ సందర్భ ంగా ఎండీఓ ధన్సింగ్, ఎంపీడీవో చిరంజీవి, సిబ్బంది స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

151.85 హెక్టార్ల అటవీ భూమిలో ఉపరితల గని

- కేంద్రం ఉత్తర్వులు : జీవితకాలం 12 ఏండ్లు



నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని జేకే 5ఓసీ, 21 ఇంక్లైన్ కలుపుతూ ఏర్పడబోయే నూతన జేకే బొగ్గు గని ఏర్పాటు జరగనుంది. దీనికి సంభందించిన 151.85 హెక్టార్ల అటవీ భూమి వాడకానికి సూత్రప్రాయంగా అనుమతినిస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు శాక వారు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏరియా జీఎం జాన్ ఆనంద్ వివరాలు వెల్లడించారు. నూతన ఉపరితల గని ఏర్పాటు జరిగితే ఉద్యోగులు స్థానచలనం లేకుండా ఇల్లందు ఏరియాలోనే పనిచేసే అవకాశం లభిస్తుందని అన్నారు. ఈ నూతన గని కాలపరిమితి 12 సంవత్సరాలకు పైబడి ఉండబోతుందని, ఈ గని ద్వారా ఇల్లందు ఏరియాకు పూర్వ వైభవం రానున్నదని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

క్రీడా తెలంగాణగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- అందులో భాగమే సీఎం కప్ పోటీలు
- తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేన రెడ్డి
- జిల్లాకు చేరిన సీఎం కప్ క్రీడాజ్యోతి



నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యార్థులు, యువత దృష్టిని క్రీడల వైపు మళ్లించి క్రీడా తెలంగాణగా తీర్చిదిద్దటమే ఈ సీఎం కప్ ముఖ్య ఉద్దేశం అని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేన రెడ్డి అన్నారు. సీఎం కప్ క్రీడోత్సవాలకు సంబంధించిన క్రీడాజ్యోతి ర్యాలీ మంగళవారం జిల్లాకు చేరుకుంది. ఈ క్రీడాజ్యోతి ర్యాలీకి స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాస్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ర్యాలీ ప్రారంభించారు. ఇల్లందు క్రాస్ రోడ్డులోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ పార్కు (సెంట్రల్ పార్క్) వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం జండా ఊపి టార్చ్ రిలే ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో క్రీడాకారులకు కావలసిన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న ఇండోర్ స్టేడియం పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో స్పోర్ట్స్ అథారిటీకి సంబంధించి అనువైన స్థలాన్ని సూచిస్తే క్రీడాకారులకు అన్ని సౌకర్యాలతో క్రీడా మైదానం రూపొందించడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సీఎం కప్ ద్వారా ఎంతో మంది మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తారన్నారు. ఈ సీఎం కప్ అనంతరం సుమారు 500 మంది క్రీడాకారులు బయటకు వస్తారని, వారందరికీ అకాడమీలో శిక్షణ ఇచ్చి రాబోయే కాలంలో ఒలంపిక్స్ క్రీడలలో పథకాలు సాధించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిక అని తెలిపారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ అద్భుత అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు పరిపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటారన్నారు. జిల్లా నుండి ప్రపంచ స్థాయిలో రాణించే విధంగా క్రీడాకారులు తయారు కావాలని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని క్రీడల్లో మన రాష్ట్రానికి, మన జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ఏ మూల చూసిన మంచి అథ్లెటిక్స్ ఉన్నారన్నారు. ఒకవైపు ఇల్లందు, భద్రాచలం పవర్ లిఫ్టింగ్‌కు హబ్‌లు ఉన్నాయన్నారు. మన జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో కూడా మంచి రోడ్లు ఉన్నాయని జిల్లాలోని విద్యార్థులు, యువత సైక్లింగ్ పై కూడా దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా ఫుట్బాల్, వాలీబాల్, హాకీ తదితర క్రీడల్లో ఇంకా ఎక్కువ ప్రావీణ్యం సంపాదించాలన్నారు.

గ్రామీణ క్రీడలను వెలికి తీసేందుకే సీఎం కప్ : ఎమ్మెల్యే జారే

సీఎం రేవంత్ రెడ్డి గొప్ప ఆలోచనలతో రాష్ట్రాన్ని క్రీడా తెలంగాణగా మార్చేందుకు యువతను క్రీడ రంగం వైపు మళ్లించేందుకు, పాఠశాలలో వ్యాయామ విద్యను ఒక ప్రణాళిక బద్ధంగా తీసుకువెళ్తూ గ్రామీణ క్రీడలను వెలికి తీసే విధంగా ఈ సీఎం కప్‌ను రూపొందించడం జరిగిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంటేనే క్రీడాకారుల జిల్లా అని, దేశంలో అత్యధికంగా క్రీడాకారులు ఈ ప్రాంతం నుండి ఉన్నారని తెలిపారు. జిల్లాను క్రీడారంగంలో ముందుకు తీసుకువెళ్లే బాధ్యత ఒక క్రీడా ఉపాధ్యాయుడిగా తన మీద ఉందని తెలిపారు. ఈ ర్యాలీలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, వివిధ క్రీడా సంఘాల క్రీడాకారులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో మరో డయాలసిస్ కేంద్రం

- నేడు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రారంభించనున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రితో పాటు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో మరో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు సిద్ధమైంది. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న పది మిషన్లు అందుబాటులో ఉండగా పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో మరో ఐదు డయాలసిస్ మిషన్లు అందుబాటులోకి రానున్నాయి. రోగుల సంఖ్యకు అనుగుణంగా మిషన్లు అందుబాటులో లేకపోవడంతో రోగులు అత్యవసర డయాలసిస్ రోగులు ఇల్లందు, భద్రాచలం తోపాటు ఇతర ప్రాంతాలకు వెళుతూ దూరభారం, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించి పెద్దమొత్తంలో నష్టపోతున్నారు. రోగుల ఇబ్బందులకు గురి అవుతుండటంతో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పాల్వంచకు డియాలసిస్ కేంద్రాన్ని సాధించిపెట్టారు. రూ.40లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని బుధవారం కూనంనేని ప్రారంభించనున్నారు. నియోజకవర్గంలో రెండు డయాలసిస్ కేంద్రాలు అందుబాటులోకి రావడంతో రోగులకు మెరుగైన వైద్యం అందనుంది. ఈవిషయంలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దాతల సహకారంతోనే ఆలయాల అభివృద్ధి

- దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి
- డోనర్స్ డే సందర్భంగా దాతలకు సన్మానం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ప్రభుత్వాలతో పాటు దాతల సహకారంతో ఆలయ అభివృద్ధిలో కీలకంగా ఉంటుందని భద్రాచలం రామాలయ అభివృద్ధి కోసం దాతల సహకారం మరువలేనిదని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన ఆలయ ఈవో ఎల్.రమాదేవి అన్నారు. మంగళవారం డోనర్స్ డే సందర్భంగా ఆలయ అభివృద్ధికి ఆర్థికంగా సహకరిస్తున్న దాతలను శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దాతలను శాలువతో సన్మానించి సీతారాముల చిత్రపటాలను బహూకరించడంతోపాటు స్వామివారి ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ... దక్షిణ అయోధ్యలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రముగా విరుజిల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి దేశ నలుమూల నుండి భక్తుల సంఖ్య అంతకంతకు పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు ప్రభుత్వ దేవాదాయ శాఖ నుండి వస్తున్న నిధులతో పాటు దాతలు అందిస్తున్న విరాళాలతో భక్తులకు సౌకర్యాలను మెరుగుపరచగలుగుతున్నామని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఆలయ మర్యాదలతో వెంటనే సత్కరించడమే కాకుండా ఇటువంటి ప్రత్యేక రోజులలో కూడా వారిని గుర్తించి అభినందించటం జరుగుతుందని అన్నారు.

దాతలు ఇచ్చిన ప్రతి రూపాయికి జవాబు దారితనంగా దాత కోరిన విధంగా ఖర్చు చేసి వివరాలను సైతం దాతలకు తెలియపరుస్తున్నామని తెలిపారు. రామాలయ అభివృద్ధికి భవిష్యత్తులో మరింత మంది దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఈ.రవీంద్రనాథ్‌తో పాటు వైద్యక బృందం ఆలయ అధికారులు పాల్గొన్నారు. డోనర్స్ డే సందర్భంగా ఈవో తీసుకున్న నిర్ణయం పట్ల దాతలు సంతృప్తిని వ్యక్తం వ్యక్తపరుస్తూ భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని పలువురు దాతలు హామీ ఇచ్చారు.

మానసిక ఉల్లాసం పెంపొందించేందుకే క్రీడలు

- కంపెనీ స్థాయి క్రీడల ప్రారంభ కార్యక్రమంలో జీఎం



నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి లోనే కాకుండా ఉద్యోగుల పని ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని వారికి మానసిక ఉల్లాసం పెంపొందించేందుకే కంపెనీ స్థాయి క్రీడలు యాజమాన్యం నిర్వహిస్తోందని జీఎం జాన్ ఆనంద్ అన్నారు. వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వైసీఓఏ క్లబ్, 24 ఏరియా, సింగరేణి స్కూల్ గ్రౌండ్ నందు కంపెనీ స్థాయి బాస్కెట్ బాల్, లాన్ టెన్నిస్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఒలంపిక్ జెండాను ఎగరవేసి 6 రీజియన్ నుండి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ఇతర కంపెనీలలో లేని విధంగా సింగరేణి సంస్థ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని, కంపెనీ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ తమ క్రీడలలో సత్తా చాటి కంపెనీ పేరు ప్రతిష్టలు నిలపాలని కొనియాడారు.

సింగరేణి వ్యాప్తంగా 6 రీజియన్‌లు

కంపెనీ స్థాయి పోటీలలో సింగరేణి వ్యాప్తంగా మొత్తం (6) రీజియన్ లెవల్‌లో ఎంపిక అయిన క్రీడాకారులు పాల్గొనేందుకు వచ్చారు. ఈ క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులు కోల్ ఇండియా లెవెల్‌లో జరిగే లాన్ టెన్నిస్ పోటీలకు పంపుతామని తెలియజేశారు. కోల్ ఇండియా లెవెల్‌లో రాణించి సింగరేణి ప్రతిభ చాటాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు ఏజీ శివ ప్రసాద్, డీజీఎం పర్సనల్ జి.వి.మోహన్ రావు, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు జే.వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ అసిస్టెంట్ సూపర్వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన వారికి సభ్యత్వం ఇవ్వండి

నవతెలంగాణ-టేకులపల్లి



2023లో మండలంలోని రోళ్ళపాడు గ్రామానికి చెందిన 17 మంది మత్స్యశాఖ సభ్యులు అధికారుల సమక్షంలో శిక్షణ పొంది క్వాలిఫై అవడం జరిగిందని, తమకు సంఘంలో సభ్యత్వం ఇవ్వాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం బేతంపూడికి చెందిన చైర్మెన్ చీమల రామయ్య తమకు సభ్యత్వ నమోదు ఇవ్వడం లేదని కోడం బాలకృష్ణ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని లికితపూర్వకంగా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి, శాఖ ఏడీలకు సభ్యత్వం ఇవ్వాలని వినతి పత్రాలు అందజేసినా నేటికీ ఫలితం లేదన్నారు. గతంలో సంఘంలో 23 మంది సభ్యులు ఉన్నారని, నూతనంగా 17మంది శిక్షణ పొంది అర్హులుగా గుర్తించిన, 16 మందికి సభ్యత్వం నమోదు చేసి, తనకు మాత్రమే సభ్యత్వ నమోదు చేయకుండా అనర్హుడుగా చైర్మెన్ చేశారని వాపోయాడు. తమకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రజా సేవలకు అడ్డుపడుతున్నారు...!

వాటర్ ప్లాంట్ నిర్మాణం అడ్డుకోవడం అమానుషం

- అనుమతి ఇవ్వాలని వార్డు కౌన్సిలర్ దీక్ష



నవతెలంగాణ-కొత్తగూడెం

వార్డు ప్రజలకు చేసే సేవలకు కొంత మంది అడ్డుపడుతున్నారని, తాగు నీటికి ఇబ్బందులు పడుతున్న వార్డు ప్రజలకు వాటర్ ప్లాంట్ నిర్మాణంతో తాగు నీరు అందించాలనే ఆలోచనకు అడ్డుకోవడం అమానుషమని వార్డు కౌన్సిలర్ భీమా శ్రీవల్లి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 36వ వార్డులో నిర్మాణం చేస్తున్న వాటర్ ప్లాంట్‌నిర్మాణం సింగరేణి, మున్సిపల్ అధికారులు అడ్డుకున్న తీరును తీవ్రంగా తప్పుపట్టారు. వెంటనే అనుమతి ఇవ్వాలని వార్డు కౌన్సిలర్ దీక్ష చేపట్టారు. కొత్తగూడెం రైతు బజార్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ప్లాంట్ విషయంలో అధికారులు అతి ఉత్సాహం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 36వ వార్డు కూలీలైన్ రైతు బజార్ ఏరియా వద్ద సింగరేణి స్థలంలో జరుగుతున్న వాటర్ ప్లాంట్ నిర్మాణాన్ని సింగరేణి రక్షణ సిబ్బంది అడ్డుకోడాన్ని నిరసిస్తూ మంగళవారం వార్డు కౌన్సిలర్ బీమా శ్రీవల్లి, వార్డు ప్రజలు నిరసన దీక్ష చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కోసం వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపడితే సింగరేణి అధికారులు అడ్డుకుంటున్నారని ఇది తగదని పేర్కొన్నారు. వాటర్ ప్లాంట్ నిర్మాణ గత రెండు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభమైన నాటి నుండి కొంత మంది దీనిపై సింగరేణి అధికారులకు ఉద్దేశ్యపూర్వకంగా ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు.

విషయ అవగాహన లేకుండా సింగరేణి రక్షణ సిబ్బంది అడ్డుపడుతున్నారని తెలిపారు. కలెక్టర్‌గా పనిచేసిన అనుదీప్ వాటర్ ప్లాంట్ నిర్మాణ డీఎంఎఫ్ నిధులు కేటాయించారని, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు కొంత నిధులు అందజేశారని తెలిపారు. ప్రభుత్వ నిధులతో ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు పూనుకుంటే అడ్డుకుంటున్నారని వాపోయారు. వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులు కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలని, లేకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు వార్డు ప్రజలతో ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-బూర్గంపాడు

ఐద్వా రాష్ట్ర మహాసభలు ఈ నెల 21న కొత్తగూడెంలో నిర్వహించనున్నారని, జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. 21, 22, 23 జరుగుతున్న మహా సభలకు వేలాదిగా మహిళలు కదిలి రావాలని ఆయన అన్నారు. మండలంలోని సారపాకలో గల సుందరయ్య నగరంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలపై అనేక రూపాలలో దాడులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. వీరనారి ఐలమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో కేంద్రం, రాష్ట్రంతో పాటు 13 జిల్లాలలో కుటుంబ న్యాయ సలహా కేంద్రాలు ఏర్పడి బాధిత మహిళలకు అండగా నిలిచిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం మండల కార్యదర్శి పాపినేని సరోజన, వ్యకాస మండల అధ్యక్షులు ఎస్.కె అబిదా, కొవులూరి నాగమణి, పుష్ప, సాధిక, పద్మ, రాధ, నూర్జాన్ రమా దేవి, రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

20న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ

నవతెలంగాణ-జూలూరుపాడు



ఈ నెల 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని, జిల్లాలో ఉన్నటు వంటి సంఘటిత, అసంఘటిత రంగ కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాల్ రావు, కోశాధికారి పి.సతీష్ కార్మికులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో కొత్తగూడెం ఐఎఫ్టియు ఏరియా కమిటీ సమావేశం చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో రాజశేఖర్, రాయల సిద్ధు, ధనవంతురావు, శరత్, మధు, వెంకన్న, శంకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పంతులమ్మగా గృహిణి

- డీఎస్సీలో ప్రతిభ చాటిన నాగమణి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఓ గృహిణి పంతులమ్మగా మారింది. సాధన చేస్తే సాధించలేనిది ఏమీ లేదని రుజువు చేసింది. డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో ఏకంగా జిల్లా 17వ ర్యాంకునే కైవసం చేసుకుంది. అద్వితీయమైన ప్రతిభతో భద్రాచలంకు చెందిన ఈ మహిళ రికార్డ్ స్థాయిలో మార్కులు పొందింది. ఇంకేముంది ఓ ఇంటి గృహిణి పంతులమ్మగా రంగ ప్రవేశం చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదాన సమీపంలో నివాసం ఉంటున్న జెట్టి నాగమణి ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీ ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష ఫలితాల్లో తనదైన శైలిలో రాణించి టీచర్ ఉద్యోగానికి ఎంపికైంది. డీఎస్సీ 2024 డిస్టిక్ 17వ ర్యాంకును కైవసం చేసుకోవడం గమనార్హం. మంగళవారం నిర్వహించిన కౌన్సిలింగ్‌లో దుమ్ముగూడెం మండలం శ్రీనగర్ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్జీటీ టీచర్‌గా పోస్టింగ్ వచ్చింది. చర్ల మండలం గుంపెనగుడం గ్రామానికి చెందిన నాగమణికి చిన్నప్పుడే వివాహం కావడంతో భద్రాచలంలో స్థిర నివాసం ఉంది. తన కుమారుడు సీ డాట్‌లో సైంటిస్టుగా పనిచేస్తుండగా, కుమార్తె ఉన్నత ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతోంది. తన భర్త సహాయంతో వివాహం జరిగిన తర్వాత కూడా విద్యను కంటిన్యూ చేశానని ఈ సందర్భంగా నాగమణి పేర్కొంది. 2012, 2017 డీఎస్సిలో కొద్ది మార్కుల తేడాతో ఉద్యోగాన్ని కోల్పోయానని ఈసారి ప్రణాళిక బద్ధంగా చదివి సాధించానని ఆనందోత్సవాల మధ్య వెల్లడించింది. గృహిణి పంతులమ్మగా మారటంపై నాగమణిని పలువురు ప్రశంసిస్తున్నారు.

వృద్ధులకు రగ్గుల వితరణ

నవతెలంగాణ-ములకలపల్లి



మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో వృద్ధులకు దాతలు అందించిన సాయంతో దాతల స్నేహితుడు లీలా సంతోష్ కుమార్ మంగళవారం రగ్గులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన వృద్ధులకు చలి నుంచి రక్షణ కోసం వందకు పైగా రగ్గులను తన స్నేహితులు, దాతలు దీప, విజర్‌ఆనంద్, అప్రజిత్, ఓంప్రకాష్ సహకారంతో వీటిని వారితో పాటు గిరిజన గూడేల్లో వారికి అందించడం జరిగిందన్నారు. గిరిజన వృద్ధులకు వీటిని అందించినందుకు పాఠశాల హెచ్ఎం శంకర్ దాతలతో పాటు లీలాసంతోష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు జలగం చంద్రశేఖర్, మధుసూదన్, గోపి, జోగయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, ఆయా గ్రామాల వృద్ధులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | అక్టోబర్ 16, 2024 | www.navatelangana.com



సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్

- స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేన రెడ్డి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శనార్థం మంగళవారం భద్రాచలం వచ్చారు. శివసేన రెడ్డికి బ్రిడ్జి సెంటర్ నందు భద్రాచల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి వెళ్లి శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి, రామాలయ వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యదర్శి దొడ్డిపట్ల కోటేష్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బలుసు నాగ సతీష్, మాజీ గ్రంథాలయ చైర్మెన్ భోగాల శ్రీనివాసరెడ్డి, భద్రాచలం హోటల్ అసోసియేషన్ అధ్యక్షులు బత్తుల కృష్ణారెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సుధీర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షురాలు రాజేశ్వరి, రాణి, దేవకి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్

నవతెలంగాణ-కొత్తగూడెం

కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని, ఎన్నికల హామీల అమలుకు కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం సింగరేణి ఏరియా పరిధిలోని సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ యందు కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ అధ్యక్షతన ఫిట్ సెక్రటరీ రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మెన్, జనక్ ప్రసాద్ మాట్లాడారు. సింగరేణిలో కార్మిక సంఘం ఎన్నికల సందర్భంగా ఐఎన్‌టియుసి హామీలను రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో తప్పకుండా నెరవేరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, జనరల్ సెక్రెటరీ త్యాగరాజన్, రీజినల సెక్రెటరీ ఆల్బర్ట్, క్యాంపెయిన్ ఇన్‌చార్జి వికాస్ కుమార్, కాలం నాగభూషణం, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతంబరం, రావి నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఓబీ కార్మికుల సమస్యలపై సీఐకు వినతి : జేఏసీ

నవతెలంగాణ-టేకులపల్లి



కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో ఓబీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఎల్ఎస్ఎన్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని టేకులపల్లి రాజకీయ కార్మిక ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సీఐ తాటిపాముల సురేష్‌కు వినతిపత్రం మంగళవారం అందజేసినట్లు తెలిపారు. కార్మికుల సమస్యలపై సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పించడంలో భాగంగా సిఐకు వినతి పత్రం అందజేమన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎల్ఎస్ఎన్ యాజమాన్యం కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటుందన్నారు. వారికి రావలసిన వేతనం సకాలంలో ఇవ్వకుండా మానసిక వేదనకు గురి చేస్తున్నారన్నారు. ఎల్ఎస్ఎన్ కంపెనీని సింగరేణి యాజమాన్యం బ్లాక్ లిస్టులో పెట్టి కార్మికుల బాధల నుండి విముక్తి చేయాలని, సింగరేణి యాజమాన్యంకు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు లక్కినేని సురేందర్ రావు, డి.ప్రసాద్, ధర్మపురి వీర బ్రహ్మాచారి, సుందర్, కల్తి వెంకటేశ్వర్లు, దళ్ సింగ్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తే అరెస్టులా..

- న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మధు

నవతెలంగాణ-ఇల్లందు



వికారాబాద్ జిల్లాలోని దామగుండం రాడార్ స్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా ముందస్తుగా ప్రజాసంఘాల నాయకులను అక్రమంగా అరెస్టులు చేసి స్టేషన్లో నిర్బంధించడాన్ని సీపీ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు తీవ్రంగా ఖండించారు. రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తే అరెస్టులు, ప్రజాస్వామ్యం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దామగుండం రాడార్ స్టేషన్ మూలంగా 12లక్షల చెట్లుగల అడవి అంతరించిపోయి పర్యావరణం దెబ్బ తింటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు ప్రకాష్, వై.జానకి, సారంగపాణి, నరసింహారావు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా పర్స వెంకట్

నవతెలంగాణ-అన్నాపురెడ్డిపల్లి

మండలం నుండి జిల్లా స్థాయిలో కబడ్డీ అసోసియేషన్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా పర్స వెంకట్ ఎన్నిక కావడంతో ఆయనకు కాంగ్రెస్ నాయకులు సన్మానం చేశారు. మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ జిల్లా స్థాయిలో వైస్ ప్రెసిడెంట్‌గా రావడం చాల సంతోషం అని కార్యకర్తలు ఆయనకు స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పర్స వెంకట్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో వైస్ ప్రెసిడెంట్ రావడం ఒక బాధ్యతగా తీసుకొని జిల్లా స్థాయిలో అందరికీ అందుబాటులో వుంటాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ, పద్మ, జమలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి ప్రాంగణంలో అబ్దుల్ కలాం జయంతి

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



స్థానిక లక్ష్మీదేవి పల్లిలో గల త్రివేణి పాఠశాలల ప్రాంగణంలో భారత మిసేల్ మాన్, భారత దేశం 11వ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతి సందర్భంగా చిత్ర పటంకి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అబ్దుల్ కలాం జీవితంని విద్యార్థినీ, విద్యార్థులు విద్యార్థి దశ నుంచి ఆదర్శంగా ఉండి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని పాఠశాలల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఓ కాట్రగడ్డ మురళి, కృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్స్, సౌజన్య, ఫాతిమా పాల్గొన్నారు.

నాసిరకంగా సెంట్రల్ లైటింగ్ పనులు

- ఒక వైపు నిర్మిస్తుంటే మరో వైపు శిథిలం అవుతున్న వైనం
- అధికారుల లేమి...పర్యవేక్షణ శూన్యం
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం


శిథిలం అయిన డ్రైనేజీ తిరిగి నిర్మిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-అశ్వారావుపేట

నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట పట్టణ సుందరీకరణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయనేది ఆ పనులను చూస్తే ఇట్టే తెలిసిపోతుంది. అశ్వారావుపేట-సత్తుపల్లి రోడ్‌లో ప్రస్తుతం డ్రయినేజీ పనులు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం పడిన వర్షానికి ఏకే గ్రాండ్ సమీపంలోని వంతెన సమీపంలో 3 మీటర్లు మేర కొత్తగా నిర్మించిన డ్రయినేజీ శిథిలం అయింది. దీంతో మంగళవారం తిరిగి నిర్మిస్తున్నారు. ఈ సంఘటనతో నాసిరకం పనులని తేలిపోయింది. ఈ సెంట్రల్ లైటింగ్ పనులకు 2023 జూన్‌లో 3వ తేదీన నాటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు లాంచనంగా శంకుస్థాపన చేసారు. ఖమ్మం-అశ్వారావుపేట 325 బీబీ జాతీయ రహదారిలో 119/0 (పేరాయిగూడెం) నుండి 121/0 జంగారెడ్డిగూడెం రోడ్లో కాకతీయ గేట్ వరకు 2 కి.మీ మేర రూ.9 కోట్లు, అశ్వారావుపేట-భూర్గంపాడు రోడ్లో 0/0 (పోలీస్ స్టేషన్) నుండి 1/5 అరకిలోమీటరు వరకు రూ.1 కోటి 35 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ, డ్రయినేజీ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. ప్రారంభించే రెండో ఏడాది కావచ్చిన ఈ పనులు ఒక కొలిక్కి రాలేదు. ఈ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఒకరు అయితే నేడు పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ మరొకరు. కాంగ్రెస్‌లో స్థానికంగా పరపతి ఉన్న ఓ నాయకుడు కనుసన్నల్లో ఈ పనులు జరుగుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ నాయకుడి అనుచరులు కొందరు ఈ పనులు పర్యవేక్షణ చేస్తున్నారని వాదన వినిపిస్తుంది. ఇసుక సైతం స్థానిక వాగుల నుండి సేకరించిందిగా రుజువులు ఉన్నాయి. ఎలా అంటే ఏ ఇసుక వాహనాన్ని అధికారులు అడ్డుకున్నా ఫలానా నాయకుడు, ఫలానా పనికి తరలిస్తున్నట్లు జవాబు రావడం దీనికి రుజువులు. ఇక పోతే శాఖా పరంగా ఆర్ అండ్ బీలో సిబ్బంది కొరత వేధిస్తుంది. గత బదిలీల్లో ఇక్కడ డీఈఈని బదిలీ చేసి తిరిగి ఇక్కడికే పోస్టింగ్ ఇచ్చారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఒకరు పదవీ విరమణ పొందారు. దీంతో ఈ పనులను కాంట్రాక్టర్, గుమాస్తాలు, స్థానిక నాయకుడి అనుచరులు పర్యవేక్షించడం పరిపాటిగా మారింది అని పట్టణ వాసులు గుసగుసలాడుతున్నారు.

ఈ విషయం అయి డీఈఈ శ్రీనివాస్‌కు ఫోన్ చేస్తే స్పందించలేదు. కొత్తగా విధుల్లో చేరిన ఏఈఈ రాకేష్ చౌదరిని వివరణ కోరగా నేను ఇంకా ఏ పనులు పర్యవేక్షించడం లేదని తెలిపారు.


నాసిరకం ఇసుక



వాయిదా పడి...ప్రారంభమైన కౌన్సిలింగ్

నవతెలంగాణ-కొత్తగూడెం

డీఎస్సీలో నియామకాలు సాధించిన ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు సమాచారం అందించారు. కౌన్సిలింగ్ ప్రదేశాన్ని వెల్లడించారు. అభ్యర్థులు కౌన్సిలింగ్ సెంటర్‌కు చేరుకున్నారు. కొద్ది సేపట్లో ప్రారంభిస్తారు అనుకున్న తరుణంలోనే బాంబు లాంటి వార్త వెలువడింది. రాష్ట్ర వ్యాప్తంగా కౌన్సిలింగ్ వాయిదా పడిందని అధికారులు అభ్యర్థులకు సమాచారం చేరవేశారు. తీవ్ర నిరాశ, నిరుత్సాహానికి గురైన ఉపాధ్యాయులు చేసేది ఏమిలేక ఇంటి మార్గం పట్టారు. నూతన ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు, మరల తిరిగి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సిలింగ్ ప్రారంభించనున్నామని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు అభ్యర్థులకు సమాచారం జారీ చేశారు. ఉదయం కౌన్సిలింగ్ వాయిదా పడిందని కొంత మంది ఉపాధ్యాయులు వెను తిరిగి వెళ్లిపోయారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుండి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశాలు రావడంతో జిల్లా విద్యాశాఖ సిబ్బంది డీఎస్సీ 2024 నూతన ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి కొత్తగూడెంలోని పాత కొత్తగూడెం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కి తిరిగి రావాలని సమాచారం అందించారు. దీంతో మధ్యాహ్నం 2 గంటల నుండి కౌన్సిలింగ్ నిర్వాహించారు. వారికి పోస్టింగ్‌లు కేటాయించారు. చివరి వరకు నూతన ఉపాధ్యాయులకు అసలేం జరుగుతుందో అర్థం కాక గందరగోళంలో ఉన్నామని, ఈ సంఘటన జీవితాంతం గుర్తుంటుందని చెప్పకొచ్చారు.

ఎలాంటి సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకురండి

- మానసిక ఒత్తిడికి గురికావద్దు..!
- ఎస్పీ రోహిత్ రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం



పోలీసులకు ఎలాంటి సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకురావాలని, మానసిక ఒత్తిడికి గురికావద్దని ఎస్పీ రోహిత్ రాజు జిల్లా పోలీస్‌లకు సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇకపై ప్రతి గురువారం పోలీసు అధికారులు, సిబ్బంది తమ సమస్యల పరిష్కారానికై నేరుగా తనను సంప్రదించవచ్చునన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది చిన్న చిన్న కారణాలు, సమస్యలతో మానసిక ఒత్తిడికి గురికావద్దని కోరారు. ఇటీవల జిల్లాలో జరిగిన సంఘటనలు తనను ఎంతో బాధ పెట్టాయని, క్షణికావేశానికి గురై తమ కుటుంబాల గురించి కూడా ఆలోచించకుండా పోలీసులు ప్రాణాలు తీసుకోవడం చాలా బాధాకరమని అన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. తమకు కేటాయించిన విధులను నిజాయితీతో సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, బందో బస్తులు, వరదల సమయంలో విధులు, మావోయిస్టుల కార్యకలాపాలను అరికట్టడం, గంజాయి అక్రమ రవాణాను నివారించడం లాంటి విధులను సమర్థవంతంగా నిర్వహించడంలో జిల్లా పోలీసులకు మంచి పేరు ఉందని గుర్తుచేశారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ, మంచి నడవడికతో ప్రజలకు సేవలు అందిస్తూ బాధ్యతగల పోలీస్ అధికారిగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. అనంతరం కాన్ఫరెన్స్ ద్వారా కొంతమంది తమ సమస్యలను జిల్లా ఎస్పీకి తెలిపారు. వాటి పరిష్కారానికి సత్వరమే కృషి చేస్తామని ఎస్పీ సిబ్బందికి భరోసా కల్పించారు.

మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలి

- శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు
- దిశా ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ప్రతి మహిళ ఆత్మగౌరవంతో జీవించాలని, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం తీసుకొస్తున్న పథకాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కోరారు. భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీలో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మంది పేద మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జాతీయ చైర్మెన్ బివి రాజు, జాతీయ ఉపాధ్యక్షురాలు కళ్యాణిల ఆదేశానుసారం అనేక బహుమక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పట్టణంలో ఒంటరి మహిళలు వెనుకబడిన మహిళలకు కావలసిన ఇందిరమ్మ ఇండ్లు, మహిళలు పెన్షన్లు దిశా కమిటీ సభ్యులు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే మంజూరు చేపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అనంతరం జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మి మాట్లాడుతూ... దిశా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అనేక బహుమక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ప్రతి సంవత్సరం దసరాకి బతుకమ్మ ఉత్సవ నిర్వహించి పేద మహిళలకు చీరెలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో దిశా ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమం నిర్వహించేందుకు జాతీయ చైర్మెన్ బివి రాజు, ఉపాధ్యక్షురాలు కళ్యాణిల నేతృత్వంలో సిద్ధమవుతున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మండల అధ్యక్షురాలు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపం

- అధికార ప్రతినిధి జగన్ పేరిట లేఖ విడుదల

నవతెలంగాణ-చర్ల



పౌర హక్కుల నేత, ప్రజాస్వామిక వాది, రచయిత, మేధావి ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా శనివారం రాత్రి నిమ్స్ హాస్పిటల్‌లో మృతి చెందడంతో మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. ఈ మేరకు పాత్రికేయులకు ఓ లేఖ పంపారు. ఆ లేఖలో ముఖ్యంగా సాయిబాబా నెలకొల్పిన ఆశయాలను, ఆదర్శాలను, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధు మిత్రులు తన వారసులుగా కొనసాగించాలని మావోయిస్టు పార్టీ కోరుతున్నది. పౌర హక్కులను పరి రక్షించడానికి ప్రజల తరుపున గొంతెత్తిన సాయిబాబాను బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు రాజ్యమే పథకం ప్రకారం హత్య చేసింది. ఢిల్లీ ప్రొఫెసర్‌గా కొనసాగుతూ మలి దశ తెలంగాణ ఉద్యమానికి మార్గ నిర్దేశం చేశాడు. 1997 డిసెంబర్‌లో ఏఐపీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రజాస్వామిక తెలంగాణ కోసం రెండు రోజుల సదస్సు జరిగింది. ఈ సభలోనే వరంగల్ డిక్లరేషన్ జరిగింది. ఆ సదస్సుకు జీఎన్ సాయిబాబా నాయకత్వం వహించాడు. ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరం (ఏఐపీఆర్ఎఫ్)లో కొనసాగుతూ ప్రజల ప్రాథమిక హక్కుల పరి రక్షణకై పోరాడాడు. ఫోరం ఎగనెస్ట్ వార్ ఇన్ పీపుల్స్ వేదికలో క్రియాశీలంగా పని చేస్తూ, సామ్రాజ్యవాదుల, కార్పొరేట్ల సంస్థల ప్రయోజనాల కోసం దేశ సంపదను, ప్రకృతిక వనరులను కొల్లగొట్టడానికి దేశ ప్రజలపై, ప్రధానంగా ఆదివాసీ ప్రజలపై సల్వాజుడుం, గ్రీన్ హంట్ పేర్లతో సాగుతున్న పాశవిక దాడులను నిర్దాక్షిణంగా ఖండించాడు. దేశంలో పాశవికంగా కొనసాగుతున్న రాజ్య హింసను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేశాడు. ప్రజాస్వామిక బద్దంగా ప్రశ్నించడం, ప్రశ్నించే శక్తులను తయారు చేయడం నేరంగా భావించిన రాజ్యం కుట్ర పూరితంగా, మానవ హక్కులను ఉల్లంగిస్తూ పెగాసస్ వంటి మాల్వేర్స్ సాఫ్ట్ వేర్ల ద్వారా జీఎన్ సాయిబాబా కంప్యూటర్‌లో చొరబడి అందులో మావోయిస్టు సాహిత్యాన్ని చొప్పించి మావోయిస్టులతో సంబంధాలు కలిగి వున్నాడని నిందారోపణ చేసి రాజ్యాంగ విరుద్ధ చట్టాలను అక్రమంగా మోపారు. నిర్దోషిని, 90 శాతం అంగవైకల్యంతో కదలేని స్థితిలో వీల్ చైర్‌లో ఒకరి మద్దతు లేకుండా తన పని తాను చేసుకోలేని స్థితిలో వున్న జీఎన్ సాయిబాబాను అన్యాయంగా పది సంవత్సారాలు ఒంటరి అండా సెల్‌లో నిర్బంధించారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న జైల్‌లో ఎలాంటి వైద్య సౌకర్యాలు అందకుండా చేశారు. చివరి దశలో నిర్దోషిగా నిరూపించబడి విడుదల చేయాలని మహారాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చినప్పటికీ ఆ తీర్పును సవాల్ చేస్తూ హిందుత్వ శక్తులు ఎన్ఐఏ తన విడుదలను అడ్డుకుంది. జైలులో దుర్భర పరిస్థితులను కల్పించి తన ఆరోగ్యాన్ని క్షిణించేలా చేశారు. మరణానికి బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, న్యాయ వ్యవస్థలే పూర్తి బాధ్యత వహించాలి. అత్యంత ధైర్యశాలి మొక్కవోని ధైర్యంతో రాజ్యాన్ని ప్రశ్నించిని ప్రజాస్వామిక వాదికి, బుద్ధి జీవికి, అంగవైకల్యాన్ని లెక్క చేయని నిస్వార్థ నిలబడిన ప్రజల పక్షపాతికి మరొక్కసారి రాష్ట్ర కమిటీ తలవంచి వినమ్రంగా జోహార్లు అర్పిస్తున్నదని జగన్ ఆ లేఖలో తెలిపారు.

జేఏసీ సంఘాల పోరాట ఫలితమే కార్మికులకు 5వేలు బోనస్

నవతెలంగాణ-టేకులపల్లి

జేఏసీ సంఘాల పోరాట ఫలితమే కార్మికులకు రూ.5వేలు బోనస్ వచ్చిందని జేఏసీ నాయకులు లక్కినేని సురేందర్ రావు, భూక్య దల్ సింగ్, డి.ప్రసాద్, కల్తీ వెంకటేశ్వర్లు, ధర్మపురి వీర బ్రహ్మాచారి, భూక్య హర్షా తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం ప్రకటించిన ఇన్సెంటివ్ రూ.5 వేలను తక్షణమే కార్మికుల ఖాతాలో జమ చేయాలన్నారు. భవిష్యత్తులో ఓబీ కార్మికుల సమస్యలపై జేఏసీ ఆధ్వర్యంలో జరిగే ఆందోళన కార్యక్రమాలలో ఓబీ కార్మికులు ఐక్యంగా ఉద్యమించి, సమస్యలు పరిష్కరించుకోవాలని జేఏసీ నాయకులు కోరారు.

యాదవుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా..

- గొర్రెల సహకార సొసైటీ అధ్యక్షులుగా కంపసాటి శివ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిధిలోని చిన్న మునగాల గ్రామంలో శ్రీ వెంకటేశ్వర గొర్రెల సహకార సొసైటీ ఎన్నికలు జిల్లా గొర్రెల సహకారం సంఘం ఎన్నికల అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం జరిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులుగా కంపసాటి శివ ప్రధాన కార్యదర్శిగా పరిటాల భద్రయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు డైరెక్టర్స్‌గా గమిడి నరేష్, పురం శేసయ్య, మర్రి గోపయ్య, పగడాల లక్ష్మి, మర్రి వెంకటమ్మలను ఎన్నుకున్నారు. అనంతరం కంపసాటి శివ మాట్లాడుతూ యాదవులకు గత పాలకులు ఇచ్చిన హామీల అమలు కోసం, తమ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా చైతన్యాభివృద్ధి చెందేలా, ఇతరత్ర ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. నాపై నమ్మకంతో ఎన్నుకున్న యాదవులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

స్టామ్ వాటర్ డ్రైన్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నియోజకవర్గంలోని 46వ డివిజన్ సారధి నగర్‌లో స్ట్రామ్ వాటర్ డ్రైన్ పునాది నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

- పరిశీలించిన ఏసీపీ

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు నుండి రాళ్ల బంజర వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి పక్కన గల పుల్లప్పకుంట చెరువులో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. మంగళవారం చెరువులో మత్స్యకారులు చేపలకు మేత వేస్తుండగా శవం కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ ఎస్.కె షాకీర్ సిబ్బంది వెళ్లి శవం ఉన్న గోనసంచిని బయటకు తీసి చూడగా కుళ్ళిపోయి గుర్తు పెట్టలేని స్థితిలో ఉన్నది. దీంతో ఎస్ఐ ఎస్కె షాకీర్, కల్లూరు ఏసీపీకి అనిశెట్టి రఘుకి, పెనుబల్లి రూరల్ సీఐ ముత్తు లింగయ్యకి తహసీల్దార్‌కి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలాన్ని చేరుకుని శవాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసిపి అనిశెట్టి రఘు మాట్లాడుతూ మృతదేహం వారం పది రోజుల క్రితమే చెరువులో పడే ఉంటుందని భావిస్తున్నామన్నారు. హత్యా, ఆత్మహత్య అనే కోణంతో పాటు నియోజకవర్గ పోలీస్ స్టేషన్లో మహిళ మిస్సింగ్ కేసు ఉంటే వాటి ఆధారం కూడా దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ పులి సాంబశివుడు సమక్షంలో పంచనా నిర్వహించి, శవపరీక్షకు పెనుబల్లి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

జూనియర్ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

నవతెలంగాణ-ముదిగొండ

ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ కొనియాడారు. కలలు కనండి అబ్దుల్ కలాం స్ఫూర్తిని అనుకరించండని ఆయన విద్యార్థులకు ఉద్బోధించారు. అబ్దుల్ కలాం పేపర్ బాయ్ నుండి భారతదేశ ప్రెసిడెంట్ వరకు ఎదిగాడని ఆయన ఆదర్శాన్ని విద్యార్థిని, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన చెప్పారు. అనంతరం అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్ఎం శాంతికుమారి, అధ్యాపకులు గురవయ్య, శ్రీను, ఆమోస్, సతీష్ రెడ్డి, రమణ, శంకర్, దుర్గా, శ్రీవాణి, లావణ్య, సునీత, సీనియర్ అసిస్టెంట్ రవీందర్ రెడ్డి, రికార్డ్ అసిస్టెంట్ సాయి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని మల్లవరం రైతు వేదికలో మంగళవారం సత్తుపల్లి ఆర్డబ్ల్యూఎస్ డీఈ జయలక్ష్మి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. డీఈ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో విద్యుత్ మోటర్లు, విద్యుత్ బోర్డులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 18 వరకు నిర్వహిస్తామన్నారు. మంచినీటి గ్రామ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ మండల ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు, మంచినీటి సహాయకులు, మిషన్ భగీరథ హెల్పర్స్, తదితరులు పాల్గొన్నారు.

కోణార్క్ ట్రైన్‌లో 10 కిలోల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-మధిర

కోణార్క్ ట్రైన్‌లో మధిర ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా ఈ తనిఖీలలో 10 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. ఈ పట్టుబడిన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

విద్యుత్ ఏఈ నాగేశ్వరరావు బదిలీ

నవతెలంగాణ-మధిర

విద్యుత్ శాఖ మధిరరూరల్ సెక్షన్ ఏఈ కె.నాగేశ్వరరావు ఖమ్మం అర్బన్ సెక్షన్‌కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది వీడ్కోలు పలికారు. వీడ్కోలు సభలో వైరా డివిజన్ డిఈ హీరాలాల్, సబ్ డివిజన్ ఏడిఈ అనురాధలు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడి.. గొర్రెలు మృతి

నవతెలంగాణ- ముదిగొండ

మండలపరిధిలో న్యూలక్ష్మీపురం గ్రామంలో వీధి కుక్కల దాడిలో గుండెల వెంకటేశ్వర్లు యాదవ్‌కు చెందిన మూడు గొర్రెలు, రెండు మేకలు మృత్యువాతపడ్డాయి. సుమారు 80 వేలు విలువ చేసే ఐదు మేకలు, గొర్రెలు మృతి చెందడంతో కాపరి వెంకటేశ్వర్లు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని వనంవారికిష్టాపురం, ముదిగొండ పశువైద్యశాలలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువులకు వేశారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు మండలంలోని పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు పి అశోక్, మన్యం రమేష్ బాబు తెలిపారు. వచ్చే నెల15వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

కామేపల్లి : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేయడం జరుగుతుందని మండల పశువైద్యాధికారులు జి.నాగులు, గోపిక్రిష్ణ తెలిపారు. ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఈనెల 15నుండి వచ్చేనెల 14 వరకు పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వేస్తామన్నారు. మొదటిరోజు కామేపల్లిలో ప్రారంభించామన్నారు.

కారేపల్లిలో సీసీఐ కొనుగోలు కేంద్రం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి కారేపల్లిలోని శ్రీలక్ష్మి ప్రియ కొటక్ జిన్నింగ్ మిల్లును ఇల్లందు మార్కెటింగ్ అధికారులు పరిశీలించి కేంద్రం ఏర్పాటు సన్నవహాలు చేశారు. ఈ సీసీఐ కేంద్రం ద్వారా పత్తి మద్దతు పింజ పొడగు రకం ధర రూ.7521-00, సాధారణ రకం పింజ రకం రూ.7121-00కి కొనుగోలు చేయనున్నట్లు మార్కెటింగ్ అధికారులు తెలిపారు. కేంద్రాన్ని త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

సెల్యూట్ అబ్దుల్ కలాం

నవతెలంగాణ- ఖమ్మం



భారత క్షిపణి పితామహుడు మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా త్రివేణి పాఠశాలలో పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా, శ్రీదేవి, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్‌లతో కలిసి కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీజే అబ్దుల్ కలాం భారతదేశం రక్షణ వ్యవస్థకు చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు.

ఘోర రోడ్డు ప్రమాదాలు

వేరువేరు చోట్ల నలుగురు స్పాట్ డెడ్


చర్ల

- ఒకరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ఇద్దరు విద్యార్థులు
- చర్ల, పాల్వంచలో ఘటనలు

నవతెలంగాణ-చర్ల

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, చర్ల మండలాల పరిధిలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు.

చర్ల మండల పరిధిలోని సుబ్బంపేట పంచాయతీ పరిధిలో బిఎస్ రామయ్య నగర్ సమీపాన రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న అంబారి మురళీకృష్ణ(16), చింతలపూడి రేవంత్ రాజు, యాకూబ్ అనే మైనర్ బాలురు ముగ్గురు ఒకే ద్విచక్రంపై ఎదురుగుట్టల నుండి చర్ల వైపు వస్తున్న క్రమంలో చర్ల వైపు నుండి వెంకటాపురం వైపునకు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ (టీఎస్ జీరో 7 యు ఎస్ 2269 నెంబర్)ని

ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో మురళీకృష్ణ లారీ చక్రం


చర్లలో గాయపడ్డ విద్యార్థి

కింద పడడంతో జీర్ణ వ్యవస్థ బయటికి వచ్చి ఘోరంగా మృతి చెందాడు. రేవంత్ రాజు కూడా అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరిని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పోస్టుమార్టం కోసం తీసుకెళ్లారు. చర్ల సీఐ రాజు వర్మ తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేయించి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను బైక్ ఢీకొని ఇరువురి దుర్మరణం

పాల్వంచ రూరల్ : బూర్గంపాడు మండలం బుడ్డ గూడెంనకు చెందిన సోడే నరేష్(32), సోడే సారయ్య(26)లు పల్సర్ ద్విచక్ర వాహనంపై మంగళవారం మధ్యాహ్నం జింకల గూడెం ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు ఇంటి నుండి బయలుదేరారు. అక్కడినుండి పాల్వంచకు వచ్చి, తిరుగు ప్రయాణంలో సోములగూడెం పంచాయతీ పరిధి బీసీఎం ప్రధాన రహదారి డివైడర్‌ను వీరు ప్రయాణించే పల్సర్ వాహనం (టీఎస్28 ఎం 5390) అదుపుతప్పి ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. నరేష్ అక్కడికక్కడే మృతి చెందగా..కొన ఊపిరితో ఉన్న సారయ్యను పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలకు తరలించే లోగా మృతి చెందాడు. కాగా నరేష్‌కు భార్య ఉమాదేవి, మగ, ఆడ ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుమారుడు జయదేవ్ దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆరవ తరగతి విద్యనభ్యసిస్తుండగా.. కుమార్తె శ్రీజ స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. సారయ్యకు భార్య వెంకటలక్ష్మి ఉండగా.. పిల్లలు లేరు. వృత్తిరీత్యా మృతులిద్దరూ ఓ కాంట్రాక్టర్ వద్ద జెసిబి డ్రైవర్లుగా పనిచేసే కుటుంబాన్ని పోషించుకున్నట్లు తెలుస్తోంది. సంఘటన ప్రాంతాన్ని గ్రామీణ ఎస్సై సురేష్ సందర్శించారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం వైద్యశాల మార్చురీలో భద్రపరిచారు. మృతులిద్దరిది ఒకే ఊరు, దగ్గర బంధువులు కావడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యుల రోదనలతో వైద్యశాల ప్రాంగణం దద్దరిల్లింది.


పాల్వంచ రూరల్



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన పొంగులేటి

నవతెలంగాణ-బూర్గంపాడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని తాళ్లగొమ్మూరులో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, ఐటీసీ సీఎస్ఆర్ నిధులు రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రారంభించారు. మండల పర్యటనకు వచ్చిన మంత్రికి పార్టీ నాయకులు మోరంపల్లి బంజార, సారపాక ప్రాంతాలలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం, ఇల్లందు, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారయణ, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ తూళ్లూరి బ్రహ్మయ్య, బూర్గంపాడు ఎంపీడీవో జమలా రెడ్డి, ఐటీసీ ఉన్నతాధికారులు శ్యామ్ కిరణ్, చెంగళరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ విజయ్ గాంధీ, పార్టీ నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వర్రెడ్డి, భజన సతీష్, భజన ప్రసాద్ కుమార్, లక్ష్మీనారాయణరెడ్డి, కణితి కృష్ణ, వాసు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు

అవగాహనా కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు

నవతెలంగాణ-ఇల్లందు

ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు బ్లాక్ మార్కెట్ చేసినా, నకిలీ విత్తనాలు అమ్మినా కఠిన చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకులు జి.లాల్ చంద్ హెచ్చరించారు. సుదిమల్లలోని రైతు వేదికలో మంగళవారం వ్యాపార విషయంలో అమలవుతున్న చట్టాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. యాసంగి 2024-25 విత్తనములు, ఎరువులు, లభ్యత, క్రిమిసంహారక మందులు, వ్యాపార విషయంలో అమలవుతున్న చట్టాల తీరు తెన్నులు వివరించారు. అప్ వెబుల్డ్ పెస్టిసైడ్స్ సిఫారసు చేసిన కరపత్రాలలో పేర్కొన్న నిబంధనలు పాటించడంపై తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.సతీష్, వ్యవసాయ విస్తరణ అధికారులు సందీప్, యశ్వంత్, సుమన్ మండల ఇన్పుట్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం



సీఎం కప్ క్రీడోత్సవాలకు సంబంధించిన క్రీడాజ్యోతి ర్యాలీ మంగళవారం జిల్లాకు చేరుకుంది. ఈ క్రీడాజ్యోతి ర్యాలీని ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం వద్ద స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తో కలిసి ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జెండా ఊపి టార్చ్ రిలే ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు జిల్లా నుంచి ప్రపంచ స్థాయిలో రాణించే విధంగా క్రీడాకారులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంతో పాటు దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని కలెక్టర్ అన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అవకాశాన్ని అందిపుంచుకోవాలని ఆయన తెలిపారు. త్వరలో జరగబోయే సీఎం కప్ పోటీల్లో పట్టణ, మండలం, గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొన్నే విధంగా ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ క్రీడాజ్యోతి ర్యాలీ ఉపయోగపడుతుందని కలెక్టర్ అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని, క్రీడలపై మక్కువ పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో మంచి మంచి క్రీడా నైపుణ్యం కలవారికి కొదువలేదని, అలాంటి వారు సీఎం కప్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. క్రీడల వలన మానసిక ఉల్లాసంతోపాటు పరిపూర్ణమైన ఆరోగ్యం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు, యువత దృష్టిని క్రీడల వైపు మళ్లించి క్రీడా తెలంగాణగా తీర్చిదిద్దటమే ఈ సీఎం కప్ ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో క్రీడాకారులకు అన్ని సౌకర్యాలతో క్రీడా వసతులు రూపొందించడానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. సీఎం కప్ ద్వారా ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. పల్లెల నుంచి ప్రపంచ విజేతలను తయారు చేయటమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. తెలంగాణలో ప్రతి పల్లెకు క్రీడా సంస్కృతి వ్యాపించాలని ఆయన అన్నారు.యువత క్రీడలను ప్రొఫెషనల్ కెరీర్‌గా ఎంచుకునేందుకు ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని, ఇందులో భాగంగా సీఎం కప్ పోటీలను నాలుగు అంచెల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. గ్రామ, మండల, జిల్లా సహా రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ పోటీలకు రంగం సిద్ధమైందని, సీఎం కప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన అథ్లెట్లకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా రిజర్వేషన్ వర్తింపజేస్తున్నామని తెలిపారు. సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ 16 రోజుల్లో 33 జిల్లాలు సాగుతుందని, 2023 జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులు, ఇటీవల జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన తెలంగాణ జట్టుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగదు ప్రోత్సాహకాలు అందించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడలు, యువజన అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, అధికారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే కల్లూరు సొసైటీ లక్ష్యం

సొసైటీ చైర్మన్ బోబోలు లక్ష్మణ్‌రావు

నవతెలంగాణ-కల్లూరు





రైతుల శ్రేయస్సే కల్లూరు సొసైటీ లక్ష్యమని సొసైటీ చైర్మన్ బోబోలు లక్ష్మణరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 10,448 సభ్యులను కలిగి ఏకాభిప్రాయంతో సొసైటీ డైరెక్టర్ల సమావేశంలో తీర్మానాల ప్రకారంగా ఎరువులు, విత్తనాలు సబ్సిడీ రూపంలో రైతులకు అందిస్తూ రైతులు పండిస్తున్న ధాన్యాన్ని సకాలంలో 7 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలలో నేరుగా జమ చేస్తూ సొసైటీ ఏటేటా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. గతం కంటే కల్లూరు సొసైటీ వార్షిక ఆదాయాన్ని పెంచుకుంటూ 9 కోట్ల 42 లక్షల రూపాయల ఆర్థిక లావాదేవీలు కొనసాగిస్తూ సొసైటీ రైతులకు ఖరీఫ్, రబీ సాగులకూ విత్తనాలు కొనుగోలు కేంద్రం నుండి విస్తరణతో పాటు గత సంవత్సరం ఆదాయం కంటే కమిషన్ రూపంలో ఏటా 60 నుండి 70 లక్షల పైగా ఇటు రైతులు, అధికారులు, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది అందరి సహకారంతో ఆర్జించి ముందుకు సాగుతుందన్నారు. కల్లూరు సొసైటీ పరిధిలో వేలాది ఎకరాల పంటను దళారుల పాలు కాకుండా మనం పండించిన పంటను నేరుగా తెలంగాణ రాష్ట్రానికి అందేలా అనేక ప్రణాళికలను అధికారుల అండదండలతో రూపొందించి, ఐకెపి సెంటర్ల ద్వారా సభ్యులతో నిర్వహిస్తున్న కల్లూరు మండలంలోని భారీగా కొనుగోలు చేసే ఐకెపి సెంటర్ పుల్లయ్య బంజరైనని, మహిళా మణుల సైతం తమవంతుగా రైతులకు సహకారాన్ని అందిస్తూ రైతుల కష్టాన్ని గుర్తిస్తూ ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ధాన్యం తడవకుండా జాగ్రత్త పడుతూ ఎప్పటికప్పుడు లారీల ద్వారా గిడ్డంగులకు తరలించడం జరిగిందన్నారు. ఇంతటి సహకారాన్ని ఇచ్చిన మహిళలను రైతులు ఎప్పుడూ మర్చిపోరని, కల్లూరు సొసైటీలో పనిచేసిన సిబ్బంది సైతం రైతుల వెంటే ఉంటూ అనేక విధాలుగా రైతులకు సహకరిస్తూ తమ వంతుగా కృషి చేశారని అన్నారు.

18న అమ్మపేటలో సీపీఐ(ఎం) మండల మహాసభ

నవతెలంగాణ-ముదిగొండ

ఈనెల18న సిపిఐ(ఎం) మండల 9వ మహాసభ మండలపరిధిలో అమ్మపేట గ్రామంలో (సీతారాం ఏచూరి నగర్), కోయ బాబు ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలో గత ఉద్యమ కార్యక్రమాలను, సమీక్షించుకొని, భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకునేందుకు మహాసభ ప్రాధాన్యతను సంతరించుకున్నదన్నారు. మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బండి రమేష్, బుగ్గవీటి సరళ, చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు బండి పద్మ, వాసిరెడ్డి వరప్రసాద్ హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ మండల కమిటీ సభ్యులు,శాఖ కార్యదర్శులు,పార్టీ సభ్యులు,ప్రజాసంఘాల బాధ్యులు సకాలంలో హాజరై మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.



రైతుల నుండి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

నవతెలంగాణ-వేంసూరు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు ఉంటాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని భీమవరంలో డిఆర్‌డిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మహిళా సమైక్యలకు పలు సూచనలు అందించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులకు తాగునీరు, టెంట్లు సమకూర్చాలని అన్నారు. గ్రామాలలో పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఏపిఎం శ్రీనివాసరావు, మహిళా సంఘాలు, పంచాయతీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



సూర్యనారాయణ జీవితం ఆదర్శం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్య వీరభద్రం

నవతెలంగాణ-పెనుబల్లి

నమ్మిన సిద్ధాంతం కోసం కమ్యూనిజానికి కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన చలమాల సూర్యనారాయణ జీవితం ఆదర్శనీయమని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం అన్నారు. విఎం బంజర్ ఎపిఎం కార్యాలయంలో చలమాల సూర్యనారాయణ 42వ వర్ధంతి పార్టీ మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ నేడు అనేక దేశాల్లో కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తున్నారని అన్నారు. సమాజ మార్పు కోసం పేదల పట్ల అంకితభావంతో పనిచేసే వారిని అణచివేసేందుకు పాలకులు పలు రకాలుగా వేధిస్తున్నారని అందుకు ప్రొఫెసర్ సాయిబాబా జీవితమే నిదర్శనం అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్ మాట్లాడుతూ పోడు చేసుకుంటున్న గిరిజనులకు పది ఎకరాల వరకు పట్టాలు ఇవ్వాలని అటవీ హక్కుల చట్టంలో ఉన్నప్పటికీ ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. సభలో నాయకులు కాటినేని శ్రీనివాసరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, తాంద్ర రాజేశ్వరరావు, వేముల రవికుమార్, సురేష్, పంతంగి వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎం)నాయకులు గుడిమెట్ల బాబు, నాగమణి, తడకమళ్ళ చిరంజీవి, నాగేశ్వరి, పోతిని బుచ్చాలు, చిలక రామచంద్రుడు మిద్దెస్వామి, పాల్గొన్నారు.



ప్రశ్నించే గొంతుకలపై మోడీ కత్తి

అమరుల స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు

నవతెలంగాణ-కారేపల్లి

ప్రశ్నించే గొంతుకపై మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కత్తి పెడుతుందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర విమర్శించారు. మంగళవారం కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులస్త్ర అమరజీవి పోతురాజు శేషయ్య వర్ధంతిని జరిపారు. శేషయ్య స్తూపం వద్ద పార్టీ పతకాన్ని మన్నెం బ్రహ్మయ్య ఎగరవేశారు. ఈ సందర్భంగా వల్లబోయిన కొండలరావు అధ్యక్షతన జరిగిన సభలో నరేంద్ర మాట్లాడుతూ మానవ హక్కుల కోసం పోరాడిన జీఎన్ సాయిబాబా బీజేపీ ప్రభుత్వం వేధించి చంపిందన్నారు. కేంద్ర నిరంకుశ పాలన, అప్రజా స్వామి విధానాలతో దేశంలో ఆరాచరం పెరిగి అటవీక న్యాయం రాజ్యమేలుతుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు పక్కన పెట్టి వ్యక్తి విమర్శలు చేస్తూ ప్రజలలో పలుచన అవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావంచక విధానాలపై సీపీఐ(ఎం) ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటాలు చేస్తుందన్నారు. బాజుమల్లాయిగూడెం ప్రాంతంలో పోతురాజు శేషయ్య ఎన్నో ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించి పార్టీ అభివృద్ధి పాటుపడ్డారని కొనియాడారు. అయన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు యనమనగండ్ల రవి, గిరిజన సంఘం మండల అధ్యక్షులు అజ్మీర శోభన్ బాబు, నాయకులు ఎర్రిపోతు భద్రయ్య, పోతురాజు చంద్రరావు, శేరు వెంకటేశ్వర్లు, మెరుగు రాములు, ఎట్టి శ్రీను, కోరం రంగయ్య, సురభి సుగుణ, రాచర్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్ వేతనాలివ్వాలి

- మినీ నుంచి మెయిన్ అంగన్‌వాడీలైన వారి పేర్లను ట్రెజరీలో అప్డేట్ చేయాలి
- హెల్పర్లను నియమించాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాష్ట్రంలో మినీ నుంచి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మారిన సెంటర్లలో పనిచేస్తున్న టీచర్లకు ఐదు నెలల పెండింగ్ వేతనాలివ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. వారి పేర్లను ట్రెజరీలో అప్డేట్ చేయాలని కోరింది. వారికి హెల్పర్లను నియమించాలనీ, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విన్నవించింది. ఈ మేరకు మంగళవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి పి.మంగ లేఖ రాశారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన నాలుగు వేల మంది అంగన్‌వాడీ టీచర్లను మినీ నుంచి మెయిన్‌గా ప్రమోషన్లు కల్పించిందనీ, కానీ, ఆర్థిక శాఖలో వారి పేర్లను అప్డేట్ చేయలేదని తెలిపారు. దీనివల్ల మార్చి, ఏప్రిల్, జులై, ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో సగం వేతనాలే పొందారని పేర్కొన్నారు. దీనిపై మంత్రి సీతక్కకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తమల్ని మెయిన్ టీచర్లుగా గుర్తించిందా? లేదా? అనే అనుమానం కలుగుతున్నదని పేర్కొన్నారు. మెయిన్ టీచర్లకు సహాయకులుగా హెల్పర్లను నియమించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 14, 15 ఏండ్ల నుంచి ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

అద్దె భవనాల్లో గురుకులాలు

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థుల కనీస అవసరాలు తీర్చలేకపోతున్నాయి. ఈ విషయం ఇప్పటికే సర్కారు దృష్టిలో ఉన్నది. మరో పక్క విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఆ భవనాలను రీ మోడల్ చేయాలని యజమానులకు చెప్పినా.. ఆ విషయంలో ఎలాంటి పురోగతీ లేదు. రాష్ట్రంలో 327 బీసీ గురుకులాలు ఉన్నాయి. వీటిలో 306 అద్దె భవనాల్లోనే ఉన్నాయి. ఈ భవనాల అద్దెకు ఏటా రూ.90 నుంచి రూ.100 కోట్లు వెచ్చిస్తున్నారు. మిగతా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల పరిస్థితీ ఇదే. మొత్తం రెసిడెన్షియల్ భవనాల నిర్మాణానికి సుమారు రూ.10 వేల కోట్లు అవసరమవుతాయని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. కానీ ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించకపోగా, ఇప్పటికే అదే మోతాదులో అద్దెలు చెల్లించినట్టు విమర్శలున్నాయి.

ఘనమైన మాటలు

గురుకులాల నిర్వహణపై ప్రభుత్వ పెద్దల మాటలు ఘనంగా ఉన్నాయి. 'రాష్ట్రంలో గురుకులాల విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. ఒక్కో విద్యార్థిపై ఏటా రూ. లక్షా 25 వేలు ఖర్చు చేస్తున్నాం' సంక్షేమ పథకాలపై చర్చ సందర్భంగా ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలివి. ఏడాదికి సుమారు రూ. 5వేల కోట్లకుపైగా విద్యార్థులపై ఖర్చు చేస్తున్నట్టు వారు వెల్లడిస్తున్నారు. కానీ..వాస్తవంలో గురుకులాలన్నీ సమస్యలకు కేంద్రాలుగా మారాయి. అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో పిల్లలు నానా అవస్థలు పడుతున్నారు. ఒక్కో గదిలో 12 నుంచి 20మంది విద్యార్థులు ఉంటున్నారు. ఆటస్థలాలు లేకపోవటంతో పాటు .బాత్రూంలు, మరుగుదొడ్ల కష్టాలు.. మంచినీటి వెతలు, ఆరుబయట స్నానాలు, బోధకుల లేమి, నియమబద్ధంగా సాగని చదువులు... వెరసి అద్దె భవనాల్లో విద్యార్థులు అష్ట కష్టాలు పడుతున్నారు.

చదువు సాగేదెట్లా..?

ప్రశాంతంగా చదువుకోవాల్సిన విద్యాలయాల్లో సమస్యలు చుట్టుముడితే ఆ విద్యార్థి చదువు ఎలా సాగుతుంది? ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులు ఇంటి బాట పట్టారు. కొందరు ఆస్పత్రుల పాలయ్యారు. ఇంకొందరు బెరుకు బెరుకుగా చదువు సాగిస్తున్నారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు ఎస్ మండలంలో బీసీ బాలికల గురుకులంలో 300 మంది విద్యార్థులున్నారు. అక్కడ వర్షం వస్తే.. ఆ గురుకులం వాగులా తయారవుతుంది. మరుగుదొడ్లలోని నీరు, వర్షపు నీరు కలిసి ప్రవహిస్తాయి. .కిటికీలు లేవు. తగిన భద్రత లేదు.

- కోదాడ దగ్గర దోరకుంట పులిచింతల నెమలిపురి కాలనీలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌లో 530 మంది విద్యార్థులున్నారు. అక్కడున్న హైస్కూల్‌లో గురుకులాన్ని నడిపిస్తున్నారు. దీంతో సరైన వసతులు లేక పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.
- జోగులాంబ కడుకుంట్ల గ్రామంలో కోళ్ల ఫారంలో గురుకుల పాఠశాలను నిర్వహిస్తున్నారు. కనీసం ప్రహరీ లేదు. సరిపడా గదులు, బాత్రూంలూ లేవు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలోనూ అదే పరిస్థితి.
- వనపర్తి జిల్లా వేపనగండ్ల పాఠశాల కొత్తకోటలోని పొలాల మధ్య ఉంది. ఎలాంటి ప్రహరీ, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు లేవు. దీంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల అద్దె భవనాల్లో అత్యధికం ఇదే దుస్థితిలో కొనసాగుతున్నాయి.

సమగ్ర విధానాన్ని రూపొందించాలి :తాళ్ల నాగరాజు
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాష్ట్రంలోని గురుకులాలు ఎక్కువ శాతం అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. సరైన సౌకర్యాల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది గురుకులాల్లో 39 మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్, మానసిక ఒత్తిడి, రకరకాల కారణాలతో చనిపోయారు. అయినా సర్కారులో చలనం లేదు. మాటలతోనే కాలం గడుపుతున్నట్టు అర్థమవుతోన్నది. అద్దెలు చెల్లించకపోవటంతో యజమానులు హాస్టళ్లకు తాళాలు వేయటంతో విద్యార్థుల చదువులపై ఆ ప్రభావం పడుతోంది. సరైన సౌకర్యాలు నెలకొల్పేలా ప్రభుత్వం యజమానులతో ఒప్పందాలు చేసుకోవాలి. సకాలంలో అద్దెలు చెల్లించాలి. సొంత భవనాల నిర్మాణానికి పూనుకోవాలి. గురుకులాల నిర్వహణకు సమగ్ర విధానాన్ని ప్రకటించాలి.

తాళాలు వేసిన వారిపై క్రిమినల్ కేసులు :
మంత్రి పొన్నం

గురుకుల పాఠశాల గేట్లకు తాళాలు వేసిన భవన యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. 70 శాతం గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని ఆయన అంగీకరించారు. బకాయిలు అడగలేక యజమానులు ఈ చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. బకాయిలు విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న సమయంలో వారు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారనీ, ఇది సరికాదని తెలిపారు. పెట్టిన బ్యానర్లను వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు అసౌకర్యం కలిగించొద్దన్నారు. లేదంటే ప్రభుత్వ పరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. పాత బకాయిలతో సహా మెస్ చార్జీలను మూడు రోజుల క్రితమే చెల్లించామని చెప్పారు. ఎక్కడైనా యజమానులు ఇబ్బందులు పెడితే గురుకుల ప్రిన్సిపల్ , ఆర్సీవోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయాలనీ, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్లు ప్రత్యామ్నాయాన్ని చూడాలని ఆదేశించారు.

యువతిపై ఆటో డ్రైవర్ లైంగికదాడి

- గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఘటన

నవతెలంగాణ–మియాపూర్

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి యువతిపై ఆటో డ్రైవర్ లైంగికదాడికి ఒడిగట్టాడు. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్న ఓ యువతి సోమవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో పటాన్‌చెరులోని ఆర్సీపురం నుంచి నానక్‌రాంగూడకు వెళ్లేందుకు ఆటో మాట్లాడుకుంది. శేరిలింగంపల్లిలోని మసీద్‌బండ ప్రాంతానికి రాగానే ఆటో డ్రైవర్ ఆ యువతిని బెదిరించి ఆమెపై లైంగిక దాడి చేశాడు. అనంతరం బాధితురాలిని అక్కడే వదిలేసి పరారయ్యాడు. బాధితురాలు తనపై లైంగికదాడి జరిగిందని మంగళవారం ఉదయం గచ్చిబౌలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

గురుకులాలకు తాళాలు

అద్దె బకాయిలు చెల్లించాలని యజమానుల హెచ్చరిక

- గేట్ల ముందు విద్యార్థులు, తల్లిదండ్రుల నిరీక్షణ
- కొన్ని చోట్ల తాళాలు తీసిన యజమానులు
- క్రిమినల్ కేసులు పెట్టాలని అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు

దసరా సెలవుల అనంతరం మంగళవారం నుంచి పాఠశాలలు పున్ణప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో గురుకుల విద్యాసంస్థలూ తెరుచుకోవాలి.. కానీ, అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు అద్దె సమస్య వచ్చి పడింది. సుమారు 10 నెలలుగా అద్దె చెల్లించడం లేదంటూ పలు జిల్లాల్లో యజమానులు తాళాలు వేశారు. ఈ విషయాలేమీ తెలియని విద్యార్థులు గ్రామాల నుంచి తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలకు చేరుకున్నారు. అయితే.. అప్పటికీ తాళాలు తీయక పోవడంతో అయోమయంలో పడ్డారు. కొన్ని పాఠశాలల వద్ద భవనాల యజమానులు బ్యానర్లు పెట్టగా, మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెప్పేవరకూ విషయం తెలియక తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. చివరకు చేసేదేమీ లేక ఇంటి ముఖం పట్టారు. అయితే, గురుకులాలకు తాళాలు వేయడంపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. గురుకుల పాఠశాలలకు తాళాలు వేసిన యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టాలని కలెక్టర్లను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. రెండు, మూడు రోజుల్లో బిల్లులు చెల్లిస్తామని, సమస్య ఉంటే అధికారులను కలవాలని సూచించారు.





నవతెలంగాణ– మొఫసిల్ విలేకరులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల భవన యజమాని దేవదర్‌రెడ్డి, రేగొండ మండలం లింగాల క్రాస్ వద్ద కొనసాగుతున్న గణపురం మండలం గాంధీనగర్‌కు చెందిన మహాత్మాజ్యోతిబా పూలే(బాలికలు) భవనం యజమాని చిర్ర మహేందర్ గౌడ్, రేగొండలోని భూపాలపల్లి మహాత్మా జ్యోతిబాపూలే (బాయ్స్) గురుకులం భవన యజమాని కటకం రాజు ఆయా గురుకులాలకు ఉదయం తాళాలు వేశారు. తాము నోటీసులిచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ.. అద్దె చెల్లించే వరకు గేటు తెరిచేది లేదని గేట్లకు బ్యానర్లు ఏర్పాటు చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, హాస్టళ్లకు యజమానులు తాళాలు వేశారు. వరంగల్ జిల్లా ఉర్సు గుట్ట వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల భవనానికి యజమాని తాళం వేశారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. అదేవిధంగా, చెన్నారావుపేట మండల కేంద్రంలోని దుగ్గొండి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల హాస్టల్ భవనానికి యజమాని కంది గోపాల్‌రెడ్డి తాళం వేశారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని మర్రిమిట్ట సమీపంలో నిర్వహిస్తున్న జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యాలయ భవన సముదాయ యజమాని నితిన్ మెయిన్ గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. కొద్దిసేపటి తర్వాత ప్రయివేటు భవన యజమానుల అసోసియేషన్ సూచన మేరకు తాళం తీశారు. అలాగే, తొర్రూరు పట్టణంలోని జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల, మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, బీసీ బాలుర గురుకుల డిగ్రీ కళాశాల, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లకు యజమానులు తాళాలు వేసి నిరసన తెలిపారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు బిల్డింగ్ యజమాని సురభి శరత్ కుమార్ తాళాలు వేశారు.

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల, యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సీ బాయ్స్ పాఠశాల భవనాలకు యజమానులు తాళాలు వేశారు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్ (టీఎస్ డబ్ల్యూఆర్ఎస్) భవనాలకు యజమానులు తాళం వేశారు. పాఠశాల్ ప్రిన్సిపాల్ శారద ఈ విషయాన్ని ఉమ్మడి నల్లగొండ, జనగాం జోనల్ ఆఫీసర్ విద్యారాణి, యాదాద్రి అడిషనల్ కలెక్టర్‌కు తెలియజేశారు.

మండల స్పెషల్ ఆఫీసర్ యాదయ్య, తహసీల్దార్ రాంప్రసాద్, ఎస్ఐ నాగరాజు, ఎంఈవో గోపాల్‌రెడ్డి పాఠశాల వద్దకు వచ్చి భవన యజమానితో మాట్లాడినా తాళాలు తీసేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల గేటు వద్ద బైటాయించి.. సమస్యను పరిష్కరించాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి.. త్వరలోనే అద్దెలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో భవన యజమాని గేటుకు తాళం తీశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం న్యూటౌన్‌లోని మైనార్టీ బాలుర–2 రెసిడెన్షియల్ పాఠశాలకు ఆ భవన యజమాని తాళం వేశారు.

విధిలేని పరిస్థితుల్లోనే నిరసనలు.. :
గురుకుల పాఠశాలల అద్దె భవనాల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు హనుమాన్ల దేవేందర్ రెడ్డి

దాదాపు 8 నెలలకుపైగా ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో మాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురుకులాల్లో చదివే విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఇన్ని రోజులు వేచి చూశాం. అయినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదు. ఒక్క తొర్రూరు పట్టణంలోనే సుమారు రూ.60లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. ఉన్నతాధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసినం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. విధిలేని పరిస్థితుల్లో.. మా బాధలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి మాత్రమే తాళాలు వేసి నిరసన తెలిపాం. ఇప్పటికైనా బకాయిలు చెల్లించి ఆదుకోవాలి.

గురుకులాల అద్దె చెల్లించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాల యజమానులు దసరా సెలవుల తర్వాత వాటి తాళం తీయడం లేదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తెలిపింది. 12 నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం అద్దె చెల్లించడం లేదంటూ అందుకే మూసేస్తున్నట్టు యజమానులు ప్రకటించారని పేర్కొంది. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు తక్షణమే అద్దె చెల్లించాలని డిమాండ్ చేసింది. గురుకులాలకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అంతా బయటే ఉన్నారనీ, అధికారులు మాట్లడినా తాళాలు తీయడం లేదనీ, ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుంగతుర్తి, బెల్లంపల్లి, తాండూరు, వరంగల్, భూపాలపల్లి, హుజూర్‌నగర్, తొర్రూర్, భువనగిరిలోని గురుకులాలకు భవన యజమానులు తాళాలు వేశారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాలు అంటూనే ఉన్న వాటిలో సమస్యలు పరిష్కారం చేయడం లేదని పేర్కొన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని తెలిపారు. వాటికి తాళాలు వేయడంతో సమస్యలు మరింత తీవ్రతరం అవుతాయనీ, ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి : టీపీటీఎల్ఎఫ్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఏ విజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రూ.ఎనిమిది వేల కోట్లకుపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్నాయని తెలిపారు. ప్రయివేటు విద్యాసంస్థలతో చర్చలు జరిపి విద్యార్థులకు నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల యాజమాన్యాలు, అధ్యాపకులతోపాటు విద్యార్థులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీజులు రాలేదనే సాకుతో అధ్యాపకులకు సకాలంలో యాజమాన్యాలు జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. చదువు పూర్తయిన విద్యార్థులు ధ్రువపత్రాలను తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఫీజు చెల్లిస్తేనే ఇస్తామంటూ యాజమాన్యాలు చెప్పడంతో అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు. ఫీజులను విడుదల చేసి విద్యార్థులతోపాటు యాజమాన్యాల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో గందరగోళంగా విద్యావ్యవస్థ : ఏఐఎస్ఎఫ్

రాష్ట్రంలో విద్యావ్యవస్థ గందరగోళంగా మారిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటి విడుదల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. అద్దె చెల్లించడం లేదంటూ గురుకులాలకు యజమానులు తాళాలు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యారంగం, గురుకులాలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలనీ, అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని కోరారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కావడం లేదంటూ డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాలు రెండు రోజుల నుంచి బంద్ చేపట్టాయని తెలిపారు. యాజమాన్యాలతో ప్రభుత్వం సంప్రదించాలనీ, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

హెచ్‌సీయూ విద్యార్థి సంఘం పాలకవర్గం రద్దు

- నెల ముందే డీఎస్‌డబ్ల్యూ నిర్ణయం
- ఖండించిన ఎస్ఎఫ్ఐ



నవతెలంగాణ– మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో ఎన్నికైన విద్యార్థి సంఘం కమిటీ (పాలకవర్గం)ని రద్దు చేస్తూ డీఎస్‌డబ్ల్యూ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ బాడీకి నెల రోజుల కాల వ్యవధి ఉన్నప్పటికీ ఉన్న ఫలంగా రద్దు చేయడం పట్ల విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయాన్ని ఎస్ఎఫ్ఐ హెచ్‌సీయూ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికలు ఏడాదికోసారి నిర్వహిస్తుందని తెలిపింది. ఈ ఏడాది ఎన్నికలకు ఇంకా నెల సమయం ఉండగా.. ఒక విద్యార్థి సంఘం ఒత్తిడి మేరకు ఎన్నికైన విద్యార్థి సంఘం కమిటీ (బాడీ)ని రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ యాజమాన్యం పూర్తిగా ఒక విద్యార్థి సంఘానికి అనుకూలంగా.. తన విధానాలను మార్చుకుంటూ ఇలాంటి చర్యలకు పూనుకుంటోందని పేర్కొంది. యూనివర్సిటీలో ప్రజాసామ్యాన్ని కూనీ చేసే కుట్ర జరుగుతోందని చెప్పింది. ఇలాంటి చర్యలను విద్యార్థి లోకం గమనించాలని, వచ్చే ఎన్నికల్లో ఆ విద్యార్థి సంఘానికి, యూనివర్సిటీ యాజమాన్యానికి తగిన బుద్ధి చెప్పాలని విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

ఇంటర్ ప్రవేశాల గడువు 20 వరకు పొడిగింపు

- ప్రయివేటు కాలేజీల్లో రూ.500 ఆలస్య రుసుంతో చేరేందుకు అవకాశం : ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును ఈనెల 20వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది.ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పొందాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రయివేటు జూనియర్ కాలేజీల్లో చేరేందుకు ఆలస్య రుసుం రూ.500 చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వరంగ జూనియర్ కాలేజీలకు ఆలస్య రుసుం నుంచి మినహాయింపు ఉందని పేర్కొన్నారు. అనుబంధ గుర్తింపు ఉన్న జూనియర్ కాలేజీల్లోనే చేరాలని విద్యార్థులకు, చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఆ కాలేజీల జాబితాను acadtgbie.cgg.gov.in , tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వివరించారు.గుర్తింపు లేని కాలేజీల్లో చేరొద్దని సూచించారు. విద్యార్థులకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఈనెల 20వ తేదీ వరకు ప్రవేశాలను కల్పించాలని జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లను ఆమె ఆదేశించారు.

రెండు వేల మందితో విపత్తు నిర్వహణ విభాగం

- ఫైర్‌సర్వీస్ నుంచి 10, టీజీఎస్‌పీ నుంచి 10 బృందాల ఏర్పాటు
- మొదటి బ్యాచ్‌కు వచ్చే నెల నుంచి శిక్షణ : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు వీలుగా రెండు వేల మందితో 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో డీజీపీ జితేందర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదల వల్ల లోతట్టు ప్రాంతాలు నీట మునిగిన నేపథ్యంలో ఈ విభాగాన్ని మరింత ఆధునికంగా విస్తరించాలని సీఎం ఆదేశించారని గుర్తు చేశారు. ఈ క్రమంలో అగ్నిమాపక శాఖకు చెందిన సిబ్బందితో 10, తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్ సిబ్బందితో 10 బృందాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇందుకు అవసరమైన బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండేందుకు వీలుగా ఈ విభాగాన్ని పటిష్ఠం చేస్తామని తెలిపారు. వచ్చే నెల మొదటి వారం నుంచి మొదటి బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రెస్క్యూ ఆపరేషన్లకు అవసరమైన వాహనాలు, పరికరాలు, వ్యక్తిగత రక్షణ సాధనాలను అందుబాటులోకి తేవాలని సూచించారు. అగ్నిమాపక శాఖలోని 10 బృందాలను ఎస్‌డీఆర్ఎఫ్ స్టేషన్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్టు ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి ఈ సందర్భంగా సీఎస్‌కు తెలిపారు.

జీవో 81,85 ప్రకారం ఉద్యోగాలివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

హామీ ఇచ్చారు. అనంతరం వీఆర్ఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెఏసి కన్వీనర్ వంగూరు రాములు మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్ఎలకు పేస్కేలు, వారసులకు ఉద్యోగాలిస్తామని అసెంబ్లీలో ప్రకటించి నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దీంతో వారు 80 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా చారిత్రాత్మకమైన సమ్మె చేయటంతో ప్రభుత్వం దిగొచ్చి వీఆర్ఏ జేఏసీ నాయకులతో చర్చలు జరిపిందనీ, జీవో 81, 85ను విడుదల చేసిందని తెలిపారు. దాని ప్రకారం 20,555 మంది వీఆర్ఏల్లో డిగ్రీ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్‌గా, ఇంటర్మీడియట్ చదివిన వారికి రికార్డ్ అసిస్టెంట్‌గా, పదో తరగతి చదివిన వారికి ఆఫీసు సబార్డినేటర్లుగా రెవెన్యూతో పాటు మున్సిపల్ పంచాయతీరాజ్ సాగునీటి పారుదల శాఖలో సర్దుబాటు చేసిందని గుర్తు చేశారు. మిగిలిన 3,797 మంది 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇస్తామని జీవోలో ప్రకటించి, ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తండ్రుల స్థానంలో తమకు ఉద్యోగాలొస్తాయని వారి ఆస్తులను పంచుకున్నారని తెలిపారు. గత 15నెల్లుగా ఉద్యోగం కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ ఉద్యోగ సంఘాలు, ఎమ్మెల్యే, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రి చుట్టూ కాలికి బలపం కట్టుకొని తిరిగినా ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూల స్పందన కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఎల సమస్యల పరిష్కారం కోసం ఐదుగురు ఐఏఎస్ ఆఫీసర్లతో నవీన్ మిట్టల్ చైర్మెన్ గా కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీని నియమించిందని గుర్తు చేశారు.


ఆ కమిటీ రిపోర్ట్ ప్రభుత్వానికి సమర్పించినా.. సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. కమిటీ పేరుతో, ఎన్నికల పేరుతో, వర్షాలు వరదల పేరుతో కాలయాపన చేస్తూ వారి జీవితంతో ఆడుకోవద్దని హితవు పలికారు. ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించటంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గతంలో తమ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఆందోళనలకు మద్దతిచ్చి, అధికారంలోకి వచ్చాక విస్మరించటం తగదన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏల జేఏసీ నాయకులు సాగర్, కె. రమేష్, అంజనేయులు, రమేష్ పటేల్, శివ, మధు, భరత్, యాదవ్, శ్రీకాంత్, అనిల్, వెంకట్, శేఖర్, ఇమాంపాషా, సతీష్, గంగమల్లు తదితరులు పాల్గొన్నారు.

రుణభారం తగ్గింపునకు నీటిపారుదల శాఖ కసరత్తు

- దీర్ఘకాలిక అప్పులవైపు సర్కారు మొగ్గు
- ఏఐఐబీ ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ భేటీ
- కొత్త ప్రాజెక్టులతో పాటు పాతవాటి పూర్తికి సన్నాహాలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

నీటిపారుదల రంగంలో దీర్ఘకాలిక రుణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. స్వల్పకాలిక రుణాలు రాష్ట్ర ఖజానాకు పెనుభారం అనే భావనతో సర్కారు ఉంది. స్వల్పకాలిక రుణాలతో దీర్ఘకాలిక అప్పులను పోల్చినప్పుడు తిరిగి చెల్లించే ఈఎంఐతోపాటు వడ్డీ చెల్లింపులతో వెసులుబాటు లభిస్తుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఆ శాఖ ప్రస్తుతం దీర్ఘకాలిక రుణాలవైపు మొగ్గు చూపుతున్నది. అందులో భాగంగా మంగళవారం ఎర్రమంజిల్ కాలనీలోని జలసౌధలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) ప్రతినిధులతో భేటీలో అయ్యారు. ఇందులో రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్, కార్యదర్శి రాహుల్ బొజ్జ, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఈఎన్సీలు అనిల్‌కుమార్, నాగేందర్‌రావు, డిప్యూటీ ఈఎన్సీ కె. శ్రీనివాస్‌తోపాటు ఏఐఐబీ ప్రతినిధులు సంగ్మా కిమ్, రాజేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ



సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నీటిపారుదల శాఖకు ప్రస్తుతం ఉన్న స్వల్పకాలిక రుణాలను సైతం దీర్ఘకాలిక రుణాలుగా మార్చడం ద్వారా ప్రభుత్వ ఖజానా మీద పడుతున్న భారం తగ్గడంతో పాటు వడ్డీ చెల్లింపులలో వెసులుబాటు ఉంటుందన్నారు.

తద్వారా రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంగా పెట్టుకున్న పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసి కొత్త ఆయకట్టు సష్టించేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. ఆ క్రమంలోనే ఈ రుణాలు కొనసాగు తున్న ప్రాజెక్టులకు వర్తింపజేయాలని బ్యాంక్ ప్రతినిధులకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూచించారు. వెనుకబడిన ప్రాంతాలతో పాటు గిరిజనులు అత్యధికంగా ఉన్న ములుగులో ఫ్లోరోసిస్ బారిన పడిన ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పూర్తికి ఈ రుణాలు వినియోగించేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఎస్ఎల్‌బీసీ పాలమూరు–రంగారెడ్డి, డిండిలతోపాటు నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలు, ఉత్తర తెలంగాణా జిల్లాల్లో నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులకు దీర్ఘకాలిక రుణాలు ఉపయోగిం చాలని చెప్పారు. అంతే కాకుండా ఏఐఐబీ ప్రతినిధులు, రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి రామకష్ణారావుతో సమావేశం నిర్వహించి సాధ్యాసాధ్యాలను లోతుగా పరిశీలించాలని నీటిపారుదల శాఖా కార్యదర్శి రాహుల్ బొజ్జాను మంత్రి ఆదేశించారు. అదే సమయంలో అన్ని ప్రాజెక్టులకు పాలనాపరమైన అనుమతులు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



జ్ఞానాన్ని పొందటం సులభం కాదు..

శాస్త్రీయ విద్యను వెదుగుతూ విదేశాలకు వెళ్లారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయ ఆహ్వానంతో తిరిగి స్వదేశానికి వచ్చారు. అనేక అడ్డంకులను అధిగమించి భారతదేశంలోనే ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో వెటర్నరీ, యానిమల్ సైన్సెస్ ఫ్యాకల్టీ వ్యవస్థాపక డీన్‌గా చరిత్ర సృష్టించారు. ఆమే రమాదేవి నిమ్మనపల్లి. ఇటీవల హర్‌స్టోరీ వెబ్‌సైట్ కోసం ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు నేటి మానవిలో...

రమాదేవి తమిళనాడులో పుట్టిపెరిగారు. 1994లో బరేలీలోని ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. శాస్త్రీయ విద్యను కొనసాగించేందుకు విదేశాలకు వెళ్లాలనుకున్నారు. అయితే తల్లిదండ్రులు మాత్రం 'ముందు పెండ్లి చేసుకో, తర్వాత నీకు కావల్సింది చదువుకో' అన్నారు. తల్లిదండ్రుల కోరిక మేరకు పెండ్లి చేసుకున్నారు. చదువు విషయంలో భర్త ఆమెకు పూర్తిగా సహకరించారు. ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో చదువుకోవడానికి ఒంటరిగా వెళ్లారు. కొంతకాలానికి భర్త కూడా పీహెచ్‌డీ కోసం అక్కడకు చేరుకున్నారు. చదువు పూర్తి చేసిన తర్వాత ఇద్దరూ పశువైద్యులుగా అక్కడే స్థిరపడ్డారు.

అమెరికా వదిలి

రమాదేవి ఇద్దరు పిల్లలు యూఎస్‌లోనే జన్మించారు. కూతురు యుక్తవయసులోకి వచ్చినప్పుడు ఇంటి వెలుపల అమెరికన్ సంస్కృతి, లోపల భారతీయ సంస్కృతి మధ్య నలిగిపోవడం ఆమె గుర్తించారు. 'నా కూతురు అక్కడ చాలా ఒత్తిడిలో జీవించింది. ఐదు, ఆరో తరగతిలో ఉన్నప్పుడే ప్రతి ఒక్కరికీ అక్కడ బాయ్‌ఫ్రెండ్ ఉండాలి. అలా లేకపోతే ఎందుకూ పనికి రాని వ్యక్తిగా అక్కడ పరగణిస్తారు. టీనేజ్ అత్యంత విలువైనది. ఇంట్లో మేము ఆమెకు భారతీయ విలువల గురించి చెప్పేవాళ్లం. కానీ పాఠశాలలో దీనికి విరుద్ధంగా ఉంటుంది. దాంతో ఆమె గందరగోళ పడేది. తను ఎలా ఉండాలనుకుంటుందో తననే నిర్ణయించుకోమని చెప్పాను. ఇది ఆమె భవిష్యత్‌కు సహాయపడింది. నీ తల్లిదండ్రులు రెండు ప్రపంచాలకు చెందినవారని వివరంగా చెప్పాము. మాకు మా జీవితం ఉంది. ఇప్పుడు వారి జీవితాల గురించి ఆలోచించాలి. మా పిల్లలు రెండింటిలో ఉత్తమంగా ఉండాలని మేము కోరుకుంటున్నాం. అందుకే భారతదేశానికి వెళ్లాలని నా కూతురు నిర్ణయం తీసుకుంది' అని రమాదేవి పంచుకున్నారు.

తిరిగి భారతదేశానికి

2014 డిసెంబరులో రమాదేవి తన కూతురు కోరికతో స్వదేశానికి వచ్చారు. అప్పటికే వెటర్నరీ, జంతు శాస్త్రాల కోసం కొత్త ఫ్యాకల్టీని ఏర్పాటు చేయడానికి హిందూ విశ్వవిద్యాలయం వెతుకుతుందని ఓ స్నేహితురాలు ఆమెతో చెప్పింది. అయితే అప్పటి వరకు ఆమెకు బనారస్ హిందూ యూనివర్సిటీ(బీహెచ్‌యూ) గురించి తెలియదు. రమాదేవి అక్కడ చేరిన వెంటనే కొత్త కోర్సులను ప్రారంభించే ప్రక్రియ ద్వారా శక్తిని పొందారు. అనేక సమావేశాలు ఏర్పాటు చేసి ఆరు నెలల్లో కొత్త అధ్యాపకులు స్థాపించారు. కానీ చివరి దశ మిగిలి ఉంది. అదే రాష్ట్రపతి అనుమతి. బీహెచ్‌యూలో ఏదైనా కొత్త కోర్సును ప్రారంభించేందుకు చట్టబద్ధమైన ఆమోదం అవసరం. 'ఈ కోర్సును ప్రారంభించడానికి ఇక్కడ చాలా ప్రతికూలత ఉంది. మొదటి వైస్ ఛాన్సలర్ ఇక్కడ ఉన్నంత వరకు పని బాగానే ఉంది. కానీ వైస్-ఛాన్సలర్ వెళ్లిన తర్వాత విషయాలు తలకిందులయ్యాయి. ఒకానొక సందర్భంలో ఇక్కడి నుండి తిరిగి విదేశాలకు వెళ్లాలనుకున్నాను' అని ఆమె గుర్తు చేసుకున్నారు.

భిన్నమైన విద్యా ప్రమాణాలు...

వాస్తవానికి రమాదేవి విదేశాల్లో ఉన్నప్పుడు పరిశోధనా అభిరుచులు మారిపోయాయి. దాంతో భారతదేశంలోని విద్యా జీవితం గురించి అవగాహన తగ్గిపోయింది. బ్లూటాంగ్ వైరస్ (పశువులు, జింకలకు సోకేది) అధ్యయనం చేసే మైక్రోబయాలజిస్ట్‌గా ఆమె తన కెరీర్ ప్రారంభించారు. అయితే గ్లీవెక్ ఔషధం కోసం రసాయన మార్గాలను అధ్యయనం చేసేంత వరకు మానవ క్యాన్సర్లను పరిశోధించడానికి వెళ్లారు. 'భారతదేశంలో అగ్రశ్రేణి వెటర్నరీ ఇన్‌స్టిట్యూట్ అయిన ఐవీఆర్‌ఐ నుండి ఆక్స్‌ఫర్డ్‌కి వెళ్లడం ఆమెకు అంత సులభం కాలేదు. అక్కడికి వెళ్లిన తర్వాత చాలా షాక్‌లు తగిలాయి. విద్యా ప్రమాణాలు చాలా భిన్నంగా ఉన్నాయి. నా పీహెచ్‌డీ హర్బ్వేర్ బయోకెమిస్ట్రీలో ఉంది. భారతీయ వెటర్నరీ సైన్స్ లేదా మెడిసిన్ కోర్సులు లోతైన శాస్త్రాలను బోధించవు. జ్ఞానాన్ని పొందడం అంత సులభం కాదు' అని ఆమె గుర్తుచేసుకున్నారు.

మళ్లీ నేర్చుకున్నాను

స్వదేశంలో బెస్ట్ స్టూడెంట్ అయినప్పటికీ విదేశాలలో మొదటి నుండి ప్రారంభించవలసి వచ్చింది. 'నేను వెటర్నరీ ఇన్‌స్టిట్యూట్‌లో బీఎస్సీ టాపర్‌గా ఉన్నప్పటికీ దేని గురించీ నాకు అవగాహన లేదు. నేను ప్రతిదీ మళ్లీ నేర్చుకోవలసి వచ్చింది. క్యాన్సర్ కెమిస్ట్రీ, వెటర్నరీ సైన్సెస్‌తో కూడిన పరిశోధనల కలయిక రమాదేవికి బీహెచ్‌యూలో మార్గదర్శకత్వం వహించే అనేక మంది విద్యార్థి శాస్త్రవేత్తలను ప్రభావితం చేయడానికి విస్తృత పరిధిని అందించింది. ఆమె 40కి పైగా పరిశోధనా పత్రాలను రచించారు. అమెరికాలోని అనేక ఇన్‌స్టిట్యూట్‌లలో బోధనలో అపారమైన అనుభవం ఉంది. 'జంతువుల నిర్వహణ గురించి విదేశాల్లో నేర్చుకున్న మెరుగైన ప్రమాణాల గురించి పంచుకోవడానికి మాత్రమే నేను ఇక్కడ చాలా కష్టపడుతున్నాను. చేయాల్సింది ఇంకా చాలా ఉంది' అంటూ ఆమె తన మాటలు ముగించారు. ■



పెద్ద సవాళ్లు ముందున్నాయి

అప్పటి వరకు తను ఉన్న దేశంలో పనులన్నీ వేగంగా జరిగిపోయేవి. కానీ భారతదేశంలో దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. చివరకు వైస్ ఛాన్సలర్‌ని కలవడం కూడా కష్టంగా మారిపోయింది. దాంతో తన రాజకీయ పరిచయాలతో రాష్ట్రపతి ఆమోదం తీసుకున్నారు. ఇప్పుడు బీహెచ్‌యూలో కొత్త ఫ్యాకల్టీకి రమాదేవి వ్యవస్థాపక డీన్. క్యాంపస్‌లోని గొర్రెలు, డెయిరీ ఫామ్‌లకు కూడా ఆమె బాధ్యత వహిస్తున్నారు. మొదటి ఏడాది వరకు ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ భవనం ఖాళీగా ఉంది. ఏడాది తర్వాత మొదటి బ్యాచ్ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు చేరారు. ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది కలిసి బృందం మొదటి బ్యాచ్ కోసం ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. అలా వైద్యులు బీహెచ్‌యూ నుండి పట్టభద్రులయ్యారు. తర్వాత కాలంలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ కూడా అక్కడ ప్రారంభించారు.



ముక్కు దిబ్బడా..?

ముక్కు దిబ్బడ సాధారణమైన సమస్య. ఈ సమస్యతో చాలా అసౌకర్యం కలుగుతుంది. ఇది శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తో పాటు, నిద్రకూ అంతరాయం కలిగిస్తుంది. ఈ సమస్యకు కొన్ని ఇంటి చిట్కాలను చూద్దాం.

ఉప్పు నీటితో గార్గిల్

ఉప్పు కలిపిన నీటిని ముక్కులో వేసుకోవడం ద్వారా ముక్కులో ఉండే తేమ పెరుగుతుంది. ఫలితంగా దిబ్బడ తగ్గుతుంది. ఉప్పు నీరు ముక్కులో ఉండే వ్యర్థాలను తొలగించి శ్వాసనాళాలను శుభ్రం చేస్తుంది. గోరువెచ్చని నీటిలో చిటికెడు ఉప్పు కలిపి, ఆ ద్రావణాన్ని ముక్కులో తీసుకోవాలి.

వేప లేదా యూకలిప్టస్ నూనె

యూకలిప్టస్ ఆయిల్ లేదా వేప ఆయిల్ తో ముక్కు దిబ్బడను తగ్గించుకోవచ్చు. ఈ నూనెలను ఆవిరి పట్టడం వల్ల శ్వాస నాళాల్లో ఉండే శ్లేష్మాన్ని కరిగించి, శ్వాస మార్గాలను సాఫీగా చేస్తాయి. గోరువెచ్చని నీటిలో 2-3 చుక్కల యూకలిప్టస్ నూనె లేదా వేప నూనె వేయాలి. ఈ నీటి నుంచి వచ్చే ఆవిరిని దుప్పటి కప్పుకుని ముక్కు ద్వారా, నోటి ద్వారా పీల్చుకోవాలి.

ఆవిరి పట్టడం

ఆవిరి పట్టడం ద్వారా ముక్కులోని శ్లేష్మాన్ని సులభంగా కరిగించి, దిబ్బడను తగ్గించుకోవచ్చు.

ఒక పాత్రలో వేడి నీటి ఆవిరిని దుప్పటి కప్పుకుని శ్వాసగా తీసుకోవాలి. దీని వల్ల ముక్కులో ఉండే శ్లేష్మం త్వరగా కరుగుతుంది.

గోరువెచ్చని నీరు తాగడం

గోరువెచ్చని నీళ్ల లేదా ఇతర పానీయాలు తాగడం ద్వారా ముక్కులో ఏర్పడిన అదనపు శ్లేష్మాన్ని తగ్గించుకోవచ్చు. ఇది శరీరానికి తేమను అందించి శ్వాస మార్గాలను తెరిచి, ముక్కులో నెమ్మదిగా శ్వాస తీసుకోవడంలో సహాయపడుతుంది.

తేనె, అల్లం

అల్లం రసానికి తేనె కలిపి తీసుకుంటే ముక్కు దిబ్బడ తగ్గుతుంది. అల్లం కషాయం వెచ్చగా తాగినా మంచి ఫలితం ఉంటుంది. అల్లంలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు శ్వాస మార్గాలను సాఫీ చేస్తాయి.

ఒక టీ స్పూన్ అల్లం రసం, ఒక టీ స్పూన్ తేనె కలిపి తాగడం ద్వారా ఉపశమనం పొందవచ్చు.

తగినంత విశ్రాంతి

విశ్రాంతి తీసుకోవడం వల్ల శరీరానికి శక్తి సంతరించుకుని వ్యాధిని ఎదుర్కోవడానికి సమాయత్తం అవుతుంది. ఇన్ఫెక్షన్ త్వరగా తగ్గుతుంది.

దేశ రక్షణలో రాజకీయాలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందని అన్నారు. కొందరు వ్యక్తులు ఈ ప్రాజెక్టు గురించి తప్పుడు సమాచారాన్ని సృష్టిస్తున్నారన్నారు. పర్యావరణానికి నష్టం జరుగుతుందని అంటున్నారని.. కానీ, ఈ ప్రాజెక్టు పర్యావరణానికి హాని కల్గించదని చెప్పారు. దేశ రక్షణ, భద్రత విషయంలో కేంద్రం మరింత కట్టుబడి పని చేస్తుందన్నారు. ప్రాజెక్టు ఏర్పాటుకు అన్నివిధాలా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా నిలిచారని, ఆయనకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కేంద్ర మంతి కృతజ్ఞతలు తెలిపారు.

వీఎల్‌ఎఫ్ రావడం గర్వకారణం : సీఎం రేవంత్

దేశ రక్షణలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రక్షణకు సంబంధించి కీలకమైన డిఫెన్స్, ఎన్ఎఫ్‌సీలాంటి కేంద్రాలకు హైదరాబాద్ గుర్తింపు పొందిందన్నారు. కొందరు వీఎల్ఎఫ్‌ను వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నార న్నారు. ప్రజలకు అన్యాయం జరుగుతుందని అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. తమిళనాడులోనూ 1990లో ఇలాంటిదే ప్రారంభించారని. అక్కడి ప్రజలకు ఎలాంటి నష్టమూ జరగలేదని అన్నారు. దేశంలో మన ప్రాంతంలో రెండో వీఎల్ఎఫ్ రావడం గర్వకారణమన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను తెలంగాణ సమాజం గుర్తించాలన్నారు. వివాదాలకు తెర లేపుతున్న వారు దేశ రక్షణ గురించి ఆలోచన చేయాలని కోరారు. 'దేశం ఉంటేనే మనం ఉంటాం.. మనం ఉంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది' అని అన్నారు. 2017లో గత ప్రభుత్వ హయాంలోనే భూ బదలాయింపు, నిధుల కేటాయింపు లాంటి పూర్తి నిర్ణయాలన్నీ జరిగాయని చెప్పారు. ప్రాజెక్టును ప్రారంభించాలని రాజ్‌నాథ్‌సింగ్ అడగ్గానే తాము కొనసాగించామన్నారు. దేశ రక్షణ విషయంలో రాజీ పడొద్దని.. పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. 'పర్యావరణ ప్రేమికులకు నేను ఒకటే చెబుతున్నా.. దేశం, ప్రజలు సురక్షితంగా ఉంటేనే పర్యావరణ రక్షణ గురించి ఆలోచించగలం' అని అన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే పార్టీలు, రాజకీయాలు చేయాలని దేశ రక్షణ విషయంలో కలిసికట్టుగా ముందుకెళ్లాలన్నారు. వీఎల్ఎఫ్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందన్నారు. ఇక్కడ ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చేవారిని అనుమతించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే విద్యా సంస్థల్లో స్థానిక విద్యార్థులకు 1/3వ వంతు సీట్లు కేటాయించాలని సీఎం కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డికె.అరుణ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలే యాదయ్య పాల్గొన్నారు.

నిర్బంధాల మధ్య నేవీ రాడార్‌కు శంకుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. శంకుస్థాపన జరిగే కార్యక్రమానికి ఎవరూ వెళ్లకుండా అడుగడుగునా చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అరెస్టైన వారిలో దామగుండం పరిరక్షణ కమిటీ జేఏసీ చైర్మెన్ దేవనోని గూడెం వెంకటయ్య, నాయకులు లక్కన్ సత్యనారాయణ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్, ఏఐకేఎంఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వై.మహేందర్, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు వై.గీత, వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. అరెస్టులను ఖండించారు. నేవీ రాడార్‌పై ప్రజల్లో ఉన్న భయాందోళలను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలకు సేవ చేయరా?

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేయాలని క్యాట్‌ను కోరారు. వాదనల అనంతరం డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఆదేశాలు ఇచ్చేందుకు నిరాకరించిన క్యాట్, ప్రతివాదులైన కేంద్రం, డీవోపీటీలకు నోటీసులు ఇచ్చింది. నవంబరు ఐదులోపు కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. ఏపీకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేస్తూ ఐఏఎస్‌లకు ఆదేశాలు జారీ చేసింది.

అదానీ సిమెంట్‌తో అపాయం

(మొదటిపేజీ తరువాయి)

మందగించడం, అంగవైకల్యం వంటి వ్యాధులు ప్రబలుతాయని, గ్రామీణ వృత్తులు దెబ్బతినే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రజా ఆరోగ్యాన్ని పర్యావరణాన్ని దెబ్బతీసే కాలుష్య పరిశ్రమకు వ్యతిరేకంగా ముక్తకంఠంతో పోరాడి భవిష్యత్ తరాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రతిఘటించకపోతే భవిష్యత్ లేదు..

అదానీకి, కాలుష్య పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమై ఉద్యమించకుంటే భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పట్టణ ప్రాంతాల అభివృద్ధి(పట్నం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి.నర్సింహారావు అన్నారు. సిమెంట్ పరిశ్రమలు నెలకొల్పిన ప్రాంతాల్లో పరిసర గ్రామాలు ఎక్కడా అభివృద్ధి చెందలేదని, ప్రజలు పోరాడకుండా, అడ్డుకోకుండా నిర్బంధాలు మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 23న నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణకు అన్ని గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చి పరిశ్రమ ఏర్పాటును అడ్డుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీలు ఐక్యంగా ప్రజలను తరలించాలని చెప్పారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకోవడానికి ఈ సందర్భంగా తీర్మానించారు. దశలవారీ పోరాట కార్యాచరణ రూపొందించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్‌రెడ్డి, జల్లెల పెంటయ్య, బీఆర్ఎస్ మండల కార్యదర్శి పోచబోయిన మల్లేశం, బీజేపీ మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య, సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, టీడీపీ నాయకులు మీర్జా ఫజల్‌బేగ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల నరేందర్, బీఎస్పీ నాయకులు గూని రాజు, పీఏసీఎస్ చైర్మెన్ నంద్యాల భిక్షంరెడ్డి, అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు.

రాడార్ స్టేషన్ దేశభద్రతకు కీలకం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికారాబాద్ జిల్లా దామగుండం అటవీప్రాంతంలో భారత నావికాదళం ఏర్పాటు చేయనున్న వెరీ లో ఫ్రీక్వెన్సీ కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్(రాడార్ సెంటర్) దేశభద్రతకు, రక్షణ శాఖకు కీలకం కానున్నదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. ఆ ప్రాజెక్టు తెలంగాణకు రావడం శుభప్రదం అన్నారు. దేశభద్రతకు సంబంధించిన ప్రాజెక్టుపై రాజకీయాలు తగవని హితవు పలికారు. దానివల్ల స్థానికులకు వందలాది ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. అడవిలో లక్షలాది చెట్లను నరికివేస్తారనీ, రామలింగేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లనివ్వరని జరుగుతున్న ప్రచారాలను కొట్టిపడేశారు.

మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అక్కడ ఒక్క చెట్టును కూడా నరకరనీ, కేవలం 1500 చెట్లను మాత్రమే రీలొకేట్ చేస్తారని చెప్పారు. చెట్లు లేని కొంత ప్రాంతంలోనే నేవీ సిబ్బందికి వసతి గృహాలను ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఆ అటవీ ప్రాంతంలోని చెట్ల రక్షణ కోసం అటవీశాఖకు ఇప్పటికే రూ.130 కోట్లను రక్షణ శాఖ బదిలీ చేసిందన్నారు. రాడార్ స్టేషన్ నుంచి ఓడలు, సబ్‌మెరైన్‌లకు సంబంధించిన కమ్యూనికేషన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తారని చెప్పారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు వచ్చాయనీ, 2017న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు అనుమతులిస్తూ జీవో నెంబర్ 44ని జారీ చేసిందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ కుటుంబం బాధ్యతారాహిత్యంగా, రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

దామగుండం కోసం పోరాటం చేస్తామని కేటీఆర్ మాట్లాడటాన్ని తప్పుబట్టారు. సికింద్రాబాద్‌లోని బైసన్‌పోల్‌లో భూమిని రాష్ట్ర సచివాలయం కోసం ఇస్తే అప్పుడే దామగుండం భూమి కేటాయింపు జరిగిపోయేదన్నారు. బైసన్‌పోల్ భూమిని సచివాలయానికి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ రక్షణ శాఖకు క్రీడాకారులు, పర్యావరణవేత్తలు లేఖరాయడంతో రక్షణ శాఖ వెనక్కి తగ్గిందన్నారు.

దామగుండ రామలింగేశ్వర స్వామి ఆలయానికి మరిన్ని సౌకర్యాలు కల్పించేలా రక్షణశాఖతో సంప్రదిస్తామనీ, గుడి విషయంలో అవాస్తవాలు ప్రచారం చేయవద్దని కోరారు. పర్యావరణ పరిరక్షణ, అడవులను, పచ్చదనాన్ని పెంపొందించడంలో రక్షణశాఖదే అగ్రస్థానం అని చెప్పారు. దేశ రక్షణ విషయంలో, దేశ సైనికుల విషయంలో రాజకీయాలు చేయకూడదని బీఆర్ఎస్, ఇతర పార్టీల నేతలను కోరారు.

సీఎం రేవంత్‌తో కొండా భేటీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

సీఎం రేవంత్‌రెడ్డితో దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ భేటీ కావడం సర్వసాధారణం. కానీ ఇటీవల కొండా సురేఖ కేంద్రంగా జరుగుతున్న వరుస ఘటనల నేపథ్యంలో మంగళవారం సీఎంతో భేటీ అయ్యారన్న వార్త రాజకీయంగా చర్చనీయాంశమైంది. అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రి ప్రత్యేకంగా సమావేశమైనట్టు తెలిసింది. కొండా సురేఖ బీఆర్ఎస్ నేత కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని సినీ నటుడు నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపిన విషయం విదితమే. అంతకంటే ముఖ్యంగా పరకాల నియోజకవర్గంలోని గీసుగొండ మండలంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో విభేదాలు తారాస్థాయికి చేరాయి. దసరా పండుగరోజు జరిగిన ఫ్లెక్సీల వివాదం పోలీస్ స్టేషన్‌దాకా వెళ్లడం, ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌లోనే ఎస్ఐ కుర్చీలో కూర్చోవడం వివాదాస్పదం అయింది. హోంమంత్రిగా సీఎం రేవంత్‌రెడ్డి ఉండటంతో పోలీసు ఉన్నతాధికారులు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. మంత్రిగా వుండి ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేతలు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం చేయాల్సి వుండగా, సమస్యలు సృష్టిస్తుండటం అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికి మింగుడు పడటం లేదు. మంత్రిగా ఉంటూ పార్టీ అంతర్గతంగా జరగాల్సిన వాటిని పోలీసు స్టేషన్ వరకు తీసుకెళ్లడాన్ని కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకున్నట్టు తెలిసింది. దీనిపై సీఎం జోక్యం చేసుకొని 'కొండా'ను నియంత్రించాలని పార్టీ హైకమాండ్ సూచించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సీఎం మంత్రి సురేఖను మందలించినట్టు కాంగ్రెస్‌పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. తొందరపాటు తగదని, మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సీఎం హితవు పలికినట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

వయనాడ్ బరిలో ప్రియాంకా గాంధీ

ఢిల్లీ: కేరళలో ఒక లోక్‌సభ, రెండు అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ బరిలో దిగుతున్నట్టు ఆ పార్టీ అధికారికంగా ప్రకటించింది. పాలక్కడ్, చెలక్కార (ఎస్సీ) అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులుగా రాహుల్ మమ్‌కూటథిల్, రమ్య హరిదాస్ పేర్లను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడిం చారు. కాంగ్రెస్ తాజా నిర్ణయంతో ప్రియాంకా గాంధీ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో దిగుతున్నట్టైంది. లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాల నుంచి గెలిచిన రాహుల్.. కీలకమైన ఉత్తర్ ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలోనే కొనసాగాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో కేరళలోని వయనాడ్‌ను వదులుకోవడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఇక్కడి నుంచి ప్రియాంకా గాంధీని పోటీ చేయించాలని ఖర్గే నివాసంలో జులైలో జరిగిన సమావేశంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. వయనాడ్ నుంచి ప్రియాంక ఎన్నికైతే తొలిసారిగా ఆమె పార్లమెంటులో అడుగుపెడతారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు 15 రాష్ట్రాల్లో రెండు లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలకు ఈసీ మంగళవారం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కేరళకు సంబంధించి తమ అభ్యర్థులను ప్రకటించింది. వయనాడ్ లోక్‌సభ సీటుతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న పోలింగ్ జరగనుంది.

నేడు జమ్ముకాశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్ (ఎస్‌కెఐసీసీ) లో జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఒమర్ అబ్దుల్లాతో పాటు మంత్రులుగా తొమ్మిది మంది ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎస్‌కెఐసీసీని పూలతో అలంకరించడంతో పాటు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే జమ్ముకాశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వ ఏర్పాటుకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జీఎన్ మాలిక్, ఆప్ జాతీయ కార్యదర్శి పంకజ్ కుమార్ గుప్తా, స్వతంత్ర ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పయారే లాల్ శర్మ, సతీష్ శర్మ, మహ్మద్ అక్రమ్, రామేశ్వర్ సింగ్, ముజాఫర్ ఇక్బాల్ ఖాన్ మద్దతు తెలుపుతూ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) సమన్వయ కర్త ప్రకాశ్‌కరత్, ఎస్పి అధినేత అఖిలేశ్ యాదవ్, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే, శిరోమణి అకాలీదళ్ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌తో పాటు వివిధ పార్టీల నేతలు హాజరు కానున్నారు. ఆయా పార్టీల నేతలు ఇప్పటికే శ్రీనగర్ చేరుకున్నారు. జమ్మూ కాశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా కల్పించాలని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు మోగిన నగారా

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. 81 అసెంబ్లీ స్థానాలకు గానూ రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి విడతలో 43 స్థానాలకు నవంబర్ 13న ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిన 38 స్థానాలకు నవంబర్ 20న ఎన్నికలు ఉంటాయి. ఇక నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. రాష్ట్రంలో మొత్తం 2.6 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 29,562 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఈసీ తెలిపింది. ఇక వచ్చే ఏడాది జనవరి 5తో జార్ఖండ్ అసెంబ్లీ గడువు ముగియనుంది.

ఈ సందర్భంగా సీఈసీ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ మొత్తం వెబ్‌కాస్టింగ్ చేయనున్నట్టు తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణకు సి విజిల్ యాప్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. మద్యం, డ్రగ్స్, కానుకలు పంపిణీ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ వాలెట్‌లపైనా నిఘా ఉంటుందని, సోషల్ మీడియాలో వచ్చే వార్తలపై నిఘా పెడుతున్నట్టు సీఈసీ తెలిపారు. మరోవైపు జమ్మూ కాశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై కూడా సీఈసీ రాజీవ్ కుమార్ స్పందించారు. 'జమ్మూ కాశ్మీర్, హర్యానా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాం. కాశ్మీర్ ఎన్నికల నిర్వహణపై ప్రపంచ దేశాల నుంచి ప్రశంసలు అందాయి. ఉగ్రదాడులకు భయపడకుండా ప్రజలు ఓటేశారు. హింసాత్మక ఘటనలు ఒక్కటీ జరగకుండా ఎన్నికలు నిర్వహించాం. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించినా కొందరు విమర్శలు చేస్తున్నారు' అని అన్నారు.

ఉప ఎన్నికలకూ షెడ్యూల్ విడుదల

ఇక దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకూ ఉప ఎన్నికలు నిర్వహించటానికి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ రాజీనామాతో ఖాళీ అయిన కేరళలోని వయనాడ్, మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ స్థానాలతో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని మొత్తం 48 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. వయనాడ్, 47 అసెంబ్లీ సీట్లకు నవంబర్ 13న, నాందేడ్ లోక్‌సభ స్థానంతో పాటు ఒక అసెంబ్లీ సీటుకు నవంబర్ 20న పోలింగ్‌ను నిర్వహించనున్నారు. ఈ ఉప ఎన్నికల ఫలితాలు కూడా అదే నెల 23న వెలువడనున్నాయి.

ఏం మారింది?

ఆర్టీసీలో అప్పుడూ... ఇప్పుడూ అదే తంతు
అటకెక్కిన విలీనం-కొనసాగుతున్న కార్మిక సంఘాల నిషేధం
'సీసీఎస్' ఎక్కడ వేసిన గొంగడి అక్కడే..
'మహాలక్ష్మి'తో కార్మికులపై పెరిగిన పనిభారం
చాలని బస్సులు
ప్రయాణికుల తిప్పలు
ఉత్తుత్తి వెల్ఫేర్ బోర్డులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పదేండ్ల క్రితం ఉన్న టీఎస్ ఆర్టీసీ, ఇప్పుడున్న టీజీ ఆర్టీసీలో ఏం మార్పులొచ్చాయి. 'ఎస్' స్థానంలో 'జీ' చేరడం తప్ప, కార్మికులకు, సంస్థకు, కార్మిక సంఘాలకు ఒనగూరిన ప్రయోజనం ఏముంది? బీఆర్ఎస్ పాలనలో 55 రోజులు సమ్మె చేసి, అరిగోస పడిన ఆర్టీసీ కార్మికులు, గంపెడాశతో కాంగ్రెస్‌ను భుజానికెత్తుకున్నారు. జీవితాల్లో కాస్తో కూస్తో మార్పులు వస్తాయేమో అని ఆశపడ్డారు. కానీ అప్పుడూ, ఇప్పుడూ ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతల్లో ఎలాంటి మార్పు లేదు. ప్రభుత్వం ఆర్టీసీని, కార్మికులను, ప్రయాణీకులను విభజించి, పాలిస్తుండటంతో ఐక్యంగా ప్రశ్నించే గొంతులు మూగబోతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఆర్టీసీలో కార్మిక సంఘాలను రద్దు చేసి, వాటి స్థానంలో ఎంప్లాయీ వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పుడూ అదే పద్ధతి కొనసాగుతున్నది. తాజాగా ఎంప్లాయీ వెల్ఫేర్ బోర్డుల్ని పునరుద్ధరించాలని స్వయంగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ యాజ మాన్యానికి లేఖ రాయడం, కొత్త సభ్యులతో వాటిని పునరుద్ధ రించడం జరిగిపోయాయి. 2023 ఎన్నికల్లో కార్మిక సంఘాలపై నిషేధాన్ని ఎత్తేస్తామని స్వయంగా కాంగ్రెస్‌పార్టీ తన మ్యానిఫెస్టోలో పేర్కొంది. దాన్ని అమలు చేయమని కోరితే ఇదిగో..అదిగో అంటున్నారు. బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవడానికి కొద్ది రోజుల ముందు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని ప్రకటించింది. ఆ మేరకు అసెంబ్లీల్లో బిల్లు ఆమోదం పొందడం, అప్పటి గవర్నర్ తమిళిసై దాన్ని ఆమోదించడం జరిగిపోయాయి. కాంగ్రెస్ ఈ అంశాన్ని కూడా తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి, తాము అధికారంలోకి రాగానే విలీన ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొంది. కానీ ఇప్పటికీ అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించలేదు. విలీన ప్రక్రియ ఏమాత్రం ముందుకు కదలట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన మహాలక్ష్మి స్కీం (ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం)తో కార్మికులపై పనిభారాలతో పాటు అనేక సమస్యలు పెరిగాయి. వాటి పరిష్కారం కోసం ఎలాంటి ప్రయత్నాలు జరగట్లేదని కార్మిక సంఘాలు మొత్తుకుంటున్నాయి. మరోవైపు మహాలక్ష్మి స్కీం అమల్లో భాగంగా ఆర్టీసీకి ప్రభుత్వం చేయాల్సిన రీయింబర్స్‌మెంట్ సొమ్ము ఏనెలకు ఆనెల రావట్లేదు. దీనితో సంస్థ నిర్వహణ కష్టంగా మారుతున్నది. ఆర్టీసీ కార్మికులు సొంతంగా ఏర్పాటు చేసుకున్న




కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్)లోని రూ.1,200 కోట్ల సొమ్మును యాజమాన్యం సొంతానికి వాడుకున్నది. దానిలో దశలవారీగా కొంత మొత్తాన్నే చెల్లించారు. ఆసొసైటీ పాలకమండలి పదవీకాలం ముగిసినా, ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించలేదు. అదే సమయంలో ఆర్టీసీలో అద్దె బస్సుల సంఖ్య 2,750కి పెరిగింది. మరో వెయ్యి ఎలక్ట్రిక్ అద్దె బస్సుల్ని సంస్థలోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సంస్థలో మూడువేల పోస్టుల రిక్రూట్‌మెంట్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఐదు నెలలు దాటింది. ఇప్పటికీ ఆ పోస్టుల భర్తీలో ఎలాంటి పురోగతి లేదు. గతంలో కార్మికులకు రావల్సిన ఆర్థిక ప్రయోజనాలను ఒకేసారి వారి ఖాతాల్లో జమచేసేవారు.

ఇప్పుడు అందుకు భిన్నంగా డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్‌లు, సెక్యూరిటీ సిబ్బందిని వేరు చేసి, ఒక్కోనెలలో ఒక్కొక్కరి ఖాతాల్లో సొమ్ము జమచేస్తున్నారు. సంస్థలో కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేయడం కోసమే ఈ తరహా చర్యలకు పాల్పడుతున్నారని కార్మిక సంఘాలు ఘోషిస్తున్నాయి. పలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, యాజమాన్యానికి ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలతోనూ సంబంధం లేదు. అయినా నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతున్నది. బస్సెక్కి ఏ డ్రైవర్, కండక్టర్‌ను అడిగినా తమ తలరాతలు ఏం మారలేదనే నిట్టూర్పులే వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసీపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయండి

చదువు వేరు...ప్రాక్టికల్స్ వేరు
అంకితభావం, నిబద్దతతో పనిచేయండి
పంచాయతీరాజ్ ఏఈఈల శిక్షణా కార్యక్రమంలో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఏఈఈలు కృషి చేయాలని డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. చదువులు వేరు.. క్షేత్రస్థాయిలో చేసే పనులు వేరుగా ఉంటాయనీ, సీనియర్ల సహకారం తీసుకుంటూ అకింతభావం, నిబద్ధతతో పనిచేయాలని సూచిం చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ లో గల పంచాయతీరాజ ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఇటీవల నియామక పత్రాలు



అందుకున్న నూతన ఏఈఈల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడొద్దనీ, చేసే పనే గుర్తింపు తెచ్చిపెడుతుందని చెప్పారు. బీహార్‌లో చాలా బ్రిడ్జిలు కూలిపోతు న్నాయనీ, చాలా మంది చనిపోతున్నారని ప్రస్తా వించారు. ఆ దుర్ఘటనలను గుణపాఠంగా తీసుకుని రాజకీయ, ఇతర ఒత్తిళ్లకు లొంగకుండా నిక్కచ్చిగా పనిచేయాలని సూచించారు. నూతన ఏఈఈలలో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చినవాళ్లే ఉన్నారనీ, ఆ ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు, ఇతర వసతులు కల్పించే బాధ్యత వారిదేనని చెప్పారు. తాను ఎంతో కష్టపడ్డాననీ, పదేండ్ల ఉద్యమ జీవితం, 20 ఏండ్ల రాజకీయ ప్రస్థానంతో ఈ స్థితికి ఎదిగానని వివరించారు. కష్టపడి పనిచేసుకుంటూ పోతే తప్పకుండా గుర్తింపు వచ్చితీరుతుందన్నారు. రాష్ట్రంలో తాజాగా రూ.1375 కోట్లతో గ్రామీణ రహదారులను నిర్మిస్తున్నామనీ, వాటి నిర్మాణంలో ఉద్యోగికాకుండా సేవకుల్లా పనిచేయాలని సూచిం చారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో అతి త్వరలో 500కుపైగా కారుణ్య నియామకాలు చేపడతామని చెప్పారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి ఇంజినీర్లను మీరు ఆదర్శంగా తీసుకోవాలని ఏఈఈలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్సీ కనకరత్నంతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన ఏఈఈలకు శాఖ డైరీలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను ఏఈఈలు, అధికారులు సన్మానించారు.



ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్స్‌పై కన్నేసిన టీమ్ ఇండియా సొంతగడ్డపై వరుసగా ఆరు విజయాలతో ఊపుమీదుండగా.. నేడు బెంగళూర్‌లో ఆ రికార్డుకు బ్రేక్ వేసేందుకు వరుణుడు రంగం సిద్ధం చేస్తున్నాడు. భారత్, న్యూజిలాండ్ తొలి టెస్టు నేడు చిన్నస్వామి స్టేడియంలో ఆరంభం కానుంది. రోహిత్‌సేన హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుండగా.. న్యూజిలాండ్ కేన్ విలియమ్సన్ లేకుండా సమరానికి సిద్ధమైంది.

వరుణుడు ఆడనిచ్చేనా?

- బెంగళూర్ టెస్టుకు వర్షం ముప్పు
- నేటి నుంచి భారత్, కివీస్ తొలి టెస్టు

ఉదయం 9.30 నుంచి జియో సినిమాలో..

నవతెలంగాణ-బెంగళూర్

ఎడతెగని వర్షం, దారుణ డ్రైనేజీ వ్యవస్థతో కాన్పూర్ టెస్టులో ఫలితం తేలని పరిస్థితుల్లో టీమ్ ఇండియా అసమాన బ్యాటింగ్ నైపుణ్యాలు ప్రదర్శించి అద్భుత విజయం అందుకుంది. ఇప్పుడే బెంగళూర్‌లోనూ అటువంటి పరిస్థితులే భారత్‌కు మరో సవాల్ విసరనున్నాయి. చిన్నస్వామి స్టేడియంలో డ్రైనేజీ వ్యవస్థతో ఎటువంటి ఇబ్బంది లేకపోయినా.. కనీసం రెండు రోజుల పాటు వర్షం ఆటకు తీవ్ర ఆటంకం కలిగించేందుకు సిద్ధమవుతున్నాడు. విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న టీమ్ ఇండియా.. ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఫలితం రాబట్టే ప్రణాళికలు రచిస్తోంది. భారత్, న్యూజిలాండ్ తొలి టెస్టు నేటి నుంచి బెంగళూర్ చిన్నస్వామి స్టేడియంలో ఆరంభం కానుంది.

కోహ్లి మెరిసేనా?

విరాట్ కోహ్లి ఫామ్‌లో ఉన్నాడా? ఫామ్ కోల్పోయాడా? అనే విషయాన్ని ఎవరూ స్పష్టంగా చెప్పలేరు. గత ఎనిమిది టెస్టుల్లో విరాట్ కోహ్లి రెండు సెంచరీలు మాత్రమే సాధించాడు. ఇంగ్లాండ్, బంగ్లాదేశ్‌తో టెస్టుల్లో అంచనాలను అందుకోలేదు. జట్టులోని యువ ఆటగాళ్ల రాణించటంతో బ్యాటింగ్ లైనప్ వైఫల్యాలు పెద్దగా కనిపించటం లేదు. కానీ సీనియర్ బ్యాటర్లలో విరాట్ కోహ్లి సహా రోహిత్ శర్మ స్థాయి తగ్గ ప్రదర్శన చేయటం లేదు. ఈ ఏడాది ఆఖర్లో ఆస్ట్రేలియాతో సిరీస్ రానుండటంతో ఈ ఇద్దరు బ్యాటర్లు ఫామ్‌లోకి రావాలని జట్టు మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. ఐపీఎల్ సొంతగడ్డ చిన్నస్వామి టెస్టు కావటంతో సహజంగానే విరాట్ కోహ్లిపై స్పెషల్ ఫోకస్ నెలకొంది. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ మరోసారి బ్యాటింగ్ విభాగంలో కీలకం కానున్నారు. రిషబ్ పంత్ ఎక్స్ ఫ్యాక్టర్‌గా కొనసాగనున్నాడు. పిచ్ పరిస్థితుల ఆధారంగా తుది జట్టులో ముగ్గురు పేసర్లు లేదా ముగ్గురు స్పిన్నర్లను ఎంచుకోనున్నారు. మూడో పేసర్, మూడో స్పిన్నర్ రేసులో ఆకాశ్ దీప్, కుల్దీప్



యాదవ్ పోటీపడుతున్నారు. జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, జడేజా, అశ్విన్‌లతో కూడిన బౌలింగ్ బృందం భీకర ఫామ్‌లో ఉంది.

కివీస్ పుంజుకునేనా?

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ మాజీ చాంపియన్ న్యూజిలాండ్ ఇప్పుడు కష్టాల్లో కూరుకుంది. అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టు వర్షార్పణం కాగా.. శ్రీలంకతో రెండు మ్యాచుల టెస్టు సిరీస్‌ను 0-2తో కోల్పోయింది. శ్రీలంక స్పిన్ సవాల్, కమిండ్ మెండిస్ మెరుపుల ముంగిట కివీస్ తేలిపోయింది. స్వదేశంలో ఆరు టెస్టుల అజేయ రికార్డుతో దూసుకెళ్తున్న భారత్‌ను ఢీకొట్టడం న్యూజిలాండ్‌కు అంత సులువు కాదు. స్టార్ బ్యాటర్, అనుభవశాలి కేన్ విలియమ్సన్ సేవలు సైతం నేడు తొలి టెస్టుకు అందుబాటులో లేవు. కానీ న్యూజిలాండ్ శిబిరంలో ప్రతిభావంతులకు కొదవలేదు. డెవాన్ కాన్వే, మిచెల్ డార్లీ, టామ్ లేథమ్, రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్‌కు ఇక్కడి పిచ్‌లపై మంచి అవగాహన ఉంది. మేఘావృత వాతావరణంలో పేస్‌కు అనుకూలించే పిచ్‌పై సహజంగానే కివీస్ బ్యాటర్లు మెరుగ్గా రాణించేందుకు అవకాశం ఉంది. కివీస్ బ్యాటింగ్ లైనప్‌కు భారత్‌పై మంచి రికార్డుంది. టిమ్ సౌథీ, మిచెల్ శాంట్నర్ సహా అజాజ్ పటేల్‌కు ఇక్కడ వికెట్ల వేటలో ఏం చేయాలో బాగా తెలుసు. గత సిరీస్ వైఫల్యాల నుంచి బయటికొచ్చి భారత్‌కు దీటుగా బదులివ్వటం న్యూజిలాండ్‌కు కఠిన సవాల్. కెప్టెన్ టామ్ లేథమ్ ఏ విధంగా ఆ జట్టును నడిపిస్తాడో చూడాలి. చివరగా భారత్‌లో న్యూజిలాండ్ ఆడిన టెస్టులో అజాజ్ పటేల్ ఓ ఇన్నింగ్స్‌లో పది వికెట్లు పడగొట్టాడు. ఇప్పుడు అతడిని భారత బ్యాటర్లు ఏ విధంగా ఎదుర్కొంటారో చూడాలి.

పిచ్, వాతావరణం

బెంగళూర్ టెస్టుకు వర్షం గండం పొంచి ఉంది. తొలి రెండు రోజుల ఆట సాగటం అనుమానమే. వర్షం ప్రమాదం ఉన్నప్పటికీ.. చిన్నస్వామి స్టేడియంలో డ్రైనేజీ వ్యవస్థ అత్యంత అధునాతనం. వర్షం ఆగిన నిమిషాల వ్యవధిలో అవుట్‌ఫీల్డ్‌ను సిద్ధం చేయగలరు. వాతావరణ పరిస్థితులతో ఇక్కడి పిచ్ సీమర్లకు అనుకూలించనుంది. జట్టు ప్రణాళికలు సైతం మారనున్నాయి. బంగ్లాదేశ్‌తో సిరీస్ తర్వాత భారత్ మళ్లీ ముగ్గురు స్పిన్నర్ల ఫార్ములా పాటించటం లాంఛనమే అనిపించింది. కానీ మేఘావృత వాతావరణంలో ఇరు జట్లు ముగ్గురు సీమర్లతో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం మెండుగా ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), కెఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, ఆకాశ్ దీప్, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.



న్యూజిలాండ్ : డెవాన్ కాన్వే, టామ్ లేథమ్ (కెప్టెన్), విల్ యంగ్, రచిన్ రవీంద్ర, డార్లీ మిచెల్, టామ్ బ్లండెల్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ శాంట్నర్, టిమ్ సౌథీ, అజాజ్ పటేల్, విల్ ఓరొర్కె.

ఆ నిరీక్షణకు ముగింపు..




సాయి దుర్గ తేజ్

'విరూపాక్ష', 'బ్రో' బ్లాక్‌బస్టర్ విజయాల తర్వాత హీరో సాయి దుర్గ తేజ్ ఓ భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. నూతన దర్శకుడు రోహిత్ కెపి ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. 'హనుమాన్' సెన్సేషనల్ పాన్ ఇండియా విజయం తర్వాత నిర్మాతలు కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పై ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సాయి దుర్గ తేజ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ 'ఇంట్రూడ్ ఇన్‌టు ది వరల్డ్ ఆఫ్ ఆర్యాడీ' అనే ఎగ్జైటింగ్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో మూవీ యూనివర్స్‌ని గ్లింప్స్‌గా ప్రజెంట్ చేసింది. ఈవిల్ ఫోర్స్ కారణంగా చాలా కాలంగా కష్టాలు ఎదురుకుంటున్న ఓ నేల, తన రక్షకుని రాక కోసం ఎదురుచూస్తుంటుంది, ఫైనల్‌గా వారి నిరీక్షణ ముగుస్తుంది. ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

ప్రీ క్లైమాక్స్‌ని ఊహించలేరు

రామ్ కార్తీక్, కశ్వి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'వీక్షణం'. ఈ చిత్రాన్ని పద్మనాభ సినీ ఆర్ట్స్ బ్యానర్‌పై పి.పద్మనాభ రెడ్డి, అశోక్ రెడ్డి నిర్మిస్తున్నారు. కామెడీ మిస్టరీ థ్రిల్లర్ కథతో దర్శకుడు మనోజ్ పల్లేటి రూపొందించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ నెల 18న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం హీరో రామ్ కార్తీక్ మీడియాతో చిత్ర విశేషాలను షేర్ చేసుకున్నారు.

- నేను లాస్ట్ ఇయర్ 'ది గ్రేట్ ఇండియన్ సూసైడ్' అనే మూవీ చేశాను. ఆ టైమ్‌లోనే డైరెక్టర్ మనోజ్ పల్లేటి ఈ మూవీ స్క్రిప్ట్ చెప్పారు. మనం కథలు వినేప్పుడు నెక్స్ ఇలా జరుగుతుంది అనుకుంటాం. కానీ ఈ కథ విన్నప్పుడు అలా గెస్ చేయలేకపోయాను. ప్రీ క్లైమాక్స్‌తో పాటు మరికొన్ని హుక్ సీన్స్ ఉంటాయి. మా మూవీలో ప్రీ క్లైమాక్స్ ను ఎవరూ ఊహించలేరు.




రామ్ కార్తీక్

- ఈ సినిమాలో సరదాగా ఉండే కుర్రాడిగా కనిపిస్తా. పక్కవాడి జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే కోరిక ఉంటుంది. తనకున్న ఈ మనస్తత్వం వల్ల అతను ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు అనేది మెయిన్ పాయింట్. ఈ యువకుడి జీవితంలోకి ఓ అమ్మాయి రావడం, అతని కథ అనేక మలుపులు తిరగడం సినిమాలో చూస్తారు. సరదాగా ఉండే ఆ యువకుడు డిటెక్టివ్‌లా మారి తన చుట్టూ జరుగుతున్న విషయాలు ఏంటో తెలుసుకోవాలనుకుంటాడు.
- మా మూవీలో హీరో మరొకర్ని అబ్జర్వ్ చేస్తుంటాడు. కానీ అతనికి తెలియ కుండా మరో కన్ను ఆయన్ను చూస్తుంటుంది. అందుకే వీక్షణం అనే టైటిల్ పెట్టాం.
- ఈ సినిమా లవ్ స్టోరీతో స్టార్ట్ అయ్యి మిస్టరీ థ్రిల్లర్‌గా మారుతుంది. మా దర్శక, నిర్మాతలు అశోక్, మనోజ్ ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా నిర్మించారు.

నవచిత్రం


మట్కా.. కౌంట్‌డౌన్ స్టార్ట్



వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ భిన్న గెటప్స్‌లో నటించిన మూవీ 'మట్కా' రిలీజ్‌కు రెడీగా ఉంది. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డాక్టర్ విజ యేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు జోరందుకున్నాయి. ఇటీవల రిలీజ్ చేసిన ఫస్ట్ సింగిల్ 'లే లే రాజా..' చార్ట్ బస్టర్ రెస్పాన్స్‌తో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ అయ్యాయి.
నవంబర్ 14న సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. తాజాగా మేకర్స్ 'మట్కా' 30 డేస్ కౌంట్ డౌన్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. 'సైలెన్స్ విత్ విజన్' అనే క్యాప్షన్‌తో ప్రజెంట్ చేసిన ఈ పోస్టర్‌లో వరుణ్ తేజ్ వింటేజ్ అవతార్ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.
మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.
నవీన్ చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిషోర్, రవీంద్ర విజయ్, పి రవి శంకర్ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్, సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డీవోపీ: ఎ కిషోర్ కుమార్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, సీఈఓ: ఈవీవీ సతీష్.

దీపావళికి టైటిల్ టీజర్



బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ తన 109వ చిత్రాన్ని దర్శకుడు బాబీ కొల్లితో చేస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను భారీ స్థాయిలో నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి.
ఇప్పటివరకు నిర్మాతలు ఈ చిత్ర టైటిల్‌ను వెల్లడించలేదు. దీంతో టైటిల్‌తో పాటు, ఈ సినిమాకి సంబంధించిన ఇతర విషయాలు తెలుసు కోవాలని బాలయ్య అభిమానులు, సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే, ఈ దీపావళికి వారి నిరీక్షణకు తెరపడనుంది. దీపావళి శుభ సందర్భంగా, టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నారు.
ఈ సందర్భంగా నిర్మాతలు ఒక పోస్టర్‌ను విడుదల చేశారు.
ఈ చిత్రంలో గాడ్ ఆఫ్ మాసెస్‌ని వయొలెంట్ పాత్రలో దర్శకుడు బాబీ, స్టైలిష్‌గా చూపించబోతున్నారని స్పష్టమవుతోంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

కోహినూర్ కోసం..



సిద్దు జొన్నలగడ్డ

సిద్దు జొన్నలగడ్డ, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కలయికలో సినిమా వస్తుందంటే అది ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది అనే అభిప్రాయానికి తెలుగు ప్రేక్షకులు వచ్చేశారు.
వీరి కలయికలో వచ్చిన 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' చిత్రాలు బ్లాక్‌బస్టర్‌లుగా నిలిచి సంచలనాలు సృష్టించాయి. ఇప్పుడు హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్‌ని అందించడం కోసం ఈ అద్భుతమైన కలయికలో ముచ్చటగా మూడో సినిమా రాబోతుంది.
విజయదశమి శుభ సందర్భంగా భారతీయ సినిమా చరిత్రలో ఇంతవరకు ఎవరూ ఊహించని కథాంశంతో సినిమా చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.
భద్రకాళి మాత మహిమగా నిలిచిన ఐకానిక్ కోహినూర్ వజ్రం సామ్రాజ్యవాదుల చేతికి చిక్కింది. కోహినూర్ వజ్రాన్ని తిరిగి మూలాల్లోకి తీసుకు రావడానికి యువకుడు సాగించే చారిత్రాత్మక ప్రయాణంగా ఈ చిత్రం రూపొందనుంది. రచయిత-దర్శకుడు రవికాంత్ పేరెపు 'క్షణం' వంటి కల్ట్ థ్రిల్లర్‌ను అందించారు. అలాగే సిద్దు జొన్నలగడ్డతో 'కృష్ణ అండ్ హిజ్ లీల' అనే రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించారు. ఇప్పుడు మరోసారి వీరిద్దరూ కలిసి సరికొత్త కథాంశంతో సోషియో-ఫాంటసీ డ్రామాతో వస్తున్నారు.
సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

సందేశాత్మకంగా ఉగ్రావతారం

ఎస్‌జీఎస్ క్రియేషన్స్ బ్యానర్ పై ప్రియాంక ఉపేంద్ర సమర్పణలో ఎస్.జి.సతీష్ నిర్మాతగా గురుమూర్తి దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'ఉగ్రావతారం'.
ఈ చిత్రంలో ప్రియాంక ఉపేంద్ర లీడ్ రోల్‌లో నటించారు. సుమన్, నటరాజ్ పేరి, అజయ్, పవిత్రా లోకేష్, సాయి ధీనా, సుధి కాక్రోచ్, లక్ష్య శెట్టి వంటి వారు ముఖ్య పాత్రలు పోషించారు. తాజాగా విశ్వక్ సేన్ తండ్రి కరాటే రాజు, సత్య ప్రకాష్ సాంగ్‌ని రిలీజ్ చేయగా, నిర్మాత రాజ్ కందుకూరి ట్రైలర్‌ను లాంచ్ చేశారు.



ప్రియాంక ఉపేంద్ర

ప్రియాంక ఉపేంద్ర మాట్లాడుతూ, 'నా కెరీర్‌లో ఇదే ఫస్ట్ యాక్షన్ ఫిల్మ్. ఈ పాత్రకు నేను సెట్ అవుతానని దర్శకుడు గురుమూర్తి నమ్మారు. కెమెరామెన్ నందకుమార్ అందరినీ బాగా చూపించారు. నటరాజ్ అద్భుతంగా నటించాడు. రాజు తెలుగులో మంచి పాటలు, మాటలు ఇచ్చారు. కృష్ణ బస్రూర్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నవంబర్ 1న మా చిత్రం రాబోతోంది. నా తొలి పాన్ ఇండియన్ మూవీని అందరూ చూడండి' అని అన్నారు.
'సమాజంలో జరిగే అన్యాయాల్ని, అఘాయిత్యాల్ని మీడియా ప్రశ్నించి ఎదురించగలదు. మా చిత్రాన్ని అటువంటి సమస్యల మీదే తీశాను. మంచి సందేశాత్మక చిత్రంగా ఉంటుంది. ప్రియాంక కొత్త పాత్రలో కనిపిస్తారు' అని గురుమూర్తి చెప్పారు.

రివైండ్ రిలీజ్‌కి రెడీ

సాయి రోనక్, అమృత చౌదరి జంటగా క్రాస్ వైర్ క్రియేషన్స్ పై కళ్యాణ్ చక్రవర్తి స్వీయ దర్శకత్వంలో వస్తున్న సినిమా 'రివైండ్'.
ఈనెల 18న ఈ సినిమాని సౌత్ ఇండియా మొత్తంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.
నిర్మాత, దర్శకుడు కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ, 'మేము రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్, టీజర్‌కి చాలా అద్భుతమైన స్పందన వచ్చింది.
ఇటీవలే విడుదల చేసిన ట్రైలర్‌కి కూడా చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. అలాగే ఈ సినిమాలోని పాటలు సాఫ్ట్‌వేర్ వద్దురా, లవ్ ఎట్ ఫస్ట్ సైట్ ముఖ్యంగా లవ్ యు నాన్న సాంగ్ మంచి హైప్



సాయి రోనక్, అమృత చౌదరి

క్రియేట్ చేశాయి. అన్ని పాటలు మిలియన్ వ్యూస్‌తో సినిమా పై అంచనాలు పెంచాయి. కొత్త కాన్సెప్ట్‌తో టైమ్ ట్రావెల్ మీద ఈ సినిమాని మీ ముందుకు తీసుకొస్తున్నాం. సినిమా మీద నమ్మకంతో మీడియాకి షోలు వేశాం. చూసిన డిస్ట్రిబ్యూటర్స్ సినిమా నచ్చి విడుదల చేయడానికి ముందుకు వచ్చారు. సపోర్ట్ చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి కృతజ్ఞతలు. పవర్‌ఫుల్ కంటెంట్‌తో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. తెలుగు ప్రేక్షకులు కొత్తదనాన్ని, కొత్త కంటెంట్‌ని ఎప్పుడూ ప్రోత్సహిస్తారు. మా సినిమాని కూడా అదే విధంగా ప్రోత్సహించి ఆదరిస్తారని ఆశిస్తున్నాను. దర్శక, నిర్మాతగా నాకు ఈ సినిమా మంచి పేరు తీసుకొస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886